ENTERED

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం



Entered

సెప్టెంబర్ 7, 2008

సెలబ్రిటీ ఫొటోలు కోట్లు పలికే బేరాలు

హ్యాపీబర్త్‌డే

(2008 సెప్టెంబర్ 7 నుంచి- 2008 సెప్టెంబర్ 13వరకు)

కె. సందీప్(దత్తు)
6సం॥, సెప్టెంబర్-7
మాధవి-బసవయ్య
పిల్లాయిపల్లి-నల్లగొండ

కె. భవ్యశ్రీ
3సం॥, సెప్టెంబర్-12
అరుణ-సూరిబాబు
పెదగదిలి-విశాఖపట్నం

బన్ని
3సం॥, సెప్టెంబర్-8
భాగ్యలక్ష్మి-సురేష్
రావిరాల-రంగారెడ్డి

ఐ.మారుతీప్రసన్న
5సం॥, సెప్టెంబర్-8
సంధ్యారాణి-స్వరూప్
గుంటూరు

పఠాన్ అష్రఫ్‌ఖాన్
2సం॥, సెప్టెంబర్-8
మైమూన్-ఫఠాన్ బాషా
విజయవాడ-కృష్ణా

చరణ్
2సం॥, సెప్టెంబర్-10
కల్పన-దీపక్
బాలానగర్-రంగారెడ్డి

ఆర్. ఖ్యాతివర్ధన్
5సం॥, సెప్టెంబర్-8
రాజ్యలక్ష్మి-శ్రీనివాసరావు
విజయవాడ-కృష్ణా

అయేష మేరియా
3సం॥, సెప్టెంబర్-2005
మహ్మదా-ఛాన్‌పాషా
మనాజిపేట్-మ॥నగర్

ఎం. అరవింద్‌కుమార్
2సం॥, సెప్టెంబర్-11
అనిత-యాదగిరి
ఖానాపూర్-రంగారెడ్డి

Entered

విజ్ఞానాన్ని పంచుదాం ఉన్నతికి పాటుపడదాం

మన అతిథి

పేరు : డి.నర్సింహారెడ్డి
తల్లిదండ్రులు : అంజమ్మ, రాంరెడ్డి
పుట్టిన ఊరు : ఎర్రుపాలెం , ఖమ్మం జిల్లా
చదువు : పిహెచ్‌డి
హోదా : ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్, ఉస్మానియా యూనివర్సిటీ (1999-2008), సెంటర్ ఫర్ ఇంజనీరింగ్ టెక్నాలజీ డైరెక్టర్ (2001-2008) , జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, కూకట్‌పల్లి. ఆగస్టు 21, 2008 నుండి వైస్ చాన్సలర్

అభిరుచులు : న్యూస్ పేపర్ చదవడం, షటిల్ బ్యాడ్మింటన్ ఆడడం , సమాజ సేవ
రచనలు : టీచింగ్ స్కిల్స్‌పై ఆర్టికల్స్
నచ్చిన పుస్తకం: అబ్దుల్ కలాం రచించిన “వింగ్స్ ఆఫ్ ఫైర్”
ప్రేమించే వ్యక్తి : అమ్మ, అన్నయ్యలు
గుర్తింపు : బెస్ట్ ఇంజనీరింగ్ కాలేజి ప్రిన్సిపాల్ అవార్డు (భారతీయ విద్యా భవన్) ఎమినెంట్ ఇంజనీర్ అవార్డు (ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్)

పర్యటించిన దేశాలు : అమెరికా, ఇటలీ, స్పెయిన్, చైనా, మలేషియా, సౌత్ ఆఫ్రికా, కువైట్, ఇథియోపియా, ఆస్ట్రేలియా

సంపాదించిన విజ్ఞానాన్ని ఇతరులకు పంచడం ద్వారా, ఇతరుల ఉన్నతికి పాటుపడాలి. తద్వారా విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దాలి. వారిని ఉన్నత స్థాయికి తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి. అందులో భాగంగా విశ్వవిద్యాలయం కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేయడం ద్వారా దేశ భవిష్యత్‌కు తోడ్పడేందుకు కృషి చేస్తున్నాను. ఇలాంటి సమున్నత ఆశయంతో ఎవరు పని చేసినా సమాజంలో మంచి గుర్తింపు వస్తుంది.

ఈ సంచికలో....

టపా ... 2
విజ్ఞాన వీచిక ... 4
సీరియల్ ... 8
సినిమా ... 10
మనసా... ... 11
ఆరోగ్యం ... 12
అట్టమీది కథ ... 16

ఇంకా...



చూద్దామా ... 3
పవాపురి

మంచిపుస్తకం ...6
విజయాలకు సోపానం
వ్యాపార వ్యూహం

తెలుసుకుందామా ... 20
రుచి ... 21
లాహిరి... లాహిరి ... 24
కొత్త పుస్తకాలు ... 26

కథ 22
పండుటాకు

కాకరకాయ చిప్స్ బావున్నాయి

మేధాశక్తి కావాలన్న నెల్లూరు కొండయ్య గారిది కొండంత ఆలోచన. ఓర్చా శిల్ప కళారీతులు బాగున్నాయి. రష్యాను ప్రగతి పథాన నడిపిన స్టాలిన్ నియంత అయినా స్టాలినే! కాకరకాయ చిప్స్ కారంగా చేదుగా బాగుంటాయి. పెను సవాలు విసిరే కృత్రిమ దీపాలు కృత్రిమంగా వుండవు. చమురు బావుల సంగతి బాగుంది.

వాస్తు రామచంద్ర,
రాంజీనగర్, నెల్లూరు.

సినీ అభిమానులకోసం కొత్త శీర్షిక పెట్టరూ...

కాలంతో పాటు మానవుల అవసరాలు అభిరుచులలో ప్రకృతి సహజమైన మార్పు కలగడం యుగయుగాల నుండి సంభవిస్తూనే వుంది. కాకర్లమూడి విజయ్ రాసిన అట్టమీది కథ ఆనందాన్ని, ఆసక్తిని కల్గించింది. కృత్రిమ ద్వీపాలు ఎలా నిర్మిస్తారో చదివి తెలుసుకున్నాం... అలనాటి జ్యూబిలీ హీరో రాజేంద్రకుమార్ నటించిన 'కళలు' పండించిన హిందీ సినిమాలు ఈనాటికీ కళ్ళ ముందు కదలాడుతూనే వున్నాయి! కళా తపస్వి, హీరో రాజ్‌కపూర్ నిర్మించిన మధురాను భూతిని కలిగిస్తూ వుంది. లాహిరి లాహిరిలో సినిమా సంగతులు, అలనాటి మధుర స్మృతులను డా॥ జె.పి. వైద్య గారు వారం వారం అందిస్తున్నందుకు ధన్యవాదాలు. ఇవి 'స్నేహ' సంచికకు గొప్ప హైలెట్‌గా నిలుస్తాయి. ఆనాటి మధురమైన చిత్ర విశేషాలు గుర్తు చేస్తున్న లాహిరి లాహిరి శీర్షికలో పాత తరం సినిమా ప్రేక్షకుల కోసం ప్రశ్నలు, జవాబులు ఇచ్చేవిధంగా సరికొత్త శీర్షిక ప్రవేశపెట్టవలసిందిగా కోరుతున్నాం. ఒకనాటి కుటుంబ గాథల సినిమాలలో విభిన్న తరహా పాత్రలు చేసిన అలనాటి హీరోయిన్ మీనా గురించి చదివాం. సినిమా కబుర్ల ద్వారా సినిమా రంగంలో సినిమా కళాకారులు అనుభవిస్తున్న ఆవేదనలు తెలుసుకున్నాం.

జె. సుధాకర్ పట్నాయక్,
కాకినాడ, తూగో. జిల్లా.

మైమరపింపచేసిన ఓర్చా

ఆగస్టు, 24న అట్టమీదికథగా కాకర్ల మూడి విజయ్ అందించిన "కృత్రిమ ద్వీపాలు" అత్యంతాసక్తికర అంశాలను స్పృశించింది. ఐతే ఈ పరిణామక్రమంలో ద్వీపాల ద్వారా లభించే వాణిజ్య వ్యాపార లాభాల ముందు సముద్ర జీవజాలం పెద్ద విలువైంది కాదనే దృక్పథం మాత్రం దారుణమనిపించింది. రాన్ చిత్రించిన బొమ్మలు ఎంతో సహజంగా సజీవంగా ముందున్నట్లనిపించటం ప్రశంసనీయం. చిత్రాలతో శిల్ప కళా నైపుణ్యతకు తార్కాణంగా నిలిచింది. 'సినిమా కబుర్లు' ద్వారా మీనా మనోగతం ఆవిష్కృతమైంది. "చూద్దామా" ద్వారా ఓర్చా పట్టణ ప్రాంత అందాలు మమ్మల్ని మైమరిపింపజేశాయి. "స్టాలిన్ గురించి, ఇంకా సమగ్రంగా తెలుసుకోగోరే వారు చదవతగ్గ మంచి పుస్తకం "స్టాలిన్ యుగం" అని మాకవతగతమయింది. 'నవ్వుల్- పువ్వుల్' అలరిస్తోంది. ప్రతీ వ్యక్తి అర్థవంతమైన ఉన్నత విద్యను అభ్యసించి, మేధస్సు సాధించినప్పుడే నిజమైన పరిష్కారం లభిస్తుందన్న మహోన్నత భావాన్ని వెలిబుచ్చిన 'మన అతిథి' బాల భాస్కర్ గారికి మా కృతజ్ఞతలు.

నేమాన సుభాష్ చంద్రబోస్,
ఇలిసిపురం జంక్షన్, శ్రీకాకుళం టౌన్.

అభినందనలు

ప్రపంచ చరిత్ర మహాప్రస్థానంలో స్టాలిన్‌ది కీలక పాత్ర. ప్రపంచ శ్రామికజనానికి రష్యా మార్గదర్శి. స్టాలిన్ లేని రష్యాను ఊహించలేం. స్టాలిన్ తదనంతర రాజకీయ పరిణామాలలో రివిజనిస్టుగా మారి నెహ్రూ ఇందిరా గాంధీలను పొగిడి స్టాలిన్‌ను కిరాతకునిగా చిత్రీకరించారు. కాని మార్క్సిజం - లెనినిజం అమలు చేయడంలో స్టాలిన్ దిట్ట. నియంత నాజీ హిట్లర్‌ను ఎదుర్కొనే క్రమంలో స్టాలిన్ కఠిన వైఖరి విధానాలు అమలు చేయాల్సి వచ్చిందని కొంత మంది అర్థం చేసుకోగలిగారు. మంచి పుస్తకాలు పరిచయం చేస్తున్నందుకు అభినందనలు

టి. శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

ఎంత డబ్బుకు అంత 'కృత్రిమ ద్వీపాలు

మానవుడు తన మేధస్సును ఉపయోగించి నిర్మిస్తున్న కృత్రిమ ద్వీపాల విశేషాలను గురించి ఆగస్టు 24న ఆదివారం అట్టమీది కథ శీర్షికగా అందించారు. ఇలా నిర్మిస్తున్న కృత్రిమ ద్వీపాల వల్ల నివాస స్థలం లభించడంతో పాటు వేల మందికి ఉపాధి కూడా లభించడం శుభ పరిణామం! కానీ ఈ విధంగా కృత్రిమ నిర్మాణాలుగావించే ప్రదేశాలలో సముద్ర జీవజాలానికి హాని కల్గకుండా తగు జాగ్రత్తలు తీసుకొని పర్యావరణానికి ముప్పు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తెరగాలి. అలాగే, జహంగీర్ చే నిర్మాణం కావించబడిన ఎన్నో చారిత్రక కట్టడాలను కల్గి ఉన్న 'ఓర్చా' పట్టణ విశేషాలను గురించి "చూద్దామా..." శీర్షికలో తెలుసుకున్నాం. నేటి మేటి హిందీ సినీ జ్యూబిలీ సినిమాల గురించి సినీ విశేషాలను గురించి లాహరి లాహిరి లో శీర్షికలో తెలుసుకున్నాం. భూమి పొరల లోపల పెట్రోలియం తయారు కాబడే విధానాన్ని గురించిన ఆసక్తికర విషయాలను 'విజ్ఞాన వీచిక' శీర్షికలో తెలుసుకున్నాం. ధన్యవాదాలు.

గొల్లమందల సురేష్‌కుమార్,
సీతారాంపురం.

పెట్రోలు కథను విపులంగా ఇచ్చారు

24 ఆగస్టు స్నేహలో "ప్రపంచంలో ప్రతి ఒక్కరూ విద్యావంతులై ప్రయోజకులు కావాలి. క్రమశిక్షణ, పట్టుదల సత్ప్రవర్తన కలిగిన వ్యక్తి సాధించలేనిది ఏదీలేదు" అంటూ మనిషి మేధస్సును గూర్చి మన



అతిథిలో బాలభాస్కర్ గారు చాలా విపులంగా, సూటిగా తెలియజేశారు. మానవుడు ఏదో ఒక కొత్త ప్రయోగం చేయకుండా ఉండలేడ నడానికి ఇవే నిదర్శనాలు. భూమి మీద నివసించటానికి స్థలం లేక కాదు గాని మానవుడు తన మేధోసంపద చేత కొత్త వాటిని సృష్టించడమే ధ్యేయంగా పూనుకున్నాడు. సముద్రం లోపల నిర్మాణం అంటే అంత సులభమైన పనే కాదన్నది తెలిసినదే. అయినా సరే సవాళ్లను కూడా సునాయసంగా ఎదుర్కొని విజయం సాధించడం ఈనాడు కంప్యూటర్ పరిజ్ఞానానికి అలవాటై పోయింది. 'మానవుడి మాయాజాలం కృత్రిమ ద్వీపాలు' అంటూ కృత్రిమ ద్వీప కల్పాలను ఎలా నిర్మిస్తారు? దాని వలన ఉపయోగాలేమిటి? అవి పర్యావరణం మీద ఎటువంటి ప్రభావం చూపుతున్నాయి? అన్న అంశాలను చాలా చక్కగా తెలియజేశారు. ఈ వారం అట్టమీది కథలో అపురూపమైన సుందర దృశ్యాలను మాకు ఫొటోలతో సహా చూపించి మమ్మల్ని ఆకట్టుకున్నది. సంపాదకులు చాలా చక్కని శ్రద్ధ వహించి మంచి విజ్ఞానదాయకమైన రీతిలో అట్టమీది కథలను ఆకర్షణీయమైన రీతిలో తీర్చిదిద్దుతున్నందుకు ధన్యవాదాలు. ఇంకా పెట్రోలు పుట్టుక గురించి విజ్ఞాన వీచికలో విపులంగా తెలియజేశారు. అసలు పెట్రోలియం ద్వారా ఇవన్నీ సాధ్యపడినవని మేము స్నేహ ద్వారా తెలుసుకోగలిగాం. ప్రతివారం విజ్ఞానదాయకమైన చరిత్రలను మాకళ్ళ ముందు వుంచుతున్నందుకు చాలా సంతోషం.

కర్రా వరప్రసాద్,
యలమర్రు, కంద్రిక,
కృష్ణాజిల్లా.

పవాపురి



బీహార్ షరీఫ్ నుండి 13 కిలోమీటర్ల దూరంలో పవాపురి ఉంది. దీనినే అపాపపురి అనికూడా అంటారు. దీని అర్థం పాపమనేది లేని గ్రామం. ఈ ప్రదేశంలోనే 24వ తీర్థంకరుడైన (ఆఖరి తీర్థంకరుడు) మహావీరుని వారి సమాధి ఇక్కడే ఉంది. ఈ సమాధినే జలమందిర్ అంటారు. జైనుల పవిత్ర తీర్థాలలో ఇదొకటి.

ఇక్కడ దాదాపు 20 ఎకరాలలో విస్తరించిన సరోవరం, ఈసరస్సు మధ్యలో అందమైన పాలరాతి మందిరం ఉంది. ఈ మందిరానికి నాలుగువైపులా ద్వారాలు ఉన్నాయి. ప్రధాన ద్వారం ముందు పాలరాతి సింహాలు, వాటి మధ్య పాలరాతి ఫౌంటెన్ అమర్చారు. ఈ మందిరంలోనే ఛత్రాన్ని అమర్చిన మహావీరుని పాదుకలు ఏర్పరచారు. ఈ పాదుకల వద్దే పూజలు జరుగుతుంటాయి. వాటిపై ఈ సరస్సుకు ముందు ఎర్రరాతిలో నిర్మించిన దర్వాజా ఉంది. సరస్సుమీద నుండి మందిరం దగ్గరకు వెళ్లటానికి నగిషీలు చెక్కబడిన ఎర్రరాతి వంతెనను నిర్మించారు. ఈ జలమందిర్‌కు చుట్టుపక్కల పెద్దపెద్ద జైనమందిరాలున్నాయి. వీటన్నింటితో ఈ ప్రదేశమంతా ఎనలేని ప్రశాంతతను పంచుతుంది.

ఈ ప్రాంతానికి కొద్ది దూరంలో జైనమందిరమొకటుంది. ఇక్కడే మహావీరుడు తన ఆఖరి ప్రవచనం చేశాడని చెపుతారు. దీనికే శమోశరణ్ అని పేరు. ఈ మందిరపు సౌందర్యాన్ని చూసి తీరవలసిందే కానీ చెప్పలేము. నాలుగంతస్తుల పైభాగంలో గర్భగుడి ఉంటుంది. నాలుగంతస్తుల ద్వారాలను కలుపుతూ మెట్లుంటాయి. నాలుగవ అంతస్తులోని ద్వారాలకు పాలరాతితో తయారుచేసిన చెట్టును గొడుగులా అమర్చారు. లోపల పాలరాతితో మలచిన మహావీరుని విగ్రహం చూసేవారికి ఎనలేని ప్రశాంతతను పంచుతుంది. అద్దంతో అమర్చిన కళ్లు, వాటి మధ్యలో కనుపాపలను దిద్దటం ఈ విగ్రహమూర్తి ప్రత్యేకత. ఈ విగ్రహం చుట్టూ బంగారు పూతపూసిన తోరణం ఉంటుంది. ఈ మహావీరుని చుట్టూ నమస్కరిస్తున్న పాలరాతి దేవతా శిల్పాలను చెక్కారు. ఈ మందిరానికెదురుగానే పాలరాతి మంటపం ఉంది. కానీ దీన్ని ఊరేగించే సమయంలో తప్పితే మిగతా సమయాల్లో ఉపయోగించరు. ఈ మంటపానికి చుట్టూ స్థంబాలున్నాయి కానీ పైన కప్పు లేదు. ఈ ప్రదేశంలో ఎన్నో జైన మందిరాలు, యాత్రికులకు ధర్మసత్రాలు ఉన్నాయి.

❄







విజ్ఞాన వీచిక

ఎస్. వెంకట్రావు

జురాసిక్ పార్క్ సినిమా సీక్వెల్ వచ్చాక రాకాసి బల్లుల గురించి సామాన్యులకు కూడా ఆసక్తి పెరిగింది. అంతకు ముందు చాలా సినిమాల్లోనూ, కథల్లోనూ రాకాసి బల్లులను చిత్రించినప్పటికీ స్పీల్‌బెర్గ్ చిత్రాలు మనల్ని రాకాసి బల్లుల ప్రపంచంలోకి తీసుకుపోతాయి. భారీ శరీరాలతో, భవనాలను కూడా కూలదోయగల శక్తి కలిగిఉన్నట్లు వాటిని చూపిస్తుంటారు. అయితే నిజానికి ఈ రాకాసిబల్లులు ఇప్పుడు భూ మండలంపై లేవు. ఇప్పటికి దాదాపు ఆరుకోట్ల సంవత్సరాల క్రితం ఈ రకమైన జంతువులు భూమండలంపై ఏకఛత్రాధిపత్యం వహించాయి. చిన్న బాతు ఆకారం, పరిమాణంగల జంతువుల నుండి 60 టన్నుల బరువు, 80 అడుగుల పొడవు గలిగిన జంతువుల వరకు ఆవిర్భంచాయి. భూమిపైన, నీటిలో కూడా ఈ జంతువులు తమ ఆవాసాలను ఏర్పరచుకున్నాయి. అసలు డైనోసార్లలో ఎన్ని రకాలున్నాయి? అవి ఎందుకు అంతరించిపోయాయి? వంటి ఆసక్తికర విషయాలు తెలుసుకుందాం.



రాకాసి బల్లులు గురించి కొన్ని విషయాలు

రాకాసి బల్లులను జీవశాస్త్ర పరిభాషలో 'డైనోసార్లు' అంటారు. ఇవి జంతు సామ్రాజ్యంలో సరీసృపాలు (రెప్టయిల్స్) అనే తరగతి చెందినవి. ఈ సరీసృపాల తరగతి జంతువులు నేటికి దాదాపు 20 కోట్ల సంవత్సరాల క్రితం అభివృద్ధి చెంది దాదాపు 10 కోట్ల సంవత్సరాలు భూమండలాన్ని పరిపాలించాయి. భూ, వాయు, జల ఆవాసాలన్నింటిలోనూ ఇవి నివసించాయి. అయితే వాతావరణంలో ఏర్పడిన మార్పుల మూలంగా అవి అకస్మాత్తుగా అంతరించాయి. కాని ఆధునిక జీవశాస్త్రం ముఖ్యంగా "శిలాజ శాస్త్రం" అభివృద్ధి చెందిన తరువాత, కొన్ని కోట్ల సంవత్సరాల క్రితం నివశించి, నశించిపోయిన ఈ జీవరాశుల శిథిలాలను (అస్థిపంజరాలు, ఇతర అంగాలు, వాటి అచ్చులను) భూమి పొరలనుండి వెలికితీసి, విశ్లేషించి, వాటి ఆధారంగా ఈ జీవుల శరీర నిర్మాణపు ఊహా చిత్రాలను నిర్మిస్తున్నారు. అట్లాంటి ఊహా నిర్మాణాలే మనకు అనేక సినిమాల్లోనూ, టీవీ సీరియళ్లలోనూ చూపిస్తున్నారు.

అయితే ఈ సరీసృపాల సంతతి నేటికీ మన చుట్టూ నివశిస్తున్నాయి. బల్లులు, తొండలు, పాములు, తాబేళ్ళు, మొసళ్ళు, ప్రస్తుతం జీవించివున్న సరీసృపాలు. డైనోసార్లు బల్లుల ఆకారాన్ని కలిగి, భారీకాయాలతో ఉంటాయి కాబట్టి వాటిని రాకాసి బల్లులని పిలుస్తున్నారు. కాని నిజానికి డైనోసార్లలో భారీకాయులే కాదు, చిన్న చిన్న జీవులు కూడా చాలా ఉన్నాయి.

అతి పెద్ద డైనోసార్

47 అడుగుల పొడవుగల "టిరనోసారస్" అనే డైనోసార్ మనకు తెలిసి, ఈ భూమ్మీద నివసించిన మాంసాహార జంతువులలో అతి పెద్దది. అమెరికాలోని నేచురల్ హిస్టరీ మ్యూజియంలోని అస్థిపంజరం ఆధారంగా టిరనోసారస్ ఆకారాన్ని రూపొందించారు.

డైనోసార్ల (రాకాసిబల్లుల) శిలాజాలను పరిశీలించడం ద్వారా జీవశాస్త్రవేత్తలు అవి నివసించిన కాలంలో భూమండలంపైగల వాతావరణ పరిస్థితులు, వృక్ష, జంతుజాలాలు, భూగోళం యొక్క ఉపరితల స్వరూపం మొదలైన విషయాలు తెలుసుకోగలుగుతున్నారు. ప్రపంచంలోని అనేక మ్యూజియాలలో డైనోసార్ల అస్థిపంజరాలనూ, ఇతర శిలాజాలనూ భద్రపరిచి పరిశీలిస్తున్నారు.

డైనోసార్లలో చిన్న కోడిపెట్ట పరిమాణం నుండి అతిపెద్ద తిమింగలాలంత శరీర పరిమాణం వరకు కలిగివున్నాయి. నీటిలో రకరకాల ఆకారాలు కలిగినవికూడా ఉన్నాయి.

యాభై టన్నుల బరువు
ఆరు అంగుళాల మెదడు

"డిప్లొడోకస్" అనే డైనోసార్ 80 అడుగుల పొడవు, 50 టన్నుల బరువు కలిగివున్నది. కాని ఇంత పెద్ద శరీర పరిమాణంగల జంతువుకు కేవలం ఆరు అంగుళాల పొడవుగల మెదడు మాత్రమే ఉన్నది. ఇంత పెద్ద శరీరం కలిగిన జంతువులు నేడు కేవలం తిమింగలాలు మాత్రమే. తమ శరీరాలను మోయలేక ఇవి జలాశయాలను ఆశ్రయించాయి. ఇవి శాఖాహార జంతువులు. తమ భారీ శరీరాలను పోషించడానికి ఇవి నిరంతరం ఆకులు, గడ్డి మొదలైన వాటిని తింటూనే ఉండాలని శాస్త్రవేత్తలు అభిప్రాయ పడుతున్నారు.

మాంసాహారి

"టిరనోసారస్" అనే డైనోసార్ మాంసాహార జంతువు గురించి ఇంతకు ముందే ప్రస్తావించుకున్నాం. దీని శరీరం పొడవు 50 అడుగులు, ఎత్తు 20 అడుగులు. దీని తల నాలుగు అడుగుల పొడవు వుండేదని వాటి అస్థిపంజరాలను (శిలాజాలను) బట్టి తెలుస్తున్నది. బహుశా ప్రపంచంలో నేటివరకు ఇంత పెద్ద శరీర పరిమాణం గలిగిన మాంసాహార జంతువులు నివశించలేదు.

శాకాహారి

మరికొన్ని డైనోసార్లు పక్షి ఆకారం కలిగిఉండేవి. "ఆర్నిథిస్కియా" అనే విభాగంలోని డైనోసార్లు ఈ రకమయిన ఆకారం కలిగి ఉన్నాయి. ఇవి పొడవైన ముక్కులు, పెద్ద తోక కలిగివుండి, రెండు కాళ్లపై నడిచేవని వాటి శరీర నిర్మాణాన్ని బట్టి శాస్త్రజ్ఞులు నిర్ధారించారు. వాటి ముందు కాళ్ళు చాలా చిన్నవిగా ఉండటం వల్ల ఆహారాన్ని పట్టుకోడానికి ఉపయోగపడేవి. ఈ జంతువులన్నీ శాకాహారులే.

"ఇగానో డాన్" అనే డైనోసార్ 30 అడుగుల పొడవు కలిగి ఉండేది. "స్టీగో సారస్" అనే మరో డైనోసార్ పొడవు 25 అడుగులు.

జలాశయాల్లో సంతానోత్పత్తి

ఈ జంతువులు ఇంతగా భూమిపై విస్తరించడానికీ, భారీ శరీరాలను పొందడానికీ ముఖ్యంగా ఆనాటి పరిసరాలే కారణం. జీవరాశి సముద్రంలో ఉద్భవించింది. పరిణామ క్రమంలో సముద్రం నుండి మొట్ట మొదటిగా భూమిపైకి వచ్చిన జంతువులు ఉభయచరాలు. అంటే ప్రస్తుతం మనం చూస్తున్న కప్పల తరగతికి చెందినవన్న మాట. అయితే ఇవి కూడా పూర్తిగా



నీటిని విడిచిపెట్టి జీవించలేవు. వాటి జీవిత కాలంలో అవి కనీసం ఒక్కసారైనా జలాన్ని ఆశ్రయించాలి. ముఖ్యంగా గుడ్లు పెట్టడానికీ, అవి ఫలదీకరణం చెందడానికీ ఈ ఉభయచరాలకు జలాశయాలు అతి ముఖ్యం. జీవుల పరిణామక్రమంలో ఉభయ చరాల తరువాత, వాటి నుండి ఉద్భవించిన జంతువులు సరీసృపాలు (రెప్టయిల్స్). ఇవి అసలు జలాశయాల జోలికిపోకుండా పూర్తిగా భూమిపైనే నివసించగలవు. వాటి శరీర నిర్మాణం, ప్రత్యుత్పత్తి క్రమం మొత్తం ఈ రకమయిన జీవన విధానానికి తగినట్లు పరిణామం చెందాయి. అందువల్ల అప్పటికే భూమిపై అభివృద్ధి చెంది వున్న అపార వృక్ష సంపదను ఆహారంగా ఉపయోగించుకునేందుకు వాటికి బాగా అవకాశం ఏర్పడింది. దీనికితోడు భూమిపైన వాటికి పోటీ జంతువులు కూడా లేవు.

రక్షణ కవచాలు

పై కారణాలన్నింటి వలన సరీసృపాలు విపరీతంగా అభివృద్ధి చెంది, భూమిపై విస్తృతంగా విస్తరించాయి. వృక్షాలను తిని శాఖాహార సరీసృపాలు పెరిగితే, వాటిపై ఆధారపడి మాంసాహారులు అభివృద్ధి చెందాయి. సరీసృపాల్లో ఒక విభాగమైన డైనోసార్లు తమ శరీర పరిమాణంలోనూ, సంఖ్యలోనూ విస్తారంగా అభివృద్ధి చెందాయి. శాఖాహార డైనోసార్లను, ఇతర సరీసృపాలను భక్షించి 20-25 అడుగుల పొడవుగల "ట్రైసిరటాప్స్" అనే ఈ డైనోసార్ తలపై, అప్పటి మాంసాహార జంతువుల నుండి రక్షణకోసం కొమ్ములు అభివృద్ధి చెందాయి.

సంఖ్యలో విపరీతంగా పెరిగిపోయిన మాంసాహార డైనోసార్ల భారినుండి రక్షించుకోడానికి శాఖాహారులు వాటి శరీరంపై పెద్ద పెద్ద కవచాలు ఏర్పరచుకోవడం మొదలు పెట్టాయి.

శాస్త్రవేత్తల పరిశోధనలో బయటపడ్డ "అంకైలో సారియా" అనే డైనోసార్ల రక్షణ కవచాలు, మొదటి ప్రపంచ యుద్ధంలో వాడిన భారీ ట్యాంకులవలె ఉంటాయి. అందువలన ఈ జంతువులను "ట్యాంక్ జంతువులు" అని పిలుస్తారు. ఈ జంతువులు మాంసాహార డైనోసార్ల నుండి తమను తాము రక్షించుకోడానికే ఇటువంటి కవచాలను అభివృద్ధి చేసుకున్నాయని శాస్త్రవేత్తల పరిశీలనలో వెల్లడైంది.

అంతరించిపోవడానికి కారణం?

ప్రపంచ విఖ్యాతి గాంచిన డైనోసార్లు అంతం కావడానికి గల కారణాలను ఊహా మాత్రంగా చెప్పగలుగుతున్నారేగాని, నిశ్చయంగా చెప్పలేక పోతున్నారు. దానికి సంబంధించి శాస్త్రవేత్తలు భిన్నమైన కారణాలను సూచిస్తున్నారు.

అప్పటి వాతావరణంలో అకస్మాత్తుగా ఏర్పడిన మార్పుల మూలంగా ఈ జీవులు అంతమైనాయని కొందరు శాస్త్రజ్ఞుల అభిప్రాయం. ఈ వాతావరణ ప్రభావం వాటిపై ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ ఉండవచ్చు. భూమి పుట్టినప్పటి నుండి ఇప్పటివరకు వాతావరణంలో తీవ్రమైన మార్పు సంభవించింది. అయితే ఇది క్రమపద్ధతిలో, మెల్లగా జరుగుతూ వచ్చింది. కాని కొన్ని సమయాలలో మంచు యుగాలు సంభవించడం, అప్పుడు ఆ పరిస్థితులను తట్టుకోలేని జీవరాశి నశిచడం కూడా జరుగుతుంది. అట్లాంటి మార్పులు సంభవించడం వలన భారీ శరీరాలుగల డైనోసార్లు వాటికి తట్టుకోలేక అంతరించాయని వారి అభిప్రాయం. మరి కొందరు ఆనాటి వృక్ష సంపద, వాతావరణ మార్పులకు గురి అయ్యిందని, వాటిపై ఆధారపడిన శాఖాహార డైనోసార్లు నశించిపోయాయని భావిస్తున్నారు. శాఖాహారులు నశించిన తరువాత వాటిని భక్షించి జీవిస్తున్న మాంసాహారులు సహజంగానే అంతరిస్తాయి.

ఇటీవల శాస్త్రవేత్తల పరిశోధనలో డైనోసార్లు అంతరించడానికి సంబంధించిన కొన్ని కొత్త విషయాలు బయటపడ్డాయి. వీటి పుర్రెలను పరిశీలించిన శాస్త్రవేత్తలు డైనోసార్ల కంటి కుహరాలపై రెండు కళ్ళకు మధ్య మిగిలిన జంతువులలో వలే ఎముకతో చేయబడ్డ గట్టు లేకపోవడం వలన వాటి కళ్ళు సూర్యరశ్మి తాకిడికి ప్రత్యక్షంగా గురయ్యాయని భావిస్తున్నారు. అంటే నేత్రాలకు పూర్తి రక్షణలేదన్నమాట. డైనోసార్లు విస్తృతంగా అభివృద్ధి చెందిన కాలంలో వాతావరణంలో సంభవించిన మార్పుల వలన సూర్యరశ్మి ప్రభావం వాటిపై అధికంగా పడ్డదని, అందువలన పెద్ద ఎత్తున అంధత్వం సంభవించి ఈ రాకాసి బల్లులు అంతమొందాయని భావిస్తున్నారు.

❊





విమానాశ్రయానికి సమీపంలో కుంటి నడక నడుస్తున్న పెద్ద హోటల్‌ను కొని ఘనంగా తీర్చిదిద్దుతున్న సమయంలో అనుకోకుండా అప్పుల్లో కూరుకుపోయాడు. ఆ సమయంలోనే ఆయన తమ్ముడి ఒత్తిడితో తండ్రి ఆస్తి రాసిచ్చాడు. కామత్‌కు అసంపూర్ణంగా నిర్మాణమైన ఆర్కిడ్ హోటల్ అంతకు మించిన అప్పులు మాత్రమే దక్కాయి. అప్పుడు కూడా నిరాశపడకుండా ముందుకు నడిచాడు. 200 రూముల బదులు 21 రూముల తోనే హోటల్ ప్రారంభించి విమాన ప్రయాణీకులను ఆకర్శించేందుకు వారి అవసరాలకు అనుగుణమైన సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాడు. ఉదాహరణకు విమానాశ్రయం నుంచి హోటల్ పేరు రాసిన బస్సులు ఒకటికి రెండు సార్లు అటూ ఇటూ తిరిగేలా చేశాడు. ప్రయాణీకులు తమ వేళలకు అనువుగా సగం రోజు మాత్రమే వుండే వీలు కల్పించాడు. ఇలాంటి సదుపాయలు, సేవలతో అది సత్వరంగా అభివృద్ధి చెందగలిగింది.

విజయాలకు సోపానం
వ్యాపార వ్యూహం



గొప్ప గొప్ప విజయాలు సాధించిన వారి వెనక అద్భుత రహస్యాలు వుంటాయనుకుంటే పొరబాటే. గొప్ప వాళ్లకు ఎంత దగ్గరగా వెళితే వారు కూడా సామాన్యులేనని అంతగా తెలుసుకుంటామని ఒక సూక్తి. ఈ మాట ఏ విధంగానూ వారి గొప్పతనాన్ని తగ్గించేది కాదు. 'చిన్న తాళ్లను పేని పెద్ద ఏనుగునేని కట్టువాడే జ్ఞాని' అంటాడు ఆరుద్ర కూనలమ్మ పదాల్లో. తెలివైన వాళ్లు భిన్నమైన పనులు చేయరు గాని చేసే పనులే భిన్నంగా చేస్తారన్న మాట బాగా వాడుకలో వున్నదే (ఇటీవలే రాజకీయ ప్రవేశం చేసిన సినీ నటుడు దీన్ని మరో విధంగా చెప్పాడు కూడా). ఆ వైవిధ్యం లేదా విలక్షణత ఎక్కడి నుంచి వస్తాయి? ఇది చాలా ఆసక్తికరమైన ప్రశ్న. వాటికి జవాబు వారి నుంచి తెలుసుకోవడం ఇంకా ఆసక్తికరమైంది. భారత దేశంలో హోటల్ పరిశ్రమకు సంబంధించి అత్యంత ప్రసిద్ధమైన కామత్ హోటల్స్ వ్యవస్థాపక అధినేత విఠల్ వెంకటేష్ కామత్ ఆత్మకథకు తెలుగు అనుసరణ 'ఇడ్లీ వడ ఆకాశం'. అయితే అనువాదకుడైన యండమూరి వీరేంద్రనాథ్ ప్రసిద్ధ రచయిత కావడంతో అట్టపైన తన పేరే పెద్దగా వేసుకున్నారు.

"మనిషి జీవితం ఒక ప్రయాణం. అందులో ఎత్తులూ వుంటాయి. లోయలూ వుంటాయి. అటువంటి ఒక ప్రయాణంలో ఒకసారి నాకు పర్వతం ఎదురైంది. దాన్ని ఎక్కలేకపోయాను. ప్రయాణం ఆపుచేసి ఆత్మహత్య చేసుకుందామనుకున్నాను. ఆ సమయంలో నా వాళ్లనుకునే వాళ్లు నాకందించిన ధైర్యమూ అందించిన స్నేహ హస్తం నా ప్రయాణం మళ్లీ ముందుకు కొనసాగేలా చేసింది. ఆ పర్వతం ఎక్కిన తర్వాత కిందకు తొంగి చూస్తే ఆ బలహీన క్షణాల్లో నా నిర్ణయం ఎంత తప్పో కారణ రహితమో అర్థమైంది. అటువంటి బలహీనమైన క్షణాలు ప్రతి మనిషికీ కొన్ని వుంటాయి. వుండక తప్పదు కూడా. అటువంటప్పుడు సర్వశక్తులూ సమకూర్చుకుని చేసిన పొరబాట్లు గమనించి మనసు నిబ్బర పర్చుకుని ఒక అడుగు ముందుకేస్తే ఆ తరువాత ప్రయాణం మరీ సులువవుతుంది" అనే ఉపోద్ఘాత వాక్యాలతో ఆయన ఆత్మకథ ప్రారంభించాడు. అంతా కోల్పోయినా శూన్యాంకం నుంచి మళ్లీ జీవితాన్ని ప్రారంభించే శక్తి మనిషికి మాత్రమే వుందని ఆయన అంటాడు.

తర్వాత రచయిత హోటల్ వ్యాపారంలో తన అంతర్జాతీయ విజయానికి పునాది తల్లి దగ్గర ఇడ్లీ చక్కగా నేర్చుకోవడమేనని ఆమెను గుర్తు చేసుకున్నాడు. యూరోపియన్ దేశాల్లో జైత్రయాత్ర చేసిన ఇడ్లీకి ఇండియన్ రైస్ పుడ్డింగ్ అని, కొబ్బరి చట్నీకి కోకోనట్ సాస్ అని తానుగా నామకరణం చేసిన వైనాన్ని పేర్కొన్నారు. కామత్ కుటుంబీకుల్ని అందరూ ఇడ్లీ వడ సాంబార్ అంటారు గనక దాన్నే పుస్తక శీర్షికగా ఎంచుకున్నానని తెలిపారు.

ఈ పునాదిపై ఎదిగిన కామత్ జీవితంలో అనేక విజయాలు, విఘాతాల తర్వాత అనేక ప్రతిబంధకాల మధ్య నిర్మించిన ఆర్కిడ్ హోటల్‌కు అంతర్జాతీయంగా ప్రథమ బహుమతి లభించిన ఘట్టంతో పుస్తకం మొదలవుతుంది. వారి కుటుంబానికి బొంబాయిలో హోటళ్లు వుంటాయి. ఒక సారి మరో గొప్ప హోటల్ అధినేత రాయ్‌బహుద్దూర్ ఒబరాయ్ వచ్చాడని తెలిసిన కామత్ ఆయనను కలుసుకోవడానికి వెళ్లాడు. నీవేం కావాలనుకుంటున్నావని ఒబరాయ్ అడిగితే మీకన్నా గొప్ప హోటలియర్ కావాలనుకుంటున్నానని జవాబిచ్చాడు. దానికి ఆయన కోపగించుకోకపోగా ఆశీర్వదించాడు. ఆర్కిడ్ హోటల్ ప్రారంభించిన తరుణంలో రాలేకపోయిన ఒబరాయ్ కుమారుడిని పంపించడమే కాక నాటి ఘటనను గుర్తు చేసి కామత్‌కు మనస్ఫూర్తిగా అభినందనలు పంపించాడు. అంతర్జాతీయ బహుమతి తీసుకునే సందర్భంలో కామత్‌కు ఇదంతా కళ్లముందు కదలాడింది.

తన బాల్యంలో తీర్చిదిద్దిన ఉపాధ్యాయులనూ, హోటల్ నిర్వహణను తపస్సులా భావించి శుచి, రుచి కాపాడి కస్టమర్ల మెప్పు పొందడం నేర్పించిన తండ్రినీ తల్చుకుంటూ రెండవ అధ్యాయం మొదలెట్టాడు. తండ్రికి పని తప్ప మరో ధ్యాస వుండేది కాదు. అతనో హోటల్‌లో పని చేసేవాడు. తన నిజాయితీతో దాని యజమానిని మెప్పించి తర్వాత స్వంతంగా హోటల్ కట్టి ఆయన కూతుర్ని పెళ్లి చేసుకున్నాడు. సన్మాన్ సత్కార్ అనే ఆయన రెండు హోటళ్లు చాలా బాగా నడుస్తుండేవి. అయితే బావమరిది ఆయనను మోసం చేశాడు. అయితే భార్య ఇచ్చిన

అందచందాలతో ఆయన నిలదొక్కుకున్నాడు. బాధ్యతాయుత ప్రవర్తన నిజాయితీలే మనను ముందుకు నడిపిస్తాయని పిల్లలకు ఎప్పుడూ చెప్పేవాడట. ఈ విషయాలతో పాటు రచయిత తన యవ్వన ప్రేమానుభవాన్ని కూడా కథనం చేశాడు. ధైర్యం లేక ప్రేమించిన విషయం చెప్పలేక పోయిన తాను తర్వాత అదే అమ్మాయి మోసపోయిన వైనాన్ని చూసినట్టు రాశాడు. ప్రేమ గొప్పదైనా మనను మనం పోగొట్టుకునేంత గొప్పది కాదని నిర్ధారణకొచ్చాడు. మనుషులను ప్రేమించడంకంటే వృత్తిని, ప్రకృతినీ ప్రేమించడం మంచిదని పాఠం నేర్చుకున్నాడు.

తండ్రి ఆమోదంతో విదేశాలకు వెళ్లిన కామత్ షాన్ అనే రెస్టారెంటులో చేరాడు. రుచికరమైన ఇడ్లీలు తయారు చేయడం ద్వారా యజమానురాలి మెప్పు పొందాడు. ఒకసారి రాత్రికి రాత్రి వేల ఇడ్లీలు చేయాలని ఆర్డరు వస్తే ఆమె నిరాకరించింది. అప్పుడు కామత్ తాను చేస్తానని ఒప్పుకుని ఎలాగో తంటాలు పడి పూర్తిచేశాడు. వియన్నా వెళ్లి హోటల్‌లో కాక ఆర్కెస్ట్రాలో పనిచేసి జీవనం సాగించాడు. ఇటలీ చేరుకుని వెనిస్ నగరంలో టూరిస్టుల కోసం నిమ్మకాయలు దోసకాయలు, పుచ్చకాయలు ముక్కలు కోసి సరఫరా చేస్తూ నిలదొక్కుకున్నాడు. ఇండియా తిరిగి వచ్చాక కూడా ఇలాగే చిన్న చిన్న ప్రత్యేకమైన ఐడియాలతో పెద్దలను కూడా మెప్పించాడు. గుజరాత్‌లో పూరి చివర స్థాపించిన తన హోటల్ నిలదొక్కుకోవడం కోసం హోటల్ ముందు కార్లు ఆగి హడావుడి జరిగేలా చేశాడు. దాంతో దాని గురించి అందరికీ తెలిసి గిరాకీ పెరిగింది.కార్లు తుడిచేందుకు పిల్లవాణ్ని పెట్టాడు.తర్వాత టాయ్‌లెట్లు ఏర్పాటు చేయించాడు. ఆగిన వారికి సకాలంలో ఇచ్చే షరతు మీద టిఫెన్ ఆర్డర్లు తీసుకోవడం మొదలెట్టాడు. వీటన్నిటితో వ్యాపారం శరవేగంగా పెరిగింది. పిల్లలకు రంగు రంగుల నీళ్లు ఇవ్వడం కూడా ఆకర్షణ పెంచింది. ఇవన్నీ ఇప్పుడు చాలా చోట్ల చూస్తుంటాము కాని అప్పట్లో వాటిని ప్రారంభించిన కామత్ వంటివారి ప్రతిభ గురించి మనకు తెలియదు. వీటితో పాటు తాను విఫలమైన అవాస్తవిక ఐడియాలను గురించి కూడా ఆయన నిర్మోహమాటంగా రాసుకున్నాడు. జపాన్‌లో చూసినట్టు రిసెప్షన్ పక్కన జలపాతం ఏర్పాటు చేస్తే ఖర్చు పెరగడమే కాక సమస్యలు కూడా పెరిగిన తీరును ఉదహరించాడు.

హోటళ్లలో టాయ్‌లెట్లు సరిగ్గా చూసుకోవడమే కాక సందేహాలు తీర్చేలా పరిశుభ్రమైన కిచెన్ అద్దాల్లోంచి కనిపించే ఏర్పాటు చేశాడు. కస్టమర్లు బిల్లు ఎగవేయకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం ఎలాగో ఆలోచించాడు. వీటితో పాటే బార్ అండ్ రెస్టారెంట్లుగా మార్చడంతో పాటు డిస్కో థెక్‌లు పెట్టించింది కూడా కామతేనని కూడా చెప్పుకోవడం అవసరం.

విమానాశ్రయానికి సమీపంలో కుంటి నడక నడుస్తున్న పెద్ద హోటల్‌ను కొని ఘనంగా తీర్చిదిద్దుతున్న సమయంలో అనుకోకుండా అప్పుల్లో కూరుకుపోయాడు. ఆ సమయంలోనే ఆయన తమ్ముడి ఒత్తిడితో తండ్రి ఆస్తి రాసిచ్చాడు. కామత్‌కు అసంపూర్ణంగా నిర్మాణమైన ఆర్కిడ్ హోటల్ అంతకు మించిన అప్పులు మాత్రమే దక్కాయి. అప్పుడు కూడా నిరాశపడకుండా ముందుకు నడిచాడు. 200 రూముల బదులు 21 రూముల తోనే హోటల్ ప్రారంభించి విమాన ప్రయాణీకులను ఆకర్షించేందుకు వారి అవసరాలకు అనుగుణమైన సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాడు. ఉదాహరణకు విమానాశ్రయం నుంచి హోటల్ పేరు రాసిన బస్సులు ఒకటికి రెండు సార్లు అటూ ఇటూ తిరిగేలా చేశాడు. ప్రయాణీకులు తమ వేళలకు అనువుగా సగం రోజు మాత్రమే వుండే వీలు కల్పించాడు. ఇలాటి సదుపాయలు సేవలతో అది సత్వరంగా అభివృద్ధి చెందగలిగింది. దానికి తోడు హోటల్‌గా గాక ఎకోటెల్ (పర్యావరణ పరిరక్షణ దృష్టి కలది)గా నడపడంతో అచిర కాలంలోనే అంతర్జాతీయ అవార్డు కూడా లభించింది.

విఠల్ కామత్ జ్ఞాపకాలు చదువుతుంటే వ్యాపారవేత్తల కుశాగ్రబుద్ధి వివిధ రకాల చిట్కాలు తెలుస్తాయి. మరో వైపున దృఢదీక్ష గల వ్యక్తిత్వమూ గోచరిస్తుంది. అయితే హోటళ్లలో పనిచేసే కార్మికులు ఉద్యోగుల గురించి తగినంతగా రాయక పోవడం ఆయన స్వభావ రీత్యా పెద్ద ఆశ్చర్యకరం కాదు. వున్న ప్రస్తావనలలో వారి పట్ల మంచిగా వుండాలని చెప్పడంతో పాటు కొన్ని ప్రతికూల వ్యాఖ్యానాలు కూడా వున్నాయి. ఇంతకూ మూలంలో ఎంత వుందో అనువాదంలోకి ఎంత వచ్చిందో తెలియదు. ఆ విషయం మినహాయిస్తే పుస్తకం చదవదగిందే.

ఇడ్లి-వడ- ఆకాశం

యండమూరి వీరేంద్రనాథ్

వెల: 100/-, పేజీలు: 176

ప్రతులకు: నవసాహితి పబ్లిషర్స్

ఏలూర్ రోడ్,

రామమందిరం దగ్గర,

విజయవాడ.





మూలం: బరీ మై హార్ట్ ఎట్ ఊండెడ్ నీ (డీ బ్రౌన్)
తెలుగు సేత: ముక్తవరం పార్థసారథి

అమెరికన్ డేగ

జరిగినకథ:
ఏజెన్సీ నుండి ఏజెన్సీకి తిరిగి వివరాలు సేకరించింది. కమిషన్ పరిపాలనా సౌలభ్యం కోసం 'ఇండియన్ల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని" ఆరు చిన్న ఏజెన్సీలు ఏర్పరచాలని ఛీఫ్‌లకు సూచించారు" ఇదే శాశ్వత పరిష్కారం. అక్కడ మిమ్మల్నెవరూ ఇబ్బంది పెట్టరు. తరతరాలుగా ఏజెన్సీల మీద హక్కులు ఇక మీవే అన్నారు. "పునర్విభజన తర్వాత, గ్రేట్ ఫాదర్ మీకు 25,000 వేల ఆవులు, 1,000 ఎద్దులు ఇస్తాడు" అని రెడ్‌క్లౌడ్‌కు ఆశ చూపాడు. హిన్మాన్ అయితే, ఆ బహుమతి లభించాలంటే సియోలందరూ కమిషన్లు తెచ్చిన కాగితాల మీద సంతకాలు చెయ్యాలి. అలా చదువు రాని ఇండియన్లు 14000 చదరపు మైళ్ల భూమిని ఆవుల కోసం, ఎద్దుల కోసం రాసివ్వటానికి సిద్ధపడ్డారు.

(69వ భాగం)

కొన్ని ఏజెన్సీల్లో సియోలు సంతకాలు చెయ్యడానికి నిరాకరించారు. అక్కడ హిన్మాన్ మరింత నీచానికి ఒడిగట్టి, ఏడేళ్ల పిల్లల చేత కూడా సంతకాలు చేయించాడు (పిల్లల సంతకాలు చెల్లుతాయని ఏ చట్టమూ, ఏ సంధీ అంగీకరిం చదు). ఊండెడ్‌నీ క్రీక్ వద్ద ఏర్పాటు చేసిన ఒక సమావేశంలో అందరూ సంతకాలు చెయ్యకపోతే, రేషన్లూ, నెలసరి ఖర్చులూ ఇవ్వడం మానేస్తామని బెదిరించాడు. అప్పటికీ వినకపోతే వాళ్లకు ఇండియన్ టెరిటరీకి తరలించక తప్పదు.

అప్పటికే అనేకసార్లు సంతకాలు పెట్టి, తమ భూములన్నింటినీ అమెరికన్లకు ధారాదత్తం చేసిన ఇండియన్ వృద్ధులకు హిన్మాన్ మాటల్లోని కుట్ర అర్థమైంది. భయపెట్టీ, బెదిరించీ తమను నిరాశ్రయుల్ని చెయ్యాలని చూస్తున్నారు అధికారులు. ఒక నాయకుడు ఎల్లో హెయిర్ చాలా రోజులు ప్రతిఘటించాడు గానీ చివరికి హిన్మాన్ అతణ్ణి లొంగదీసుకోగలిగాడు. సంతకాల కార్యక్రమం ముగిసిన తర్వాత, కమిషనర్లు నిష్క్రమించారు. ఆ తర్వాత, ఎల్లో హెయిర్, పిడికెడు మట్టిని పైన్ రిడ్జ్ (ఊండెడ్‌నీ) ఏజెంటు డాక్టర్ వాలెంటైన్ మెక్‌గిలీకడ్డీకి బహుమతిగా ఇచ్చి, "ఉన్న భూమినంతా పోగొట్టుకున్నాం. ఇక మిగిలింది ఇదే తీసుకోండి" అన్నాడు వ్యంగ్యంగా.

1883లో ఎడ్మండ్స్, హిన్మాన్ వాషింగ్టన్ కెళ్లి సంతకాల కట్టలను అధికారులకిచ్చి, కాంగ్రెస్‌లో బిల్లు ప్రవేశపెట్టడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ఆ బిల్లు ప్రకారం, గ్రేట్ రిజర్వేషన్‌లోని సగం ప్రాంతం యునైటెడ్ స్టేట్స్ ఆధీనంలోకి వస్తుంది. అయితే, అదృష్టవశాత్తూ, వాషింగ్టన్‌లో సియోలకూ కొందరు మిత్రులున్నారు. సేకరించిన సంతకాలన్నీ చట్టప్రకారం చెల్లుతాయని అంగీకరించినప్పటికీ (నిజానికి, అందులో చాలా భాగం చెల్లవు). బిల్లు పాస్ కావటానికి అవసరమైన నాల్గింట మూడు వంతుల మంది (పురుష వయోజనులు) కన్నా తక్కువే సంతకాలు చేశారు. తక్షణమే, సెనెటర్ హెన్రీ ఎల్. డాస్ నాయకత్వంలో మరో కమిషన్ డకోటా కు బయలుదేరింది. అనేక అపవాదులు వచ్చాయి కనుక, సంతకాలు సేకరించటానికి ఎడ్మండ్స్, హిన్మాన్ ఉపయోగించిన పద్ధతులలోని 'చట్టబద్ధతను' నిర్ధారించటం సులభంగానే తెలిసిపోయింది. ఆ ఇద్దరూ చాలా మోసపూరితంగా ఇండియన్లను భయభ్రాంతులకు గురిచేసి సంతకాలు పెట్టించుకున్నారని.

విచారణ సందర్భంగా "హిన్మాన్ నిజాయితీ పరుడని నమ్మడం లేదా?" అంటూ రెడ్ క్లౌడ్‌ను ప్రశ్నించాడు డాస్.

"మీలాంటి పెద్దమనుషుల్నతడు బాగా బురిడీ గొట్టించగలడు. అతడి మాటలు విని మీరు నన్నిలా అడుగుతున్నారు" అన్నాడు రెడ్ క్లౌడ్. "ఆవులు, ఎద్దులు ఇస్తానని చెప్పాడు హిన్మాన్. కానీ మేం భూమి వదులుకోవాలని మాటమాత్రమైనా చెప్పలేదు. మీరిచ్చేవి కానుకలు కావు. కొన్ని పశువులిచ్చి భూమిని తీసుకుంటున్నారన్నమాట"

"ఇప్పుడున్న పరిస్థితుల్లో ఎవరిభూమి ఎవరిదో తెలుసుకోలేక పోతున్నారు. చిన్న చిన్న ముక్కలు చేసి అందరికీ కేటాయిస్తాం. గ్రేట్ ఫాదర్ నిర్ణయమన్నాడు" అంటూ వాంగ్మూలమిచ్చాడు లిటిల్ వూండ్.

"మీకు పంచిన తర్వాత మిగిలిన భూమి గ్రేట్ ఫాదర్‌కే చెందుతాయని చెప్పాడా?"

"లేదు"

"ఆ రాస్కెల్ మేం చదవలేదని కాగితాలమీద సంతకాలు చెయ్యమన్నాడు" అంటూ మరో సాక్ష్యం చెప్పాడు వైట్ థండర్.

"నీ ప్రకారం రాస్కెల్ అంటే ఎవరు?"

"భూమిని చవకగా కాజేద్దామనుకున్నాడే వాడు రాస్కెల్"

"అంటే మరింత ఎక్కువ ధరకు అమ్మడం మీకిష్టమేనా?" -డాస్ అడిగాడు.

"లేదు. దీంతో ఎవరూ వ్యాపారం చెయ్యొద్దు. మా ప్రాణాలు పోయినా ఈ భూమినెవరికీ ఇవ్వం"

డాస్ కమిషన్, డకోటా చేరుకోటానికి కొద్దిరోజులు ముందే ఫోర్ట్ రాండాల్ నుండి సిట్టింగ్ బుల్‌ను విడుదల చేసి స్టాండింగ్ రాక్ వద్ద వున్న హంక్ పాపా ఏజెన్సీకి తరలించారు. ఆగస్టు 22నాడు, సాక్ష్యాలు సేకరించటానికి కమిషనర్లు వచ్చినపుడు అతడుకూడా ఏజెన్సీ కేంద్ర కార్యాలయానికి చేరుకున్నాడు. కానీ, కమిషనర్లు ఉద్దేశ్యపూర్వకంగా - బహుశా అవమానించాలని - అతడి వునికిని విస్మరించి రన్నింగ్ ఆంటిలోప్, ఓల్డ్‌గ్రాస్ కుమారుడు - బ్లాక్ ఫుట్ సియో నాయకుడు జాన్‌గ్రాస్‌లను విచారించారు.

సమావేశం ఇంచుమించు ముగిసిందనప్పుడు "సిట్టింగ్ బుల్ ఏమన్నా చెప్పదలచుకున్నాడో అడగండి" అంటూ దుబాసీని అడిగాడు సెనెటర్ డాస్.

"మీరు మాత్రం మాట్లాడమంటే మాట్లాడటానికి సిద్ధంగా ఉన్నారు. మీకిష్టమైన అనుకూలమైన వాళ్లతో మాత్రమే సాక్ష్యం చెప్పించుకుంటున్నారు" అన్నాడు సిట్టింగ్‌బుల్.

"తమ ప్రతినిధులను ఇండియన్లే ఎంపిక చేసుకుంటారనుకున్నాను. ఎవరైనా కమిషన్ ముందర తమ వాదన వినిపించొచ్చు" అన్నాడు డాస్.

"సిట్టింగ్ బుల్" అంతటివాణ్ణి ఎవరైనా అంటూ సంబోధించటం అందర్నీ షాక్ చేసింది.

"నేనెవరో తెలిసే మీరలా మాట్లాడుతున్నారా?"

"నీ పేరు సిట్టింగ్‌బుల్. చెప్పదలచుకున్నదేదో చెప్పు త్వరగా"

"నన్ను గుర్తించారన్నమాట"

"ఎన్ని సార్లు చెప్పాలి నువ్వు సిట్టింగ్ బుల్‌వి"

"నేను సిట్టింగ్ బుల్‌నని తెలిస్తే, ఇండియన్లలో నా హోదా ఏమిటో కూడా తెలిసుండాలి"

"నీకూ, ఈ ఏజెన్సీలో ఉన్న వందలమంది ఇతర ఇండియన్లకూ తేడా లేదని నాకు తెలుసు"

"గ్రేట్ స్పిరిట్ ఆదేశంతో నేనిక్కడికి వచ్చాను. గ్రేట్ స్పిరిట్ నన్ను 'ఛీఫ్' గా ఉండమన్నాడు. నా హృదయం రంగు ఎరుపు. రుచి మధురం. అదెంత తియ్యనిదంటే సమీపంగా వచ్చినదేదైనా దాన్ని రుచి చూడాలనుకుంటుంది. అటువంటి నాతో, నేనెవ్వరినో తెలియదంటున్నావు. ఈ దేశంలో గ్రేట్ స్పిరిట్ వరం పొందిన ఒకే ఒక ఇండియన్ నాయకుణ్ణి నేను"

"నీ హోదా నా కనవసరం. చెప్పదలచుకున్న దేమైనా వుంటే చెప్పు. లేదా పక్కకు తొలగు"

"మీకో సలహా ఇద్దామనుకున్నాను. కానీ విస్కీ మత్తులో వున్నట్టుగా మాట్లాడుతున్నారు మీరు...." అంటూ చేత్తో ఒక సైగ చేసి కదిలాడు సిట్టింగ్‌బుల్. వెంటనే, సమావేశ మందిరంలో వున్న ఇండియన్లందరూ అతణ్ణి అనుసరిస్తూ నిష్క్రమించారు.

కమీషనర్లు వూహించని మరిణామమిది. ఇంతమంది సిట్టింగ్ బుల్ న్యాయకత్వాన్ని అంగీకరిస్తున్నారని తెలిసి విస్మయం చెందారు. పరిస్థితి ఇంత "దారుణంగా" వుంటే ప్రభుత్వం తన 'ఇండియన్ పాలసీ'నే పునః పరిశీలించుకోవాల్సి వుంటుంది. ఈ ఆటవికుల్లో "ఇండియన్ లక్షణాలు" నిర్మూలించి శ్వేతజాతుల నాగరికతను ప్రవేశపెట్టాలనుకున్నారు. రెండు నిమిషాల్లో సిట్టింగ్‌బుల్, ఇండియన్ స్వభావమేమిటో నిరూపించాడు. ప్రభుత్వ విధానాలకిది పెద్ద అడ్డంకి.

ఆ రోజు మధ్యాహ్నం, హంక్ పాపా నాయకులు సిట్టింగ్‌బుల్‌తో చర్చలు జరిపారు. తామంతా అతడి న్యాయకత్వాన్ని అంగీకరిస్తారు కానీ, కమీషనర్లనలా ధిక్కరించటం మర్యాద కాదు. ఒక రకంగా ఇది వాళ్లను అవమానించినట్టే. ఇదివరలో వచ్చిన భూకబ్జాదార్లు, దోపిడీ దొంగల్లాంటివాళ్లు కారు

వీళ్లు. గ్రేట్ ఫాదర్ పంపగా భూసమస్యలో తమకు సహాయం చెయ్యటానికి వచ్చారు.

తెల్లవాళ్ల నిజాయితీ పట్ల సిట్టింగ్ బుల్‌కు నమ్మకంలేదు. అయినా పొరపాటు చేశానని అంగీకరించి, క్షమాపణలు కోరతానన్నాడు. మళ్లీ సమావేశానికి హాజరవుతానని కమీషనర్లకు కబురు పంపాడు.

"నా దురుసు ప్రవర్తనను మన్నించమని కోరుతున్నాను. నా మాటల్ని వెనక్కి తీసుకుంటున్నాను. ముఖ్యంగా, ఇతర ఇండియన్లందర్నీ సమావేశం నుండి వెళ్లిపోవాలనటం తప్పే. మిమ్మల్ని బాధపెట్టడం సత్ప్రవర్తన కాదు. ఇప్పుడు నేను చెప్పదలచుకున్నది చెబుతాను. గ్రేట్ స్పిరిట్ నన్ను చూస్తున్నది. నా మాటలు వింటున్నది. నా మనసులోని మాట తెలుసుకుని ఎవరైనా మా కోరికలు తీరుస్తారని ఆశ" అంటూ ప్రారంభించిన సిట్టింగ్‌బుల్, తన జీవితకాలంలో, సియోల జీవితాల్లో వచ్చిన పరిణామాలన్నీ సమీక్షించాడు.

దశాబ్దాలుగా ప్రభుత్వం ఏంచేసింది? ఒక వాగ్దానాన్నీ నిలబెట్టుకోలేదు. ఒక ఒప్పందాన్నీ గౌరవించలేదు. అయినా, తెల్లవాళ్ల మీది గౌరవంతో తమకేమైనా మంచి జరగకపోతుందా అనే నమ్మకంతో ఇన్నాళ్లూ నిరీక్షించాడు. "పోగొట్టుకున్న చోటునే వెదకాలని నమ్ముతారు ఇండియన్లు. మిమ్మల్ని నమ్మి మోసపోయాం. కనీసం ఇప్పుడైనా చేసిన వాగ్దానాలను నిలబెట్టుకోమని అడుగుతున్నాం. మేం మనుషులం కామా? జంతువుల్లా చూస్తారెందుకు మమ్మల్ని? అలా చెయ్యటం వల్ల మాలో మీ పట్ల అసహ్యం, ద్వేషం కాక ప్రేమ పెరుగుతుందా? జరిగిందంతా మరిచి, కొత్త సంబంధాలు ఏర్పరచుకుందామని గ్రేట్ ఫాదర్ వర్తమానం పంపాడు. అతడి మాటలు మళ్లీ నమ్మాను. కానీ ఇప్పుడు అతడిస్తున్న ఆదేశాల అర్థమేమిటి? తెల్లవాళ్ల దారికి మేం అడ్డురావద్దట. అదెలా కుదుర్తుంది? అందరం కలిసే ముందుకు నడుద్దాం. ఒకప్పుడిది మంచి దేశంగా లోకం గుర్తించింది. కానీ మీవల్ల చెడ్డ పేరొచ్చింది. ఆ మచ్చ తొలగిద్దాం" అంటూ సుదీర్ఘంగా ప్రసంగించాడు సిట్టింగ్‌బుల్. ఇండియన్ల జీవన పరిస్థితులు దుర్భరంగా వున్నాయని అందరికీ అర్థమైంది. తెల్లవాళ్ల సంస్కృతిని, నాగరికతను అలవరచుకుంటారు. కానీ వాళ్లకున్న సదుపాయాలు ఇండియన్లకు కల్పిస్తున్నారా? పనిముట్లు, పాడిపశువులు, బళ్లు, వ్యాగన్లు తమకు కూడా సమకూర్చితే ఎవరూ చెప్పకుండానే అందరూ నాగరికులవుతారు.

సిట్టింగ్‌బుల్ చెప్పింది వినటానిక్కూడా ఓపికలేదు కమీషనర్లకు. కొందరు మధ్యలోనే ఘాటుగా విమర్శించటం ప్రారంభించారు. క్రితంసారి సమావేశంలోనే అర్థాంతరంగా లేచి పోవడమేకాక, కమీషనర్లు మత్తులో వున్నారని ఆరోపించినందుకు సిట్టింగ్‌బుల్‌ను పరుషంగా నిందించాడు సెనేటర్ జాన్ లోగాన్, "ఇప్పుడు నువ్వు ఇండియన్ చీఫ్‌వి కావు. నీకు అధికారం లేదు. అనుచరులు లేరు. ప్రభుత్వ దయాదాక్షిణ్యాలమీద ఆధారపడి ఈ ఇండియన్ రిజర్వేషన్‌లో బతుకుతున్నావు. నీకు తిండీ, గుడ్డా ఇస్తున్నది మా ప్రభుత్వం. నీ పిల్లల్ని చదివిస్తున్నదీ ప్రభుత్వం. నీకు మాట్లాడ్డానికి అనుమతిచ్చింది కూడా మేమే. ప్రభుత్వ సహాయమే లేకపోతే, ఈనాడు నువ్వు పర్వతాలలో చలికి గడ్డకట్టుకు పోయుండేవాడివి. ఇవన్నీ నీకెందుకు స్పష్టం చేస్తున్నానంటే, యునైటెడ్ స్టేట్స్ ప్రభుత్వాన్ని లేదా అది నియమించిన కమిటీలను అవమానించే హక్కు నీకు లేదు. మా రక్షణలో వుంటూ మమ్మల్నే నిందించటం చాలా నీచం. మీరందరూ వ్యవసాయం చేసుకుని నాగరికులుగా మారాలనే, అందరికీ తిండీ, బట్టా ఉచితంగా ఇచ్చి విద్యాబుద్ధులు నేర్పుతున్నాం. కొన్నాళ్ల తర్వాత మీకూ తెల్లవాళ్ల సంస్కృతి అలవడుతుంది"

సియోలకు నాగరికత నేర్పించే క్రమం వేగవంతం చేసే బాధ్యత స్టాంగిగ్‌రాక్ ఏజెన్సీకి చెందిన జేమ్స్ మెక్‌లాలిన్‌కు అప్పగించి ఇండియన్ బ్యూరో (ఇండియన్లితణ్ణి 'వైట్‌హెయిర్' అని పిలుస్తారు). మెక్‌లాలిన్ ఇండియన్ సర్వీస్‌లో సుదీర్ఘ కాలం పాటు పనిచేశాడు. అతడి భార్య ఒక సంకరజాతి 'సాంటే' స్త్రీ. సియోల సంస్కృతిని పూర్తిగా ధ్వంసం చేసి తెల్లవాళ్ల ఆచార వ్యవహారాలు నేర్పడానికతడే సమర్థుడని అధికారులకు తెలుసు. ఏజెన్సీ నుండి డాస్ కమిషన్ నిష్క్రమించిన తర్వాత, సిట్టింగ్‌బుల్ ప్రాముఖ్యతనూ, పరపతినీ తగ్గించటానికి, హంక్ పాలకులకు సంబంధించిన విషయాలన్నీ గాల్, జాన్ గ్రాస్ (బ్లాక్‌ఫుట్ సియో తెగ)లతో చర్చించి నిర్ణయాలు తీసుకున్నాడు. అతడి ఎత్తుగడలన్నీ, సిట్టింగ్‌బుల్ ఇక నాయకుడు కాదని స్టాండింగ్ రాక్ సియోలకు స్పష్టం చెయ్యటానికే అతని వల్ల ప్రయోజనం లేదని అందరూ గ్రహించాలి.

కానీ, సియోలలో సిట్టింగ్‌బుల్ పాపులారిటీ ఏమాత్రం తగ్గలేదు. ఇండియన్లా, తెల్లవాళ్లా అని తేడా లేకుండా రిజర్వేషన్‌కు వచ్చిన అగంతుకులందరూ సిట్టింగ్‌బుల్‌ను చూడటానికే ఉత్సాహం చూపించారు. 1883లో ఉత్తర పసిఫిక్ రైలు మార్గం పనులు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని రెయిల్‌రోడ్ కంపెనీ ఒక కార్యక్రమం ఏర్పాటు చేసి, ఒక ఇండియన్ చీఫ్ ముఖ్య అతిథిగా విచ్చేసి (గ్రేట్ ఫాదర్, ఇతర ప్రముఖులనూ ఉద్దేశించి) ఉపన్యసించాలని కోరింది. ఆ చీఫ్ మరెవరో కాదు. సిట్టింగ్‌బుల్‌కే ఆహ్వానం అందింది. సియో భాష తెలిసిన సైనికాధికారి వుపన్యాసం తయారు చెయ్యటంలో అతడికి సహకరించాడు. ఉపన్యాసం సియో(భాష)లోనే వుంటుంది. సైనికాధికారి వాటిని తర్జుమా చేస్తాడు.

ఇంకా వుంది....

ముంబాయికి చెందిన **సింధూ తులానీ** దక్షిణాది భాషల్లో తళుక్కుమంటోంది. ఇప్పడొస్తున్న భామలు దాదాపు మోడలింగ్ రంగం నుంచి వస్తున్నవారే. కాకపోతే ఈమె అందుకు మినహాయింపు. సీరియల్స్‌లో నటిస్తూ వెండి తెరకు పరిచయమైంది. 'ఐతే' చిత్రం ద్వారా తెరంగేట్రం చేసి 'అతనొక్కడే'తో గుర్తింపు తెచ్చుకుంది. 'బతుకమ్మ'లో తన పాత్రకు వన్నె తెచ్చింది. అందులో మేకప్ లేకుండా సహజంగా కనబడడమే కాకుండా, అంతే బాగా నటించి సినీ వర్గాలు, ప్రేక్షకుల ప్రశంసలు అందుకుంది. ఒక వైపు కథానాయికగా అందాలు ఒలకబోస్తూనే... మరోవైపు సెకండ్ హీరోయిన్‌గా 'హరే రామ్', 'విక్టరీ' చిత్రాల్లో నటించింది. ఇమేజ్‌కు దూరంగా కెరీర్ సాగిస్తున్న సింధూ తులానీతో చిట్‌చాట్...

జీవితం ఎప్పుడూ రిస్కే...

'బతుకమ్మ' శతదినోత్సవం ఎలాంటి అనుభూతి కలిగించింది.

'బతుకమ్మ'లో నటించినందుకు చాలా హ్యాపీగా ఉంది. బాగా కష్టపడినందుకు, అందుకు తగ్గ ప్రతిఫలం సక్సెస్ రూపంలో వచ్చింది. చక్కని అనుభూతి మిగిల్చింది. ముందుగా ఈ అవకాశం ఇచ్చిన చిత్ర దర్శకుడు ప్రభాకర్ గారికి నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

గ్లామర్ హీరోయిన్‌గా ఎలివేట్ కావడానికి అవకాశంలేని 'బతుకమ్మ' పాత్రలో నటించారు. రిస్క్ అనిపించలేదా?

అసలు జీవితమెప్పుడూ రిస్కే. 'బతుకమ్మ' చక్కని స్క్రిప్ట్ వర్క్‌తో రూపొందిన చిత్రం. అలాగే ఇటీవలే విడుదలైన 'బ్లాక్ అండ్ వైట్'. పెర్‌ఫార్మెన్స్ కనబరచడానికి అవకాశమున్న పాత్రలవి. ఇలాంటివి దొరకడం అదృష్టంగా భావించి నటించడానికి ఒప్పుకున్నాను.

ఆ చిత్రాల అనుభవం...

'బతుకమ్మ'ను వరంగల్ చుట్టూ ఉన్న పల్లెటూళ్లలో తెరకెక్కించారు. నిజంగా.... పరిసర ప్రాంతాల ప్రజలు ఎంతో సహాయసహకారాలు అందించారు. 30 రోజులపాటు షూటింగ్‌లో పాల్గొన్నాను. ఓ హాలిడే ట్రిప్‌లా షూటింగ్ గడిచిపోయింది. లొకేషన్ పరంగా 'బ్లాక్ అండ్ వైట్' దీనికి పూర్తి విరుద్ధం. ఈ చిత్ర దర్శకుడు శ్రీకాంత్‌గారు ప్రతి సన్నివేశాన్ని వివరంగా చెప్పేవారు. దీంతో ఎలా మాట్లాడాలి, ఫీలింగ్ ఎంతవరకు ఉండాలో స్పష్టంగా తెలిసేది. పక్కా స్క్రీన్‌ప్లేతో సెట్స్ పైకి రావడంతో... ఆయనకది మొదటి చిత్రంలా నాకనిపించలేదు.

'బ్లాక్ అండ్ వైట్'లో బాలీవుడ్ స్టార్ జాకీ ష్రాఫ్‌తో నటించడం ఎలా ఉంది?

ఆయనతో కలిసి నటిస్తానని ఎప్పుడూ అనుకోలేదు. నా చిన్నప్పుడు ఆయన నటించిన 'పరిందా' సినిమా షూటింగ్ మా ఇంటి దగ్గర్లో తీస్తుంటే... వెళ్లి చూసేదాన్ని. అలాంటిది షూటింగ్ సమయంలో ఆయన పక్కనే కూర్చోవడం కొత్తగా, వింతగా అనిపించింది. ఎంతో కష్టపడి కింద నుంచి ఈ స్థాయికి ఎదిగిన ఆయన చాలా క్యాజువల్‌గా ఉంటారు. తానొక పెద్ద నటుడన్న ఫీలింగ్ ఆయనలో కనబడలేదు.

'పోతే పోనీ', 'బతుకమ్మ', 'బ్లాక్ అండ్ వైట్'లో కథ మీ చుట్టూ తిరుగుతుంది. ఒక వైపు ఇలాంటి చిత్రాలు చేస్తూనే... మరో వైపు 'హరే రామ్', 'విక్టరీ' చిత్రాల్లో సెకండ్ హీరోయిన్‌గా నటించాను. ఇమేజ్‌కు దూరమైపోతున్నాననే... భావన కలగలేదా?

అసలు నేను ఇమేజ్ రేసులో ఉన్నానని భావించడం లేదు. కథ బాగుండి, నా పాత్రకు ప్రాధాన్యమున్న చిత్రాలే అంగీకరిస్తాను. అలాగే వెరైటీ పాత్రలు పోషించి ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోవాలనుకుంటాను. కళ్యాణ్‌రామ్‌తో నటించిన 'అతనొక్కడే' గుర్తింపు తీసుకొచ్చింది. అంతేకాకుండా కళ్యాణ్‌రామ్ ఓ మంచి ఫ్రెండ్ కూడా. దీంతో ఎన్.టి.ఆర్. ఆర్ట్స్ బ్యానర్‌లో 'హరే రామ్'లో నటించడానికి అంగీకరించాను. ఇది నా మాతృ సంస్థ. దర్శకుడు రవి సి. కుమార్ హిట్ మూవీ 'సామాన్యుడు'ను గతంలో ఇచ్చారు. దీంతో 'విక్టరీ'లో నటించాను. అలాగే ఇదొక సామాజిక ఇతివృత్తంతో రూపొందింది. ఈ కారణాల రీత్యా ఆయా చిత్రాల్లో నటించాను.

సినిమాల్లోకి రాకముందు ఏం చేసేవారు?

మాది ముంబాయి. పుట్టి పెరిగిందంతా అక్కడే. పేరెంట్స్ ఇద్దరూ ఉద్యోగస్తులే. నాన్న ఎస్.బి.ఐ.లో మేనేజర్. అమ్మకు రైల్వేలో ఉద్యోగం. సినిమా నేపథ్యం శూన్యం. ముంబాయిలో ఓ సీరియల్లో నటిస్తున్న సమయంలో దర్శకుడు ఏలేటి చంద్రశేఖర్ నన్ను చూసి 'ఐతే' సినిమాకు ఎంపికచేశారు.

'ఐతే' తర్వాత వచ్చిన గ్యాప్‌లో ఏం చేశారు?

ఆ సమయంలో బి.ఏ సోషియాలజీ చేశాను. తర్వాత 'మన్మథ'లో ఛాన్స్ వచ్చింది.

మీరు మంచి స్టూడెంటేనా?

అవును. నాకు చదువంటే బాగా ఇష్టం. నటనకు ఎంత ప్రాధాన్యతను ఇస్తున్నానో చదువుకూ అంతే ఇచ్చేదాన్ని.

ప్రస్తుతం ఏయే చిత్రాల్లో నటిస్తున్నారు?

యస్.ఎ. చంద్రశేఖర్ (హీరో విజయ్ తండ్రి) దర్శకత్వంలో ఓ తమిళ చిత్రం, ఒక తెలుగు సినిమాలో యాక్ట్ చేస్తున్నాను.

అభిమాన నటీనటులు?

అమీర్‌ఖాన్, కాజోల్.

❋

హిప్నో కమలాకర్
ఫోన్ నెం:9390044031

వారికి దూరంగా వుండలేకపోతున్నా

నాకు 19 సంవత్సరాలు. నేను చిన్నప్పుడే చదువు ఆపేశాను. నేను పని చేసే వాళ్ళు నా సొంత అమ్మ, నాన్నల్లాగా చూసుకుంటున్నారు. నాకు ఊహ తెలిసినప్పటి నుంచి వాళ్ళ దగ్గరే పని చేశాను. ఇప్పుడు వాళ్ళు నన్ను దూరం చేశారు. నాకు వేరే పని ఏదైనా చేద్దామన్నా నా మనసు అంగీకరించట్లేదు. దీని వల్ల నాకు చాలా ఇబ్బందిగా ఉంది. ఏదో తెలియని బాధ. 'సైకో'లాగా అనిపిస్తుంది. అసలు నాకు ఇప్పుడు ఏం చేయాలో అర్థం కావడం లేదు. దయచేసి మీరే ఏదైనా సలహా చూపగలరు.

సబీర్, వరంగల్.

ఏదైనా సాధించడానికి కావలసిన శక్తి సామర్థ్యాలు మీలోనే నిక్షిప్తంగా వున్నాయి. మీకు చిన్నతనం నుంచి పని చేసే అలవాటు ఉంది. కాబట్టి ఎక్కడైనా ఏదైనా పని చేయడానికి ప్రయత్నించండి. కొత్త పని చేస్తున్నప్పుడు ముందు బాధగానే ఉంటుంది. చేస్తున్న కొద్దీ అలవాటు అయ్యి బాగా ఇష్టంగా చెయ్యగలుగుతారు. అప్పుడప్పుడూ కొత్త పనులు చేస్తూ వుంటే మీ మైండ్ కూడా చురుకుగా తయారవుతుంది. మీ శక్తి సామర్థ్యాలను గుర్తించి చక్కగా వినియోగించుకుంటే మీరు ఎదగడానికి దోహదపడతాయి.

చెడు స్నేహం వదులుకోవాలంటే...

నేను ఇంగ్లీష్ మీడియం 10వ తరగతి చదువుతున్నాను. స్కూలుకి అసలు వెళ్ళాలనిపించడం లేదు. నాకు చాలా మంది స్నేహితులు ఉన్నారు. వాళ్ళు కొంచెం చెడ్డవాళ్ళు. వాళ్ళతో తిరుగుతాను. ఇక స్కూలు మీద ఆసక్తి అసలే ఉండదు. దీనికి నేను ఏం చేయాలి? మా ఫ్రెండ్స్‌లో ఎవరు స్కూల్‌కి వెళ్ళొద్దన్నా నేను వెళ్ళలేను. నాకు స్కూల్ మీద. చదువు మీద ఆసక్తి కలగాలంటే నేను ఏం చేయాలి?

సంతోష్‌కుమార్, కాకినాడ.

స్నేహితులు ఉండటం మంచిదే కాని ఆ స్నేహితులే నీ జీవితాన్ని ఎందుకూ పనికిరాకుండా హరించివేస్తున్నారు. స్నేహం మంచిగా ఎదగడానికి దోహదపడాలే తప్ప చెడ్డ

వారిగా, సంఘ విద్రోహులుగా మారేలా వుండకూడదు. మీ అభిరుచి మార్చుకోండి. పాఠాలను నేర్చుకోవడంలో, చదవడంలో ఇష్టత చూపండి. ఎవరో వస్తారు, ఏదో చేస్తారు. అని ఎదురు చూడకుండా మీ అంతట మీరు మీకు కావలసిన వాటిని నేర్చుకోవడానికి సిద్ధపడండి. ఎందుకు చదవాలి? స్కూల్‌కి ఎందుకు వెళ్ళాలి? అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. మీ మానసిక స్థితిని స్వయంగా నేర్చుకోడానికి అనుకూలంగా మార్చుకోండి. నేర్చుకోవడానికి ప్రేరణను కల్పించుకోండి. మీరు దేనినైతే పదే పదే కోరుకుంటారో దానిని సాధించగల్గుతారు. మీ మనోభావాలను ఒక పద్ధతి ప్రకారం రూపకల్పన చేసుకొని అవరోధ భావాలను పోగొట్టుకొని మీ మైండ్ పవర్‌ని రీ ప్రోగ్రామింగ్ చేసుకుంటూ ఉంటే మీ స్టడీ స్కిల్ అపరిమిత స్థాయిలో ఊహించనంత వేగంగా పెరిగిపోతాయి.

విరక్తితో చనిపోవాలనిపిస్తోంది

మాది ఉమ్మడి కుటుంబం. నేను ఉద్యోగం చేస్తున్నాను. ఇంట్లో, ఆఫీసు పనులతో నాకు సమయం ఉండటం లేదు. సెలవు రోజు కూడా విశ్రాంతి ఉండటం లేదు. దానితో పని అంటేనే విరక్తితో చనిపోవాలనిపిస్తోంది. సలహా ఇవ్వగలరు.

ప్రణబ్, నిజామాబాద్.

అన్ని పనులు మీరే చేయడమంటే మాటలు కాదు. ఉద్యోగం చేస్తే వారందరూ ఇలానే గందరగోళంలో పడుతూ ఉంటారు. మీరు ఒక పుస్తకంలో రాసుకొని దాని ప్రణాళిక ప్రకారం పని చేసుకోండి. మీది ఉమ్మడి కుటుంబం అంటున్నారు కాబట్టి పనులను అందరికీ పంచండి. ఎవరు చెయ్యగలిగే పనులను వారికి అప్పగించండి. పిల్లలకు కూడా పని అలవాటు చేయండి. అవసరమైతే పని మనిషిని పెట్టుకోండి. అలా పనులను పంచుకోవటం వలన విశ్రాంతిగా ఉంటుంది. మరింత ఉత్సాహంగా పని చెయ్యగలుగుతారు. ఆల్ ది బెస్ట్.



యాంజియోప్లాస్టీ

డాక్టర్ ఎస్.విజయకుమార్ రెడ్డి,
కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్, మెడిసిటీ హాస్పిటల్స్, హైదరాబాద్.
ఫోన్ : 9440054930

ఒకప్పుడు గుండె జబ్బులతో యాభైకి పైబడిన వారే బాధపడేవారు. ఇప్పుడు పాతికేళ్లు నిండకుండానే గుండెజబ్బులు ఇతర వ్యాధులతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. మన దేశంలోనే కాక ప్రపంచ వ్యాప్తంగా యువతలో గుండె జబ్బులు పెరుగుతున్నాయి. జీవనశైలిలో వచ్చిన మార్పులే దీనికి కారణమనొచ్చు. ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడి, కెరీర్‌పై మోజు, శారీరక వ్యాయామాలు లేకపోవడం, ధూమపానం, రక్తపోటు, స్థూలకాయం, మధుమేహం కారణాలు. అయితే గుండె జబ్బుకు చేసే యాంజియోప్లాస్టీ చికిత్సలో ఎలాంటి మార్పులు చోటు చేసుకున్నాయి? దాని చుట్టూ అల్లుకున్న అపోహలేంటి? అసలు గుండెజబ్బు రాకుండా వుండాలంటే ఎలాంటి జాగ్రత్త తీసుకోవాలి? వంటి విషయాలు ఈ వారం తెలుసుకుందాం.

గుండె జబ్బుల చికిత్సలో 1980 నుంచి ఎన్నో మార్పులొచ్చాయి. 1) మందులు, 2) యాంజియోప్లాస్టీ, 3) బైపాస్ సర్జరీ. యాంజియోగ్రామ్ వల్ల గుండె జబ్బుతో బాధపడుతున్న వ్యక్తికి ఎలాంటి చికిత్స చేయాలనేది నిర్ణయిస్తారు. గుండెకు రక్తం సరఫరా చేసే ప్రధాన రక్తనాళంలోపాటు, ఇతర రక్తనాళాల్లో బ్లాక్ వుంటే బైపాస్ సర్జరీ చేస్తారు.

యాంజియోప్లాస్టీ : ప్రపంచంలో మొట్టమొదటి సారిగా 1977లో గుండె యాంజియోప్లాస్టీ చికిత్స ప్రారంభమైంది. అప్పుడు చేసిన యాంజియోప్లాస్టీకి, ఇప్పుడు చేసే యాంజియోప్లాస్టీలో చాలా విప్లవాత్మక మార్పులొచ్చాయి. ఇంతకు ముందు యాంజియోప్లాస్టీ కష్టంతో కూడుకున్న చికిత్స. ఇప్పుడు చాలా సులభైంది ఈ చికిత్స వేగంగా చికిత్స చేయడమే కాక అదే రోజు/ తర్వాతి రోజు రోగిని ఇంటికి పంపించేయొచ్చు.

యాంజియోప్లాస్టిలో మార్పులు

చర్మం నుంచి ట్యూబ్ ద్వారా గుండె లోపలికి పంపి బ్లాక్‌లను తొలగించేవారు. తర్వాత గైడ్ క్యాథటర్ ద్వారా బెలూన్‌ను పంపి పేల్చడం ద్వారా రక్తనాళాల్లో పేరుకున్న కొవ్వును తొలగించే వారు. 1990 వరకు ఈ విధంగా యాంజియోప్లాస్టీ చేసేవారు. ఈ రకమైన బెలూన్ యాంజియోప్లాస్టీ మూడు నెలల తర్వాత వల్ల రక్తనాళం మళ్లీ బ్లాక్ అవుతుంది. ఇది ఈ చికిత్సలోని సమస్య. ఈ సమస్యను అధిగమించడానికి "స్టెంట్లు" అందుబాటులో కొచ్చాయి. స్టెంట్ అనేది చిన్న లోహ ట్యూబు వంటిది. బెలూన్ యాంజియోప్లాస్టీ ద్వారా డైల్యూట్ చేసిన కొలెస్ట్రాల్ స్థానంలో స్టెంట్‌లను అమరుస్తారు. అయితే కొన్నేళ్ల తర్వాత రీస్టినోసిస్ అనే సమస్య ఉత్పన్నమవ్వడం మొదలైంది. తర్వాత డ్రగ్ ఎల్యూటెడ్ స్టెంట్‌లు అందుబాటులోకొచ్చాయి. అంటే రక్తనాళాల్లో అమర్చే స్టెంట్‌లకు మందుపూత పూస్తారు. దీంతో రీ స్టెనోసిస్ సమస్య ఉత్పన్నమవ్వదు. ఎండోథీలియం అనే పొర హైపర్‌ప్లేషియతో పెరిగి బ్లాక్ అవుతుంది. ఇది పెరగకుండా బ్లాక్ అవ్వకుండా డ్రగ్‌ఎల్యూటెడ్ స్టెంట్‌లు వచ్చాయి. ఇవి వచ్చాక మళ్లీ బ్లాక్ అయ్యే అవకాశాలు చాలా తగ్గాయి. రీ స్టినోసిస్ షుగర్ రోగుల్లో ఎక్కువొస్తుంది. గుండె రక్తనాళాల్లో పొడవాటి బ్లాక్ వుంటే మళ్లీ వచ్చే అకాశమెక్కువ. మామూలు స్టెంట్‌తో పోల్చుకుంటే డ్రగ్ ఎల్యూటెడ్ స్టెంట్ ఖరీదు దీని కన్నా మూడు రెట్లు ఎక్కువ. కానీ దీని వల్ల అదనపు ప్రయోజనాలున్నాయి.

అపోహలు

యాంజియోప్లాస్టీ చేసుకున్నాం, ఇక గుండెకు ఏం కాదులే అని ఎప్పటిలాగే అలవాట్లను మొదలుపెడతారు. ఇది తప్పు అపోహ. అయితే యాంజియోప్లాస్టీలో గుండె రక్తనాళాల్లో పేరుకున్న కొలెస్ట్రాల్‌ను బెలూన్ ద్వారా తొలగించి, సన్నబడిన రక్తనాళాన్ని స్టెంట్ ద్వారా సాధారణ రక్తనాళంలాగా చేస్తారు. బ్లాక్ మళ్లీ రావొచ్చు. అక్కడే రావొచ్చు. లేదా ఇతర భాగాల్లో బ్లాక్ ఏర్పడొచ్చు. ఇంతకు ముందున్న అలవాట్లను మళ్లీ మొదలుపెట్టకూడదు. డాక్టర్ సూచించిన మందులు, మధుమేహం, రక్తపోటు నియంత్రణ మందులు వాడితే మళ్లీ బ్లాక్‌లు ఏర్పడే అవకాశం చాలా వరకు తగ్గుతుంది. రోగికి చికిత్స చేయడంలో డాక్టర్‌కు ఎంత బాధ్యత వుంటుందో, చికిత్సయ్యాక వ్యాధి రాకుండా చూసుకోవడం తన బాధ్యతని రోగి మరిచిపోకూడదు.

నివారణే ముఖ్యం

గుండె జబ్బు ఇప్పుడు కొత్తగా వచ్చింది కాదు. కానీ ఇప్పుడీ జబ్బు యువకుల్లో అధికంగా వస్తోంది. చికిత్స విధానాల్లో కూడా చాలా మార్పులొచ్చాయి. 1980లలో గుండె జబ్బుల నివారణకు కేవలం మందులపైనే ఆధారపడేవారు. కొత్త విధానాలు, చికిత్సలొచ్చినా వ్యాధిని నయం చేయడం కన్నా రాకుండా నివారించడం మేలని మరవకూడదు. ముఖ్యంగా గుండెజబ్బుల్లో.

మరి నివారణ ఎలా ?

ధూమపానం : ధూమపానం వల్ల గుండెకు రక్తం సరఫరా చేసే రక్తనాళాల్లో ఎండోథీలియం డిస్‌ఫంక్షన్ వస్తుంది. అంటే రక్తనాళాల్లోని పొరల్లో ఒకటి ఎండోథీలియం. ఇది చాలా ముఖ్యమైంది. ధూమపానం వల్ల ఈ పొర సరిగ్గా పనిచేయలేదు. దీంతో ఎన్నో మార్పులు వస్తాయి. అంతేకాక రక్త నాళాల్లో కొవ్వు పేరుకుపోవడానికీ (అథి రోక్లిరోసిస్) ధూమపానం తోడ్పడుతుంది. గుండెకు సరఫరా చేసే రక్తనాళం సంచోంచిచడానికీ కారణభూతమౌతుంది. మామూ లు వారితో పోల్చుకుంటే ధూమపానం చేసే వారిలో గుండె జబ్బులొచ్చే అవకాశం 14 రెట్లు ఎక్కువ. రెండేళ్లపాటు ధూమపానం ఆపితే గుండె జబ్బులు రావు.

వైద్య పరీక్షలు : నలభై ఎళ్లు దాటిన తర్వాత లక్షణాలు కనిపించినా, కనిపించకపోయినా కొన్ని ప్రాథమిక పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. అవి... మూత్రంలో షుగర్, రక్తంలో షుగర్, లిపిడ్ ప్రొఫైల్, ఇసిజి, 2డి ఎకో. వీటన్నింటికి అయ్యే ఖర్చు వెయ్యి రూపాయల్లోపే. అందుకని ఏడాదికోసారి ఈ పరీక్షలు చేయించుకోవడం వల్ల గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. ముఖ్యంగా మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులకు ఎలాంటి లక్షణాలుండవు. చాపకింద నీరులాగా కబళిస్తాయి. వ్యాధి బారినపడిన తర్వాత లక్షణాలు ఒక్కోటి బయటపడతాయి. వ్యాధులపై ప్రజలకు అవగాహన కలిగితే ఇలాంటి పరీక్షలు చేయించుకోవడానికి ముందుకొస్తారు. తద్వారా దీర్ఘకాల, ప్రాణాంతక వ్యాధులు తగ్గుముఖం పట్టే అవకాశముంది.

మధుమేహం : దీనికి ఒకటే కారణం కాదు. చాలా కారణాలున్నాయి. శరీరంలో షుగర్ ఎక్కువై పోవడం, కొలెస్ట్రాల్, ఎండోథీలియం డిస్‌ఫంక్షన్ వంటివి. మధుమేహ వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా వుండాలి. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళాలు బ్లాక్ అవ్వొచ్చు. రక్తపోటు వున్న వారిలో గుండెజబ్బులొచ్చే ఆస్కారముంది. మధు మేహాన్ని, రక్తపోటును జీవితాంతం నియంత్రిం చుకోవాలి. డాక్టర్ సూచించిన మందులు క్రమం తప్పకుండా వాడాలి. రక్తంలో ఎల్‌డిఎల్, హెచ్‌డిఎల్, ట్రైగ్లిజరాయిడ్స్ సమాన మోతాదులో వుండాలి.

రోజుకు 150 నిమిషాలు

బిజీ లైఫ్‌లో వ్యక్తిగత పనులకు కూడా టైం సరిపోవడం లేదు. అలాంటిది వ్యాయామానికి టైం ఎక్కడుంటుందని చాలా మంది అంటుంటారు. వారంలో ఐదు రోజులు, రోజుకు 30 నిమిషాలు వ్యాయామం చేస్తే గుండె జబ్బులకు దూరంగా వుండొచ్చు. రక్తంలోని కొల ెస్ట్రాల్ కరుగుతుంది. స్థూలకాయం కూడా గుండె జబ్బుకు కారణం. వ్యాయామం లేకపోవడం, తిండి తగ్గించకపోవడం వ్యాధులు కొని తెచ్చుకోవడమే.

❋

తేడాలు చెప్తాం

నేస్తాలూ... ఇక్కడ కనిపించే రెండు ఫోటోలు చూడ్డానికి ఒకేలా కనిపించినా ఆ రెండిటికి ఐదు తేడాలు ఉన్నాయి. అవేంటో చకచకా చెప్పేద్దామా.

సాయం చేయండి

బుజ్జాయిలూ... ఇక్కడున్న పాపకు బాబుకు ఏ డ్రెస్ వేసుకోవాలో తెలియక చాలా బాధ పడుతున్నారు. అక్కడున్న వాటిలో ఎవరిదే డ్రెస్సో చెప్పి సాయం చేస్తే పోలా.

లెక్క చేస్తే పోలా

ఫ్రెండ్స్ మీరు కూడికలు బాగా చేస్తారంట కదా. అందుకే ఇవాళ మీకు ఒక పెద్ద కూడిక ఇస్తున్నామర్రా. మీరు దీన్ని త్వరత్వరగా చేసేయ్యాలి. తర్వాత మా జవాబుతో మీ ఆన్సర్‌ను సరిచూసుకోండే.



జవాబు:
5+5=10,
2+6=8,
8+9=17



కనిపెడదామా...

ఫ్రెండ్స్! ఇక్కడున్న ఫోటోలో ఒక భాగం కనిపించటం లేదు కదూ. పక్కనేమో మూడు బొమ్మలు కనిపిస్తున్నాయి. మరి వాటిలో ఏది సరైనదో కనిపెట్టండి.

గిరిపుత్రుల్ని అన్నింట్లో ముందుంచాలన్నదే నా ఆశ .. ఆశయం

అభివృద్ధి చెందుతున్న ప్రపంచంతో గిరిజనులు సమకాలీకులవ్వాలన్నదే నా ఆశ. విద్య, ఆరోగ్యం, ఉపాధి గిరిజన వాసాలలో కల్పించినప్పుడే గిరిజనాభివృద్ధి సంపూర్ణంగా చేయగలమన్నది నా విశ్వాసం. ఈ దిశలో గత నాలుగు సంవత్సరాలుగా వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రతీ గిరిజన ఆవాసంలో అమలుచేస్తున్నాం. కేంద్రీకృత పద్ధతిలో, సుస్పష్టమైన విధానంతో అమలు చేస్తున్న ప్రతీ కార్యక్రమంలో గిరిజనులు విశేషంగా భాగస్వామ్యం చెందుతున్నారు. నాడు కొండ కోనల్లో వుంటూ, అభివృద్ధికి దూరంగా వున్న గిరిజనులు నేడు నవ సమాజంతో సమఉజ్జీలవ్వడం .. నిజంగా నాకు చాలా ఆనందంగా వుంది.

- డా॥ వై.యస్. రాజశేఖరరెడ్డి

గిరిజనాభివృద్ధికి గతంలో ఎన్నో ప్రణాళికలకు రూపకల్పన చేయడం జరిగింది. అయినప్పటికి గిరిజనాభివృద్ధిలో ఆశించినంత అభివృద్ధి సాధించలేకపోయాము. చిత్తశుద్ధిలేని, కార్యక్రమాల అమలులో లోపాలు, నిధుల కొరత గిరిజనాభివృద్ధికి అడ్డగోడలుగా నిలిచాయి. డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఈ పరిస్థితిని పరిపూర్ణంగా విశ్లేషించి, గిరిజనాభివృద్ధికై అన్ని విధాలా కృషి చేయాలని నిర్ణయించి, ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తుంది. మన రాష్ట్రంలో **50.24** లక్షల మంది గిరిజనులు ఉన్నారు. జనాభాలో వీరిది సుమారు **7** శాతం. ఈ **50** లక్షల మందిలో **30.47** లక్షల మంది నోటిఫైడ్ గిరిజన ప్రాంతాల్లోను, **19.53** లక్షల మంది మైదాన ప్రాంతాల్లోనూ నివసిస్తున్నారు. **2004** నుంచి సమగ్ర గిరిజనాభివృద్ధి ప్రణాళికలకు, విద్య, ఆరోగ్యం, పారిశుద్ధ్యం, గృహనిర్మాణ కార్యక్రమాలకు డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రూ. **5402.55** కోట్లు ఖర్చు చేసింది. **2008-09**లో అదనంగా రూ. **812.80** కోట్లు కేటాయించింది. రాజ్యాంగంలో పొందుపరిచిన ఆదేశిక సూత్రాల స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ఉపప్రణాళికలను అమలుచేస్తోంది.

2002-03లో రాష్ట్ర ప్రణాళికా వ్యయంలో గిరిజన ఉపప్రణాళిక కింద కేవలం రూ. **508.35** కోట్లు ఖర్చుతో పోలిస్తే **2007-08** లో దాదాపు నాలుగింతలు వ్యయం గిరిజన ప్రణాళిక క్రింద రాష్ట్ర ప్రభుత్వం చేయగలిగింది.

- రాష్ట్రంలో గిరిజనులు సాగుచేసుకుంటున్న 5.84 లక్షల ఎకరాల భూములకు హక్కులు కల్పించే కార్యక్రమాన్ని 2008 ఆగష్టు నాటికి పూర్తి. ఇలా హక్కులు కల్పించిన భూముల్లో పండ్లతోటలు, కాఫీ, రబ్బరు వంటి వాణిజ్య పంటలను పండించడానికి ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సాహమిస్తుంది.
- ఈ భూముల సాగుకు విత్తనాలు ఉచితంగా ఇవ్వడంతో పాటు, బోర్లు, చెరువుల తవ్వకానికి, ట్యాంకుల నిర్మాణానికి నిధులు ఇస్తారు.
- మహబూబ్‌నగర్ జిల్లా నల్లమల అభయారణ్యంలోని చెంచులను, ఇతర జాతుల గిరిజనులను బయటికి తెచ్చి పునరావాసం కల్పిస్తున్నారు.
- అరకులోయ, పాడేరు ప్రాంతాల్లోని కాఫీ తోటల్లో పండే పంట అంతర్జాతీయ ప్రఖ్యాతి గాంచింది. దీనికి 'అరకు కాఫీ' అనే బ్రాండ్ నేమ్ కూడా వచ్చింది. పదవ ప్రణాళికలో 60 వేల మంది గిరిజనులకు ప్రయోజనం చేకూర్చేందుకు 60 వేల ఎకరాల్లో కాఫీ, ఇతర పంటల సాగుకు రూ. 144 కోట్లతో కార్యాచరణ ప్రణాళిక ఒకదాన్ని రూపొందించారు. 11వ పంచవర్ష ప్రణాళికలో 60 వేల ఎకరాల్లో కాఫీ సాగుకు 25 శాతం కాఫీ బోర్డు, 25 శాతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, 50 శాతం లబ్ధిదారుల శ్రమ రూపంలో పెట్టుబడి పెట్టే రూ. 148 కోట్ల కాఫీ ప్రాజెక్టును చేపట్టారు.
- 2,83,882 ఎస్.టి. కుటుంబాలకు రూ. 272.89 కోట్లు సహాయం అందించే ఒక కార్యాచరణ ప్రణాళికను 2008-09 సం॥లో ప్రభుత్వం రూపొందించింది. దీనివల్ల గిరిజన ప్రాంతాల్లో వ్యవసాయం, పండ్లతోటల పెంపకానికి ప్రోత్సాహం లభిస్తుంది.
- 9,06,591 మంది గిరిజన మహిళలు 69,737 స్వయం సహాయక బృందాలుగా సంఘటితమై ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొంటున్నారు. వారిలో 27,245 సంఘాలకు ఆదాయాన్నిచ్చే ఉపాధి కార్యక్రమాలు చేపట్టేందుకు సామాజిక మదుపు నిధి కింద ఆర్థిక సహాయం అందుతుంది. దీనివల్ల 3,54,183 మంది గిరిజన మహిళలు ప్రయోజనం పొందుతున్నారు.
- ఆదిమ గిరిజన తెగల (పిటిజిలు) అభివృద్ధి, సంక్షేమాలకు ప్రభుత్వం

విద్య అభివృద్ధికి తొలిమెట్టు. ఇది గిరిజనాభివృద్ధిలో నేడు రుజువైంది. గిరిపుత్రులకు పరిపూర్ణమైన విద్యావకాశాలను అందుబాటులో ఉంచి వారిలో సంపూర్ణమైన అక్షరాస్యతను సాధించాలన్న దృఢ సంకల్పంతో డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డి గారు గత నాలుగు సంవత్సరాలుగా గిరిజనులపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వినూత్న రీతిలో పలు విద్యా కార్యక్రమాలను అమలు చేసేందుకు కృషి సల్పుతున్నారు. నేడు గిరిజనులు ప్రభుత్వం అందిస్తున్న విద్యావకాశాలను పూర్తిగా వినియోగించు కుంటూ, విద్యతో ఉజ్వల భవితను సాధించగలమన్న ఆత్మస్థైర్యంతో గిరిజనులు అన్నింట్లో ముందుండటం నేడు మనం చూడవచ్చు.

విద్యా పథంలో ... గిరిజనులు

- గిరిజన సంక్షేమ వసతి గృహాలు మరియు ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు ఆహార ఛార్జీలు (డైట్ ఛార్జీలు) 35 శాతం పెంచారు.
- హాస్టళ్లలోని విద్యార్థులకు శుచి రుచి కలిగిన పోష కాహారాన్ని అందించేం దుకు సవివరమైన మార్గదర్శకాలతో ఆదేశాలు జారీ అయ్యాయి.
- పోస్టుమెట్రిక్ విద్యనభ్యసిస్తున్న గిరిజన విద్యార్థుల యొక్క ఉపకార వేతనాలు 2008-09 నుండి పెంచారు.
- పోస్టుమెట్రిక్ విద్యనభ్యసిస్తున్న గిరిజన విద్యార్థుల తల్లితండ్రుల వార్షికాదాయ పరిమితిని లక్షరూపాయలకు 2008-09 సంవత్సరం నుండి పెంచారు.
- ప్రీమెట్రిక్ విద్యనభ్యసిస్తున్న గిరిజన విద్యార్థులకిచ్చే స్కాలర్‌షిప్ రేట్లను 2008-09 సం॥ నుండి 10 శాతం పెంచారు.
- మధ్యలో విద్యాభ్యాసాన్ని మానివేసిన గిరిజన విద్యార్థినులకోసం (90) కస్తూర్బాగాంధీ విద్యాలయాలను నూతనంగా ప్రారంభించారు.
- గిరిజన విద్యాలయాలలోని విద్యార్థులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో తక్షణ వైద్యం అందే విధంగా కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన నేషనల్ ఇన్స్యూరెన్స్ కంపెనీ ద్వారా 2,79,954 మంది విద్యార్థులకు బీమా సదుపాయం కల్పించారు. దీనికింద రూ. 5 వేల వైద్య బీమా, రూ. 15 వేల ప్రమాదబీమా, ఖరీదైన వైద్యం, అవసరమైన సంద ర్భాలకు రూ. 50 వేల బీమా ఈ పథకం కింద లభిస్తాయి. ఇప్పటి వరకు 3905 మంది గిరిజన విద్యార్థులు ఈ బీమాను వినియోగించుకున్నారు.
- రూ. 27.25 కోట్ల ఖర్చుతో 259 మందికి అదనపు వసతి సదుపాయం కల్పిం చారు.
- 2008, మార్చి నెలలో జరిగిన సంక్షేమబాటలోభాగంగా గుర్తించిన అత్యవసర మరమత్తులకు మరియు పనులకు రూ. 55.07 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినది. ఈ నిధుల ద్వారా (1174) గిరిజన విద్యా సంస్థలలో అత్యవసర మరమత్తులు మరియు క్రొత్త పారిశుధ్య గదుల నిర్మాణము జరుగుతున్నది.
- 232 గిరిజన సంక్షేమ ఆశ్రమ మరియు గురుకుల పాఠశాలల్లో ఇంగ్లీష్ మాధ్యమంలో సి.బి.యస్.ఇ. సిలబస్ ప్రకారం 2008-09 నుండి విద్యాబోధన చేపట్టడం జరిగింది.
- (232) ఇంగ్లీషు మీడియం గురుకులాలలో ఒక్కొక్క దానికి (20) స్నానపు గదులు మరియు పారిశుధ్య పనుల నిర్మాణానికిగాను రూ. 25.13 కోట్లు మంజూరు చేయబడినది.

ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తున్నది. అందులో ముఖ్యమైనది **"జనశ్రీబీమా యోజన"**. సీతంపేట, పార్వతీపురం, కె.ఆర్. పురం, పాడేరు, భద్రాచలం, ఉట్నూర్ మరియు శ్రీశైలం సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థల పరిధిలోగల సవర, గదబ, కొండరెడ్డి, కోలం, తోటి మరియు చెంచు మొదలగు ఆదిమ గిరిజన తెగలకు చెందిన (67, 910) కుటుంబాలకు రూ. 407.55 లక్షల వ్యయంతో ఈ పథకం అమలు చేయబడుతున్నది.

- ఎస్టీలకు భూమి కొని ఇవ్వడానికి నీటిపారుదల సౌకర్యం గల భూమి కొనుగోలు పరిమితిని రూ. 54 వేల నుంచి లక్ష రూపాయలకు పెంచారు.
- గిరిజన ప్రాంతాల్లో 244 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, 1012 ఉపకేంద్రాలు, 18 డిస్పెన్సరీలు, 32 కమ్యూనిటీ సెంటర్లు ఉన్నాయి. 8,500 మంది కమ్యూనిటీ హెల్త్ కార్యకర్తలు పనిచేస్తున్నారు.
- గిరిజన ప్రాంతాల్లో మినీ జలవిద్యుత్ కేంద్రాలను, సౌరశక్తి, బయోమాస్ ఆధారిత సంప్రదాయేతర విద్యుదుత్పత్తి కేంద్రాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.

గిరిజన సంక్షేమానికి చేయూత

రుణమాఫీ : గిరిజనులు తీసుకున్న రుణాలను రాష్ట్ర ప్రభుత్వం మాఫీ చేయడం వలన 13,36,379 మంది గిరిజనులుకు లబ్ధి చేకూరింది.

భూపంపిణీ : రాష్ట్ర ప్రభుత్వం నాలుగు విడతలుగా చేసిన భూపంపిణీలో 1.06 మంది గిరిజనులు ప్రయోజకులయ్యారు. ఐదో విడత భూపంపిణీలో అటవీ హక్కుల గుర్తింపు చట్టం ద్వారా గిరిజనులకు పెద్ద పీట వేయనుంది.

మహిళా సాధికారత : పేదరిక నిర్మూలనలో భాగంగా గిరిజన మహిళలు సేకరించిన జిగురు, రబ్బరు, చింతపండు, సుగంధ ద్రవ్యాల వంటి అటవీ ఉత్పత్తుల మార్కెటింగ్‌లో స్వయం సహాయక బృందాల వారికి రాష్ట్ర ప్రభుత్వం చురుకైన పాత్ర కల్పించింది.

అటవీ హక్కుల గుర్తింపు చట్టం ద్వారా గిరిజనులకు చిన్నతరహా అటవీ ఉత్పత్తులు, అడవిలో పశువులను

అటవీ హక్కుల గుర్తింపు చట్టంతో గిరిజనుల్లో ఆనందం

అటవీ హక్కుల గుర్తింపు చట్టం ద్వారా గిరిజనులకు చిన్నతరహా అటవీ ఉత్పత్తులు, అడవిలో పశువులను మేపుకొనేందుకు, చేపలు పట్టేందుకు, మత సంబంధమైన స్థలాలు, సంప్రదాయక అటవీ సంపద, మందు మొక్కలు, కొండపోడు భూములు, మరియు నివాసం వుండేందుకు హక్కులు రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. సుమారు 2,15,009 మంది గిరిజనుల ఆక్రమణల్లో ఉన్న 6.28 లక్షల ఎకరాలకు సంబంధించిన హక్కులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.

గిరిజన వాసుల మనోభావాలను దృష్టిలో వుంచుకొని, వారు దీర్ఘకాలంగా ఆశిస్తున్న అటవీ హక్కులను డాక్టర్ వై.యస్. రాజశేఖర రెడ్డి గారు అటవీ హక్కుల గుర్తింపు చట్టంతో సాకారం చేశారు. గిరిజన సంక్షేమాన్ని నోటి మాటగా కాకుండా, చేతల రూపంలో చూపించి పరిపూర్ణమైన గిరిజనాభివృద్ధి సాధనకు అనువైన విద్య, ఆదాయ వనరులు, ఉపాధి, ఆరోగ్య కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యతనివ్వడం జరిగింది. చిత్తశుద్ధితో అమలవుతున్న ఈ కార్యక్రమాల సత్ఫలితాలు ప్రతీ గిరిజన వాసంలో ఆనందాన్ని నింపుతున్నాయి. ఆత్మ స్థైర్యాన్ని పెంపొందిస్తున్నాయి. డాక్టర్ వై.యస్. రాజశేఖర రెడ్డి గారి నేతృత్వంలో గిరిజనాభివృద్ధి నింగినంటుతుందనడంలో సందేహం లేదు.

అట్టమీది కథ

సెలబ్రిటీ ఫోటోలు

కోట్లు పలికే బేరాలు

పీపీ

టీవీతో లేచి, దాంట్లోనే మునిగి తేలి,
మిడ్‌నైట్ మసాలాతో గుడ్‌నైట్ చెప్పే కాలంలో...
జనన మరణాలు
వినోద విషాదాలు
భక్తి రక్తి
విధ్వంసమూ వికృతమూ
ప్రేమా పెళ్లి
విందులూ విహారాలూ
వేడుకలూ వేదనలూ
నేరాలూ ఘోరాలు
రోగాలూ భోగాలూ
అద్భుతాలూ అమానుషాలు ఏవైతేనేం?
అన్నీ అమ్మకానికే. ప్రతీదీ ప్రజాకర్షణకే. ప్రతీదీ ప్రచారానికే.
ఈ ధోరణి ఇప్పుడు మరీ వెర్రి తలలు వేస్తున్నదా?
ఔననే చెప్పాలి.మనం చెప్పడం కాదు.మనకన్నా ముందే మీడియా విస్ఫోటనానికి, వాణిజ్యకరణకు వరవడి పెట్టిన అమెరికా బ్రిటన్ వంటి దేశాలలో కూడా కాస్త ఆలోచించే వారంతా ఆందోళన చెందుతున్నారు.
ప్రముఖ వ్యక్తులు లేదా ముద్దుగా పిల్చుకునే సెలబ్రెటీలు వేలం పాటలు పెట్టి వెల కట్టుకుంటున్న తీరుకు విస్తుపోతున్నారు. ఏది రైటో ఏది తప్పో తెలియక తబ్బిబ్బవుతున్నారు.
నిజం. నిజ్జంగా నిజం.

ఈ పరిణామం కొత్తగా వచ్చింది కాకున్నా ఈ ప్రశ్నలు ఇంత గట్టిగా వినిపించడానికి కారణం వుంది. హాలివుడ్ ప్రముఖులు ఏంజలీనా జోలీ– బ్రాడ్‌పిట్‌లకు పుట్టిన కవల పిల్లల మొదటి ఫోటో కళ్లు మిరుమిట్లు గొల్పేలా 75 లక్షల పౌండ్లు పలికాయట. కన్నులైనా తెరవని ఆ కసికందు కవలల ఫోటోలు రాబోయే సంచికలో ప్రచురించే ఘనత తమకే దక్కిందని అమెరికాలోని 'పీపుల్' పత్రిక గొప్పగా ప్రకటించింది. ఈ విషయంలో ఇంగ్లాండుకు చెందిన 'హలో' పత్రిక కూడా ఈ బేరంలో భాగస్వామి గనక దాంట్లోనూ ఈ ఫోటోలు అచ్చయ్యాయి. ఆ కవలల పేర్లు కెన్స్‌లియోన్– వివిన్నా మార్స్‌లిన్. ముద్దొచ్చే కవలల ఫోటోలు అచ్చవడంలో గాని ప్రసారం చేయడంలో గాని పేచీ ఏం వుండనవసరం లేదు.కాని వాటిని అంత రేటు పెట్టి కొని అంత ప్రచారంతో పోటా పోటీగా విడుదల చేయవలసిన అవసరం ఏమైనా వుందా? అందులో అంత గొప్ప విశేషం లేదా సంచలనం ఏముంది? వారి తల్లి దండ్రులు సెలబ్రెటీలు కావడం తప్పు?

అయితే ఇలా జరగడం ఇదే మొదటి సారి కాదు మరి. 2006 జూన్‌లో ఏంజలీనా మొదటి బిడ్డ షిలోహ్ జూలీ పిట్‌ను కన్నప్పుడు కూడా ఇదే కథ.. ఆ బేబీ ఫోటో అప్పట్లో 41 లక్షల పౌండ్లు పలికింది. దాన్ని వారు అప్పట్లో గెట్టీ ఇమేజస్ అనే సంస్థకు విక్రయించారు. అమెరికాలో వాటికి 40 లక్షల డాలర్లు చెల్లించినట్టు అంచనా. 2006 జూన్‌లో పీపుల్స్ మ్యాగజైన్ తలిదండ్రులతో పాటు పాప ఫోటోలు ఆరు ప్రచురించింది. ఆ సంచిక 22 లక్షల కాపీలు అమ్ముడైనట్టు వార్తలు వచ్చాయి. సెప్టెంబరు 11న నలభై లక్షల కాపీలు అమ్ముడు పోయిన తర్వాత ఇంత పెద్ద సంఖ్యలో విక్రయం ఇదే మొదటి సారని కూడా చెప్పుకున్నారు.

అప్పుడూ ఇప్పుడూ కూడా ఈ ఫోటోల హక్కులకై సాగిన పోటాపోటీ గురించి అందులో జయించిన వారి సామర్థ్యం గురించి ఎనలేని ప్రచారం.ఇందులో మధ్యవర్తిగా వ్యవహరించిన వ్యక్తి తనకు 14 లక్షల పౌండ్లు వచ్చాయని కూడా చెప్పాడు.

ఏంజలీనా - పిట్‌ల తొలి సంతానం షిలోహ్

పాపతో... టామ్, కాటీ హోమ్స్

కోట్ల రేట్లు... మనకే పోట్లు!

సెలబ్రెటీల గురించిన వివాదాలు, అల్పమైన విషయాల చుట్టూ అంతులేని కథనాలు వారి ప్రచార విలువ పెంచుతాయన్నది నిజం. మంచికో చెడ్డకో వార్తల్లో వుండేట్టు చూసుకోమన్నది మొదటి నుంచి హాలివుడ్ సూత్రం.ఇటీవల కాలంలో సల్మాన్ ఖాన్ వంటి వారు దీన్ని అక్షరాలా నిరూపించారు. త్రిష బాత్‌రూం ఫోటోలు రహస్యంగా తీసి నెట్‌లో పెట్టారని అదే పనిగా ప్రసారం చేశారు. కాని తర్వాత ఆమే పండుగ రోజున మత్తులో చిందులు వేసిన దృశ్యాలు బహిరంగంగానే అందించేందుకు కారణమైంది. ఇవన్నీ యాదృచ్ఛికం కాదు. తమ గురించి ఎక్కువగా జనం మాట్లాడుకుంటే ఎక్కువ రేటు వసూలు చేసుకోవచ్చని వారి వ్యూహం. ఎంత ఎక్కువ ప్రచారం పొందితే అంతగా వ్యాపార సంస్థలు వారి వెంటపడతాయి.సెలబ్రెటీలు అడ్వర్టయిజ్‌మెంట్లలో కనిపించి సిఫార్సు చేస్తే ఆ సరుకులకు ఎక్కువ గిరాకీ వుంటుందని మార్కెట్ పరిశోధనలు చెబుతున్నాయి.ఈ విషయంలో మన దేశంలో షారుక్‌ఖాన్‌ది అగ్రస్థానం. ఆయన చెబితే తాము ప్రాధాన్యత నిస్తామని 17శాతం మంది చెప్పారు. 10 శాతం మంది ఇంకా అమితాబ్ మాటలకే విలువనిస్తున్నారు. ఆయనది రెండవ స్థానం. లేడీ సెలబ్రెటీల్లో ఐష్ దే అగ్రస్థానం. దక్షిణాదిన ఆస్థానం స్నేహ దక్కించుకుంది. సెలబ్రెటీలు యాడ్‌లో కనిపించి చెప్పినంతమాత్రాన ఆ సరుకును నిజంగా వాడుతున్నట్టు కాదని సగం మందికి పైగా ప్రజలకు తెలుసు.కాని 22 శాతం మంది మాత్రం అలా అనుకోవడం లేదు. వారు చెబుతున్నారంటే నిజంగానే వాడుతుంటారని వారు అమాయకంగా అనుకుంటున్నారు. ఐఎంఆర్బి ఐపాన్ సంస్థలు నిర్వహించిన సర్వేలో వెల్లడైన మరో ఆసక్తికరమైన విషయం ఈ విషయంలోనూ స్త్రీ పురుష వివక్ష వుంది. పురుష సెలబ్రెటీలు సిఫార్సు చేస్తే 68 శాతం మంది వస్తువును తీసుకుంటే స్త్రీల విషయంలో అది 19 శాతంగానే వుంది.ఏమైతేనేం ఈ వస్తు వినిమయ మాయాజాలం కోసం కృత్రిమంగా సెలబ్రెటీలకు సంబంధించిన ప్రతి చిన్న విషయాన్ని అతిగా చిత్రించి వీక్షకులకు మభ్యపెడుతుంటారు.



లిజ్ హార్లీ- అరుణ్ నయ్యర్

పీపుల్ పత్రిక సిఎన్ఎన్ వార్తాసంస్థలో భాగస్వామి. కనక అది ప్రచురించే కథనాన్ని సిఎన్ఎన్ ఛానల్ కూడా ప్రసారం చేసింది.

శత కోటీశ్వరులైన సెలబ్రెటీలై వుండి అప్పుడే పుట్టిన శిశువుల ఫోటోలను అమ్ముకోవడానికి అంతగా ఎగబడడమేమిటని సందేహిస్తున్నారా? సమాధానం రె డీ - 33 ఏళ్ల జూలీ, 44 ఏళ్ల పిట్‌లు ఈ మొత్తాన్ని సమాజ సంక్షేమానికే వినియోగిస్తారట. వారు 2006లో ఒక ఫౌండేషన్ స్థాపించారు. ఇరాక్ వంటి చోట్ల ఘర్షణల్లో గాయపడిన పిల్లల సంక్షేమానికి దీన్ని వినియోగిస్తామంటారు. 2007లో కూడా వీరు అంతర్జాతీయ సేవా సంస్థకు 3 లక్షల డాలర్లు ప్రకటించారు. కనక ఇందులో తప్పేముంది?

ఇంతకు ముందు టామ్ క్రూజ్- కాటీ హోమ్స్‌లకు పుట్టిన పుత్రిక సూరి తొలి ఫోటోలు కూడా 30 లక్షల డాలర్లకు అమ్ముడైనాయి.

అంతకు ముందు అమితాబ్ బచన్ కుటుంబం అభిషేక్ బచన్-ఐశ్వర్యరాయ్‌ల వివాహ వేడుకల చిత్రీకరణ హక్కులను అయిదు కోట్ల రూపాయలకు విక్రయించింది. దాంతో ఇతర ఛానల్ల వారికి అవకాశం రాలేదు. మన రాష్ట్రంలోనూ ఇలాంటి ఉదాహరణలున్నాయి. తెలుగు సినిమా వజ్రోత్సవ వేడుకలు గాని, మొన్న చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ ప్రారంభ సభ ప్రత్యేక దృశ్యాలు గాని చిత్రీకరించే హక్కు ఆయన కూడా భాగస్వామిగా వున్న మా టీవీకి మాత్రమే లభించాయి.

ఇలాంటి కథలు ఇంకా వున్నాయండోయ్! లిజ్ హార్లీ- అరుణ్ నయ్యర్ల పెళ్లి ఫోటోలను 60 లక్షల పౌండ్లకు హలో పత్రికకే అమ్ముకున్నారు. విక్రం ప్రియల పెళ్లిలోనూ ఇలాంటి వ్యవహారమే జరిగింది.

❖ ❖ ❖

మన ఛానల్స్ ఎంత సేపూ నాలుగు సిల చుట్టూనే తిరుగుతున్నాయని పరిశీలకులు చెబుతూనే వున్నారు. సినిమా,క్రైమ్, క్రికెట్, సెలబ్రెటీలు అనే ఆ నాల్గు సిలకు చెల్లించే కాస్ట్ కూడా ఎంత ఎక్కువో చూశారుగా.అయితే మనకేంటి అనుకున్నారో పప్పులో కాలేసినట్టే. వ్యాపారం కోసమే ఛానల్లు వార్తాసంస్థలు నడిపే వారు నిష్కామంగా వీటిని కొనుగోలు చేస్తారనుకుంటే అంతకన్నా పొరబాటు వుండదు. సెలబ్రెటీలనబడే వారి చుట్టూ వీక్షకుల అభిరుచిని ప్రదక్షిణలు చేయించడంలో అనేక ప్రయోజనాలున్నాయి.ప్రలోభాలున్నాయి. వీటి వల్ల సెలబ్రెటీల ఇమేజి పెరుగుతుంది. వారిని సొమ్ము చేసుకునే అవకాశమూ పెరుగుతుంది. వారిని అడ్డం పెట్టుకుని తమ ఉత్పత్తులు అమ్ముకోజూసే మార్కెట్



ఐష్... అభి....

అన్నిటిపైనా అవిశ్వాసం

ఈ శ్రుతి మించిన ప్రచార వ్యూహాలలో సెలబ్రెటీ షోలలో విశ్వసనీయత దారుణంగా దెబ్బతినిపోయింది. వారికి సంబంధించి ఏది నిజమో ఏది అసత్యమో అని ప్రతివారు సందేహిస్తున్నారు. విషాదమేమంటే విదూషకుడి మరణం కూడా వినోదమే అనుకున్నట్లు సెలబ్రెటీల బాధాతప్త క్షణాలను కూడా ప్రచారం కింద కొట్టి వేసే దుర్గతి ప్రాప్తించడం. కొంత కాలం కిందట రియాల్టీ షోలో భారతీయ . తార శిల్పాశెట్టిని జేడీ గూడి అనే అవమానించిందంటూ పెద్ద వివాదం నడిచింది. శిల్ప కన్నీళ్లు పెట్టుకోవడం వగైరాలన్నీ అందరూ చూశారు. ప్రముఖులైన వ్యక్తులను నెల రోజుల పాటు ఒక భవనంలోనే అట్టిపెట్టి వారు దైనందిన వ్యవహారాలలో ఎలా ప్రవర్తిస్తారో చూపించడం ఈ కార్యక్రమ ఉద్దేశం. ఆ సందర్భంగా వారు పళ్లు తోముకోవడం, ముక్కు చీదుకోవడం కూడా చూపించేవారు. ఆఖరుకు టాయిలెట్‌లో కూడా కెమెరాలుంటాయనే భయంతో శిల్ప మొదట స్నానమే ఎగరగొట్టింది. మరో వైపున ఆ షోలో పాల్గొన్న మరో సుందరి బాత్‌రూంలో కెమెరాలు పెట్టకపోతే నా దేహ సౌందర్యం సంపూర్తిగా చూపించడమెలాగని కస్సుబుస్సులాడింది. ఈలోగా జేడీ గూడి ఉదంతం మీడియాను ముంచెత్తింది...

ఇంతకూ ఇప్పుడు ఆ జేడీ గూడికి క్యాన్సర్ వచ్చినట్టు వెల్లడైంది. దీనిపై అనేకమంది విచారం వెలిబుచ్చుతుంటే ఇది కూడా ప్రచారపుటెత్తుగడ అని కొందరు కొట్టిపారేస్తున్నారు. ఈ మేరకు వెబ్‌సైట్లలో ఇలాంటి వ్యాఖ్యానాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నిజంగా క్యాన్సర్ వచ్చిందంటారా, వస్తే ఇలా వుంటుందా? ప్రచారం కోసం క్యాన్సర్‌ను వాడుకోవడం ఘోరం కాదా వంటి మాటలు వింటుంటే ఈ ప్రచార ప్రపంచం ఎంతటి అవిశ్వాసాన్ని సృష్టించిందో అర్థమవుతుంది. దీనిపై హలో పత్రికలో మరో ప్రత్యేక కథనం కావలసిందేనని కూడా వ్యాఖ్యలు రావడంతో జేడీ గుడి ప్రచార ఏజంటు ఆమె క్యాన్సర్ నిజం కాదన్న వ్యాఖ్యలను గట్టిగా ఖండించవలసి వచ్చింది. ఇంతకూ జేడీ గూడి పెద్ద నేరం చేసిందనీ చెప్పడం కష్టం. సెలబ్రెటీ షోలో ఒకింత క్రూరంగా కనిపిస్తే ఎక్కువ ప్రచారం వస్తుందని ఆమె భావించింది.పైగా ఆమె కులీన వర్గాల నుంచి కాక ఒక విధంగా వెనకబడిన వర్గం నుంచి వచ్చినందుకే ఆమెపై అంతటి దాడి సాగిందని అప్పట్లోనే విమర్శలు వచ్చాయి. దీనివల్ల శిల్పకు మాత్రం విపరీతమైన రేటింగు పెరిగింది. తర్వాత ఆమె చేసిన యోగా క్యాసెట్లకు కూడా దీని వల్ల లాభం కలిగింది.చాలా అవార్డులు కూడా వెతుక్కుంటూ వచ్చాయి. ఇండియాలోనూ ఒక ఛానెల్ ఆమెను యాంకర్‌గా పెట్టి జేడీ గూడితో సహా రియాల్టీ షో నడిపించే ప్రయత్నం చేసింది. మీడియా సెలబ్రెటీలు ఆడియన్సు త్రికోణంలో అంతిమంగా నష్టపోయేది మాత్రం ఆడియన్సే. దీనంతటి వల్ల సమాజ విలువలే వికృతమై పోవడం మరింత దారుణ పర్యవసానం.

సెలబ్రెటీ వేలం వెర్రి రాజకీయ నాయకులకూ పాకి వారు ఏం దుస్తులు ధరించారు ? ఎక్కడ కూచున్నారు వంటి అప్రధాన విషయాలను నివేదించడం గొప్ప విషయమై పోతున్నది. బ్రిటిష్ ప్రధాని గార్డన్ బ్రౌన్ ఏ రంగు కోటు వేశాడన్న దానికంటే ఏ విధానాలు అనుసరిస్తున్నాడనేది ముఖ్యమని కేంబ్రిడ్జి ప్రొఫెసర్ బిల్ కిర్క్‌మాన్ రాశారు. అమెరికాలోనూ ఇదే పరిస్థితి. ఆగస్టు 25న జరిగిన డెమోక్రటిక్ పార్టీ సదస్సు, సెప్టెంబరు 1 రిపబ్లికన్ పార్టీ సదస్సు కూడా నిర్వహణలో తళుకుల పట్ల చూపిన శ్రద్ధ అధ్యక్ష అభ్యర్థుల విధానాలపై చూపలేదని పుర్డ్యే యూనివర్సిటీ ప్రొఫెసర్ జేమ్స్ మకాన్ వ్యాఖ్యానించారు. ఇదే పరిస్థితి ఇంచుమించుగా మనకూ లేదని చెప్పగలమా?

వ్యూహమూ నెరవేరుతుంది.అన్నిటినీ మించి లోతైన రాజకీయ సామాజిక విషయాల్లోకి వెళ్లనీకుండా జనానికి చవక బారు అభిరుచులు మప్పే పథకం జయప్రదంగా అమలు జరుగుతుంది. అయినా ఇదంతా ప్రజల అభిరుచిని, ఆసక్తిని తీర్చడానికే జరుగుతున్నట్టు చెబుతారు.ఐశ్వర్యా రాయ్ ఏ చెవికి ఏ రింగు ధరించిందో తెలుసుకోవాలని నిజంగానే ప్రజలు అంతగా వువ్విళ్లూరి పోతున్నారా? అలా అయితే అదే పనిగా చూపించిన తర్వాత కూడా దాని గురించి ఎంతమంది మాట్లాడుకుంటున్నారు? "ఐశ్వర్యా రాయ్ ఇంటి బయట దిష్టి తీసేశారు గనక ఆమె నెల తప్పిందా?" అని పెద్ద పరిశోధనాత్మక కథనం చేయడం ఎవరి కోసం?

ప్రజలే నిర్ణేతలైన ప్రజా స్వామ్యం అంటూనే వారి కంటే గొప్ప వారుగా సెలబ్రెటీలను సృష్టించడం యాదృచ్ఛికం కాదు. సెలబ్రెటీల దైనందిన జీవితం,వివాహం, వినోద విహారాలు,వాళ్ల కుటుంబాల్లో ప్రతి పరిణామాన్ని డబ్బు చెల్లించి మరీ తీసుకోవడం పెద్ద వ్యాపార సామాజిక వ్యూహం.అయితే ఇందుకు ప్రజల ఆకాంక్షలే కారణమని వారంటారు." సెలబ్రెటీలకు సంబంధించిన వివిధ ఘట్టాలను చూడాలనే కాంక్ష ప్రజలలో చాలా బలంగా వుంటుంది.అందుకే వారికి సబంధించిన ఫోటోలను విపరీతమైన ధర చెల్లించి తీసుకోవడం జరుగుతుంది.అందువల్లనే ఈ అసాధారణ దాహం అని హలో పత్రికసంపాదకులరాలు రుచి వెంవాతా అభిప్రాయం.

ఈ ధోరణి వెర్రి తలలు వేసిన తర్వాత వ్యాధి గ్రస్తులైన దశలోనూ ఆఖరుకు మరణంలోనూ సెలబ్రెటీలను వేటాడటం పెద్ద ఘనకార్యమై కూచుంది. కొన్నిసార్లు వెంటబడి కొడుతున్నా వాళ్ల వేడుకల చిత్రీకరణకు పాకులాడిన ఉదాహరణలున్నాయి. అమితాబ్ బచన్ జబ్బు చేసి చికిత్స పొందుతున్నప్పుడు ఒక టీవీ జర్నలిస్టు నర్సుగా వేషం వేసుకుని క్లోజప్ షాట్లు తీసేందుకు


పాపతో... బ్రిటనీ


పిట్-జోలీ



పాపతో... జోలీ

ప్రయత్నించిన ఉదంతం గుర్తుండేవుంటుంది. దీన్ని అవకాశంగా తీసుకుని సెలబ్రెటీలు కూడా తమ వ్యక్తిగత విషయాలకు తామే రేటు కట్టి వసూలు చేసుకునే ధోరణి ముదిరిపోతున్నది. ఆఖరుకు విషాదాలను కూడా. అనా నికోల్ స్మిత్ తన కుమారుడు చనిపోవడానికి కొన్ని నిముషాల ముందు ఆఖరి సారి ముద్దాడిన దృశ్యాన్ని టచ్ వారపత్రిక 4 లక్షల డాలర్లకు తీసుకున్నది!

లైఫ్‌స్టయిల్ పత్రికలు, టీవీలలో రియాల్టీ షోలు ఇలాంటి వాటికోసం మరీ ఎక్కువగా పోటీ పడుతుంటాయి. ఈ పోటీలో ముందుండడం కోసం విపరీతమైన సొమ్ము వెచ్చించి ఫోటోలూ విడియో క్లిప్పింగులు కొనుగోలు చేస్తుంటారు. దీని వల్ల ప్రజలకు ప్రయోజనమేమిటి, ఇందులో ఔచిత్యమేమిటి వంటి ప్రశ్నలు వాటికి అవసరం లేదు. ఇందాక చెప్పుకున్న మృత్యు చిత్రం గురించి ప్రసిద్ధ పత్రిక ఫోర్బ్స్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ డాన్ వేక్‌ఫర్డ్ ఇలా అన్నారు 'డేనియల్ మరణానికి సంబంధించిన ఫోటోలకు వార్తా విలువ చాలా వుంది. అది యావద్దేశాన్ని ఉద్వేగానికి గురి చేసింది. ప్రతి తల్లిని చలింపచేసే మహా విషాదమది. ఈ చిత్రాల ద్వారా వాటిని చూసిన అమెరికా యావత్తూ సానుభూతిగా స్పందించింది'. ఈ మాటలు బాగానే వున్నా పూర్తిగా నిజం కాదు. వివాహ వేడుకలనూ శిశువుల జనన మరణాలకూ కూడా ఒకే విధమైన వార్తావిలువ వుంటుందనడం విడ్డూరమైన విషయం. "ఈ రోజున ప్రతిదాంట్లోనూ వాణిజ్యపరమైన అంశం చోటు చేసుకుంటున్నది. ఇది వరలో సెలబ్రెటీలు ఏవైనా ఉత్సవాలకు సుహృద్భావ పూర్వకంగా వచ్చేవారు. మరి ఇప్పుడో రిబ్బన్ కత్తిరించాలన్నా కోట్లు కావాలంటున్నారు" అని నటీమణి నీనాగుప్తా విమర్శించారు. హైదరాబాదులో రోజూ ఏదో ఒక ఉత్పత్తి విడుదలకో లేక ప్రారంభోత్సవానికో సెలబ్రెటీలు రావడం చూస్తూనే వున్నాం. వీటి వెనక కోట్ల గలగలలు పైకి కనిపించవు కాని పచ్చి నిజాలు. నీనా గుప్తా కూడా సెలబ్రెటీనే అయినప్పటికీ తన ప్రేమ వ్యవహారాన్ని బయటకు రాకుండా ఏళ్ల తరబడి కాపాడుకోగలిగింది. "ఇలాంటి కథనాలు బయటపెట్టడం వల్ల సదరు విలేకరికి లేదా సంస్థకు పేరు రావచ్చు. మరో వైపున ఆ సెలబ్రెటీకి కూడా ప్రచారం లభిస్తుంది" అని ఆమె అన్నారు.

వాస్తవానికి ఈ విధమైన ప్రలోభాలే సెలబ్రెటీలనూ ప్రభావితం చేస్తుంటాయి. మీడియాలో మంచికో చెడ్డకో ప్రచారం లభించడం, భారీ నజరానాలు రావడం వారిని కట్టిపడేస్తుంది. బ్రిటిష్ అమెరికన్ టేబులాయిడ్లు, సెలబ్రెటీ షోలు ఇందులో ముఖ్యమైనవి. కెమెరా లైట్లు, హడావుడి దాని వల్ల లభించే పేరు ప్రఖ్యాతులకు తోడు డబ్బు కూడా వస్తే లేనిదేముంది? "సెలబ్రెటీలు తమ వ్యక్తిగత విషయాలను సొమ్ము చేసుకోదలిస్తే అందులో తప్పేమిటి? పైగా ఆ డబ్బును ఏదైనా మంచిపనికి వినియోగిస్తారు కదా అని ప్రశ్నించారు ఇలాటి వేడుకలలో ఆరితేరిన సోషలైట్ కీనీ దోడీ. అయితే ఈ మానవ సేవ ఎంత వరకూ నిజమనేది కూడా సందేహమే. ఎందుకంటే నిజంగా సేవా ధర్మంతో ఏర్పడిన సంస్థలు కొన్నయితే కేవలం పన్ను మినహాయింపుల కోసం పుట్టినవి చాలా వుంటాయి. పైగా ఈ క్రమంలో సెలబ్రెటీలకూ సమస్యలు వస్తాయి. మొదట్లో బాగున్నప్పటికీ రాను రాను అవి తమ వ్యక్తిగత స్వేచ్ఛకు ఆటంకమని వారు ఫిర్యాదు చేయడం మొదలెడతారు. కాని ఒకసారి ప్రచారపు సాలెగూడులో చిక్కిన తర్వాత వారు కూడా బయటపడటం తేలిక కాదు. ఇందుకు దారుణమైన ఉదాహరణ బ్రిటిష్ యువరాణి డయానా కథే. ఛార్లెస్ యువరాజుతో 1981లో జరిగిన ఆమె వివాహం భూలోక వైభవంగా అంతులేని ప్రచారం పొందింది. బ్రిటిష్ టేబులాయిడ్లు దాని గురించి కథలు రాశాయి. అందంతో పాటు చొరవ కలివిడి వున్న డయానా చుట్టూ కెమెరాలు ప్రదిక్షణలు చేశాయి. ఆమె ప్రతి కదలికనూ కథలుగా రాశాయి. మొదట్లో ఆమె దీన్ని ఆస్వాదిస్తున్నట్టే కనిపించింది. పైగా ఆ ఆకర్షణను నిధుల కింద మార్చి సేవా కార్యక్రమాలకు వెచ్చించే ప్రయత్నం చేసింది. మందుపాతరల వల్ల లేదా ఎయిడ్స్ వ్యాధి వల్ల బాధితులైన అభాగ్య బాలలకు దానితో సహాయం అందించేందుకు ప్రయత్నించింది. కాని ఇది శ్రుతి మించి పోతున్నట్లు అనతి కాలంలోనే అర్థం చేసుకుంది. తన అందచందాలను అంగాంగ చిత్రాలను అమ్ముకోవడానికి పోటీ పడుతున్న తీరుకు ఆగ్రహించింది. రాజకుటుంబం పటాటోపాల వల్ల ఛార్లెస్ విశ్వాసరాహిత్యం వల్ల వివాహం విచ్ఛిన్నమై పోతున్నకొద్దీ ఆమెపై కెమెరాల వేట కూడా తీవ్రమైంది. ఈత దుస్తుల్లో ఆమెను రహస్యంగా ఫోటోలు తీసే నీచానికి చవకబారు పత్రికలు దిగజారడం ఆమెకు మాత్రమే కాక మొత్తం పత్రికా ప్రపంచానికి ఆగ్రహం తెప్పించింది. మీరు నానాకష్టాలు పడి సంపాదించే మొత్తం నేను డయానా తొడ ఫోటోతోనే సంపాదిస్తానని ఒక ఫోటో గ్రాఫర్ ప్రగల్భాలు పలికాడంటే పరిస్థితి ఎంత నీచంగా వున్నదీ అర్థమవుతుంది. ఈ ఒత్తిడి డయానానూ దారి తప్పించింది. ఆ తర్వాత ఆమె వివాహేతర సంబంధాలపై కథలు కథల వెల్లువ మీడియాను ముంచెత్తింది. పారిస్‌లో ఆమె తన సన్నిహిత



కోటీశ్వరుడైన దోడీతో ప్రయాణిస్తుండగా పసిగట్టిన మీడియా వెంటాడింది. ఆ పరుగుల్లో ఆమె కారు పారిస్ టన్నెల్‌లో ఘోర ప్రమాదానికి గురై వారిద్దరూ ప్రాణాలు విడిచారు. ఆమె చనిపోయిన తర్వాత కూడా ప్రత్యేకమైన ఫోటోలు సంపాదించాలని పోటీ పడ్డారు. ఈ సందర్భంలోనే పేపరాజ్జి అనబడే మాట ప్రపంచానికి తెలియవచ్చింది. సెలబ్రెటీల రహస్య ఫోటోలతో కోట్లు రాబట్టే ఈ క్షుద్ర ప్రక్రియను అందరూ అసహ్యించుకున్నారు. అయితే డయానా మరణం తర్వాత కూడా ఈ పద్ధతి మారింది లేదు. ఆమెతో నాకు సంబంధం వుండేదని ఎవరో బట్లర్ రాసిన పుస్తకంపై ఎడతెగని చర్చ. నాగరికత గురించి అదే పనిగా మాట్లాడే బ్రిటిష్ వ్యవస్థ మేడిపండు స్వభావాన్ని వెల్లడించింది. డయానా పదవ వర్ధంతి సందర్భంలోనే చార్లెస్ తన చిరకాల నెచ్చెలి కెమెల్లాను పెళ్లి చేసుకుంటే అదో అమర ప్రేమగా ప్రచారం పొందింది. ఆయితే మరో వైపున అప్పుడే బ్రిటిష్ టేబులాయిడ్ల సంపాదకుల సంఘం డయానా విషయంలో తాము అనుచితంగానే గాక అతి క్రూరంగా ప్రవర్తించినట్టు అంగీకరించి క్షమాపణలు చెప్పింది. సెలబ్రటీ వేలం వెర్రి విషమ ఫలితాలిలా వుంటాయి.

అయితే మార్కెట్ వ్యవస్థలో దీనంతటి వెనక మార్కెట్ మహత్యాన్ని చూడకపోతే జనం మోసపోతారు. ఈ వ్యవస్థలో ప్రతిదీ వ్యాపార సరుకే. వ్యాపారికి కూల్‌డ్రింకులైనా, విస్కీసీసాలైనా, నాప్కిన్స్ అయినా, మోటారు సైకిళ్లయినా, ఐస్ క్రీమ్ అయినా, ఫేస్ క్రీం అయినా పెద్ద తేడా వుండదు. ఏదో విధంగా వాటిని ప్రజల్లో ప్రవేశపెట్టి సాధ్యమైనంత ఎక్కువ ధరకు ఎక్కువ మోతాదులో అమ్ముకోవడమే వారి ఏకైక లక్ష్యం. దానికి బ్రాండ్ అంబాసిడర్‌లు అంటే సరుకుల రాయబారులు సెలబ్రెటీలు. ఆపైన అశ్లీల, అవాంఛనీయ అభిరుచులు వుండనే వుంటాయి. వీటన్నిటి ద్వారా పాఠకుల వీక్షకుల సంఖ్యను పెంచుకోవడమే కాక వారిలో మరో వైపు చూసే చైతన్యం లేకుండా చేయడం దీనంతటి పరమార్థం. అందువల్లనే సెలబ్రటీలకు అంత రేటు పలుకుతుంది.

❋

సెప్టెంబర్ 8 - మూడు ప్రాధాన్యాలు

తెలుసుకుందామా...

శైలి

అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం దేశదేశాల్లో అక్షరాస్యతా శాతం పెంచేందుకు ఐక్యరాజ్యసమితి సెప్టెంబర్ 8ని అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవంగా ప్రకటించింది. అక్షరాస్యతతోనే మానవాళి ప్రగతి ఆధారపడి ఉన్నదనేది కాదనలేని సత్యం. అందుకే మహాత్మాగాంధీ "నిరక్షరాస్యత మన దేశానికి పట్టిన అతిపెద్ద కళంకం - దీనిని విధిగా నిర్మూలించి తీరాలి" అని వక్కాణించాడు.

1990 సంవత్సరం నుండి మనదేశంలోను, రాష్ట్రంలోనూ సాక్షరతా ఉద్యమం ఓ అత్యవసర అంశంగా మొగ్గతొడిగింది. పిల్లల్లోనూ, పెద్దల్లోనూ అక్షరాస్యతను పెంచడం, విద్య ద్వారా వారి జీవన ప్రమాణాలు పెంచుకొనే సామర్థ్యాన్ని కలిగించడం, అందుకు అవసరమైన కనీస అవకాశాలు కల్పించడం ఈ ఉద్యమం యొక్క ప్రధాన లక్ష్యాలు.

స్థూలంగా చూస్తే ఇప్పటికే మన గ్రామాల్లో, పట్టణాల్లో బడిలో ఒక పిల్లవాడు ఉంటే, బడి బయట ఇద్దరు పిల్లలు ఉంటున్నారు. పేదరికం ఇతర కారణాల రీత్యా విద్యా, వికాసం లేకుండా ఆ పిల్లలు బాలకార్మికులుగానే జీవితం గడపాల్సిన దుస్థితి ఉన్నది. ఆడపిల్లలైతే ఇంకా ఎక్కువగా ఉంటున్నారు. మన భావిభారతం ఇలా ఎంతకాలం అవిద్య అంధకారంలో మగ్గాల్సిఉందనే ఆవేదన కలుగుతుంది.

కాగా చదువుకునే బాలలకే మధ్యాహ్న భోజనం, ఉచిత బోధన, పాఠ్యసామగ్రి, హాస్టల్ సౌకర్యం వంటి ప్రభుత్వ సహాయం లభిస్తుంది తప్ప చదువుకోని బాలలకు ఎలాంటి సహాయం లభించదు కదా. మరి ఇలాంటి సదుపాయాలు కూడా అందుకోలేనంత దూరంగా ఎన్నో తెగలు, జాతులవారు ఇప్పటికే ఉన్నారనే విషయం గమనించుకోవాలి.

ఇలాంటి నేపథ్యంలో సాక్షరత ఉద్యమ కార్యకర్తలు సమీక్షలు జరుపుకుని భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. మన ప్రాంతంలో అక్షరాస్యత శాతం పెరిగిందా? తరిగిందా? కారణాలు ఏమిటి? పెరిగితే ఏ మోతాదులో పెరిగింది? ఇంకా వేగంగా పెంచాలంటే ఏం చేయాలి? ఎవరి బాధ్యత ఎంత? ఎవరెవరు ఎలా తోడ్పడతారు? లక్ష్యాన్ని సాధించడానికి కాలపరిమితి ఎంత? ఈ విషయాలన్ని చర్చించుకోవడానికి సెప్టెంబర్ 8 ఒక ఆలంబనగా నిలుస్తున్నది.

ప్రజాకళల దినోత్సవం

డా॥గరికపాటి రాజారావు ఆంధ్ర ప్రజానాట్యమండలి వ్యవస్థాపక కార్యదర్శి. ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) సభలకు హాజరవడం, ఇక్కడి నుండి అనేక మంది కళాకారుల్ని అక్కడికి తీసుకెళ్లడం, అక్కడ పృధ్వీరాజ్ కపూర్, బలరాజ్ సహానీ, అబ్బాస్, అనీల్ డిజాల్స్, పి.సి.జోషి, హిరేన్ ముఖర్జీ వంటి వామపక్ష అభ్యుదయ భావాలు కలిగిన కళా దిగ్గజాలు, మేధావుల్ని కలుసుకోవడం, ఆ స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు నాటక రంగాన్ని జానపద కళల్ని కొత్త పుంతలు తొక్కించడంలో ఆయనది అద్వితీయ పాత్ర. ఒక్కమాటలో చెప్పాలంటే తెలుగునాట ప్రజాకళలను ఉద్యమంలా నడిపించడానికి డా॥రాజారావు చేసిన అపార పరిశ్రమ అనుపమానమైనదని అందరూ ఒప్పుకుంటారు. అలాగే తెలుగు నాటకరంగంలో దర్శకుని పాత్ర పెంచడంలోనూ, నటనలో నిత్యవిద్యార్థిలా ఎప్పటికప్పుడు నూతన శైలి సృష్టించి ప్రేక్షకుల అభిమానం చూరగొనడమే కాదు వర్గ స్పృహను రేకెత్తించడంలో ఆయనది అందెవేసిన చేయి. అందుకే ప్రజాకళాతపస్విగా డా॥గరికపాటి రాజారావు గణతికెక్కాడు.

1963 సెప్టెంబర్ 8న తన 49వ ఏట డా॥రాజారావు అస్వస్థతతో కన్నుమూశాడు. అప్పటినుండి ప్రతి ఏడాది సెప్టెంబర్ 8 ఆయన వర్ధంతిని ప్రజాకళాదినోత్సవంగా పాటించాలని ప్రజాకళాకారులు భావించారు.

సభలు సమావేశాలు పెట్టి ఆయనకు నివాళులు ఘటించడమే కాకుండా ప్రజాకళలను ఎలా ముందుకు నడిపించాలో సమీక్షించుకుంటారు. సమకాలీన సామాజిక, రాజకీయ, ఆర్థిక సమస్యలను కళారూపాలలో ఇమిడ్చి ప్రజలను నిత్యం జాగృతులను గావించడం ప్రజాకళాకారుల విధి. అలాగే మానవ సంబంధాలను ఉద్దీపన చేయడం, మనిషిలోని మానవీయ కోణాన్ని సృజించటం, ప్రజా ఉద్యమాలకు కళారూపాలతో ఉత్తేజం ఇవ్వడం, కళాకారుల బాధ్యత. ఈ కృషిలో డా॥రాజారావు అగ్రభాగాన నిలిచారు కాబట్టే ఆయన కృషిని స్మరించుకుంటూ ఆయన అడుగుజాడల్లో నడవటానికి ప్రజాకళాకారులు ప్రయత్నిస్తారు.

వృత్తిదారుల దీక్షాదినం

అది 2000 సంవత్సరం. అప్పటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రజానీకంపై అసాధారణ రీతిలో విద్యుత్ చార్జీల భారాన్ని మోపింది. ప్రపంచ బ్యాంకు షరతులకు అనుగుణంగానే ఈ దారుణం జరిగింది. దీనిని నిరసిస్తూ పల్లెనుండి రాజధాని వరకు ఉద్యమం చెలరేగింది. అందుకు పరాకాష్ట జులై 28న ఛలో అసెంబ్లీ కార్యక్రమం. బషీర్‌బాగ్‌లో విచక్షణా రహితంగా లాఠీచార్జీ, నీటి ఫిరంగులు, గుర్రాలతో తొక్కించటం, బాష్పవాయుగోళాలు పేల్చడం, చివరకు కాల్పులు జరపడం - అన్నీ పచ్చి నియంతృత్వ పద్ధతిలో సాగాయి. ఈ పోరాటంలో ప్రజల పక్షాన వామ పక్షాలు అగ్రభాగాన నిలిచాయని వేరుగా చెప్పక్కర్లేదు. విష్ణువర్ధన రెడ్డి, బాలస్వామిలు అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. క్షతగాత్రుడైన సత్తెనపల్లి రామకృష్ణ అపస్మారక స్థితికి వెళ్లి సెప్టెంబర్ 8న కన్ను మూశాడు.

రామకృష్ణ అందరిలాంటి సామాన్య వ్యక్తి కాదు. అట్టడుగు ప్రజల హక్కుల సాధన కోసం జీవితాన్ని అంకితం చేయాలనే దృఢ సంకల్పంతో ముందుకొచ్చిన కార్యకర్త. ఆ క్రమంలో ఖమ్మం నుండి హైద్రాబాద్‌కు వచ్చి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్రకన్వీనర్‌గా, చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ నాయకునిగా బాధ్యతలు స్వీకరించాడు. ఈ విద్యుత్ పోరాటంలో ముందుపీఠిన నిలబడి ప్రాణాలు అర్పించిన ధీరుడు. అప్పటి నుండి రామకృష్ణ మార్గంలో వృత్తిదారుల ఉద్యమాన్ని ముందుకు నిడిపించాలనే స్ఫూర్తి ఉద్యమకారులకు లభించింది.

ఇటీవల ఆవిర్భవించిన చిరంజీవి 'ప్రజారాజ్యం'. పార్టీ ప్రధానలక్ష్యం కూడా 'సామాజిక న్యాయం'. సమకాలీన సామాజిక రాజకీయ పరిణామాల్లో సామాజిక న్యాయం అనేది కేవలం ఆదర్శమైన నినాదమే కాదు. ఆచరణీయమైన విధానం కూడా. ఈ లక్ష్యాన్ని సాధించాలనుకునేవారికి రామకృష్ణ జీవితం నిలువుటద్దంలా ముందుకు నిలుస్తుంది. కాబట్టి రామకృష్ణ వర్ధంతి ప్రతిఏటా వృత్తిదారుల దీక్షా దినంగా పాటించబడుతూ సామాజిక ఉద్యమ కార్యకర్తలను మునుముందుకు నడిపిస్తుందనటంలో ఎంటువంటి సందేహం అక్కర్లేదు.

తొక్కుడు లడ్డు

కావలసిన పదార్థాలు

శనగపిండి- 1 కప్పు, పంచదార- 1/14 కప్పు, ఏలకులు- 5,6, నెయ్యి - 2 టీ స్పూన్లు, నూనె - తగినంత

తయారు చేసే విధానం

శనగపిండిలో నీళ్లుకలిపి జంతికల పిండిలా తయారు చేసుకోవాలి. కడాయిలో నూనె పోసి కాగిన తర్వాత సన్నటి సెగమీద జంతికలు వేయించాలి. జంతికలు చల్లారిన తరువాత మిక్సీలో వేసి మెత్తగా గ్రయిండ్ చేయాలి. గ్రయిండ్ చేసిన జంతికల పొడిని ఒక గిన్నెలోకి తీసుకోవాలి. జంతికలతో పాటు ఏలకులు కూడా వేసి గ్రయిండ్ చేసుకోవచ్చు. 1 1/4 కప్పు పంచదారకు 1/2 కప్పు నీళ్లు కలిపి తీగపాకం వచ్చే వరకు స్టౌ మీద ఉంచి గరిటతో కలుపుతూ ఉండాలి. ఆ తరువాత గ్రయిండ్ చేసిన జంతికల పొడి వేసి పాకంలో కలిపి స్టౌవ్ మీద ఉంచాలి. చల్లారిన తరువాత ఆ ముద్దను మిక్సీలో వేసి గ్రయిండ్ చేయాలి. గ్రయిండ్ చేసిన తరువాత మెత్తగా ఉన్న ముద్దను చేతికి నెయ్యి రాసుకొని రౌండుగా లడ్డూల్లా చేసుకోవాలి. బాగా ఆరే వరకు లడ్డూలు డబ్బాలో వెయ్యకూడదు. ఈ లడ్డూలు వారం రోజులు నిలువ వుంటాయి. తినటానికి రుచిగా ఉంటాయి. మెత్తగా ఉండటంతో పిల్లలు, పెద్దలు అందరూ ఇష్టపడతారు.



గోధుమ హల్వా

కావలసిన పదార్థాలు

గోధుమపిండి - 1కప్పు, పంచదార 1 కప్పు, నెయ్యి - 50 గ్రాములు, యాలకులు-10, బాదంపప్పు- కొంచెం, మిఠాయి రంగు- కొంచెం, కిస్‌మిస్-50 గ్రాములు, చారపప్పు- కొంచెం

తయారు చేసే విధానం

కిస్‌మిస్, జీడిపప్పు, చారపప్పు వేరు వేరుగా వేయించుకొని బాదంపప్పులు నీటిలో నానవేస్తే తొక్క వూడి వస్తుంది. వీటిని సన్నగా తరుక్కోవాలి. యాలకులు పొడుం చేసుకొని వుంచుకోవాలి. జల్లించిన గోధుమ పిండిలో నీళ్ళు కలిపి కొంచెం పలచగా చేసుకోవాలి. ఒక పాత్రలో పంచదార, నీళ్ళు పోసి పాకం వచ్చే వరకూ కలియబెట్టాలి. అందులో పలుచని గోధుమపిండిని నెమ్మదిగా పోస్తూ కలియబెడుతూ వుండాలి. అందులో జీడిపప్పు, కిస్‌మిస్, బాదంపప్పు, మిఠాయిరంగు, చారపప్పు వేస్తూ బాగా కలియబెట్టాలి. కిందికి దింపే ముందు యాలకులపొడి వెయ్యాలి. కొద్దిగా నెయ్యి కూడా వెయ్యవచ్చు. వెడల్పయిన పళ్ళెం తీసుకొని దానికి బాగా నెయ్యి పట్టించాలి. ఈ పళ్ళెంలోకి హల్వాని దిమ్మెర పోసి గాలికి ఆరనివ్వాలి. ఆరిన తర్వాత బాగా పేరుకుంటుంది. దీనిని ముక్కలుగా కోసి తినవచ్చు. హల్వాని మైదాపిండితో కూడా చెయ్యవచ్చు. గోధుమపిండికి బదులు మైదాపిండిని ఉపయోగించాలి అంతే తేడా.

సేమ్యా కేసరి

కావలసిన పదార్థాలు

సేమ్యా - పావుకిలో, పంచదార- పావుకిలో, జీడిపప్పు- 10 గ్రాములు, కిస్మిస్- 10 గ్రాములు, ఏలకులు- కొంచెం, పచ్చ కర్పూరం- కొంచెం, కుంకుమ పువ్వు-కొంచెం, నెయ్యి- పావుకిలో

తయారుచేసే విధానం

సేమ్యా, జీడిపపప్పు, కిస్‌మిస్, దేనికది వేరు వేరుగా వేయించి వుంచుకోవాలి. ఒక పాత్ర తీసుకొని సేమ్యా కొలత పరిమాణంలో నీళ్ళు పొయ్యాలి. నీళ్ళు బాగా మరిగిన తర్వాత సేమ్యా తర్వాత పంచదార వేసి కలియబెట్టాలి. బాగా వుడికిన తర్వాత జీడిపప్పు, కిస్‌మిస్, కుంకుమపువ్వ, నెయ్యి వేసి బాగా కలియబెట్టాలి. చేతికి అంటుకోకపోతే బాగా వుడికినట్టు అర్థం. దింపేముందు యాలకులపొడి జల్లాలి. మూతపెట్టి దింపితే మంచి సువాసన వస్తుంది.



పులిహోర

కావలసిన పదార్థాలు

బియ్యం- పావుకిలో, సెనగపప్పు- 1 కప్పు, నిమ్మకాయలు-6 పసుపు- కొంచెం, ఉప్పు- తగినంత, నూనె- పావుకిలో, ఎండు మిరపకాయలు- 10, కరివేపాకు- కొంచెం, ఆవాలు- 1 టీ స్పూన్

తయారుచేసే విధానం

బియ్యాన్ని బాగా కడిగి అన్నం వంచాలి. అన్నాన్ని ఒక పళ్ళెంలో బోర్లించి వేడిగా వుండగానే కొంచెం నూనె, నిమ్మరసం, కొద్దిగా కరివేపాకు, పసుపు, ఉప్పు బాగా కలిసేటట్లు కలిపాలి. సెగపప్పు నానబెట్టి వుంచుకోవాలి. ఒక మూకుడులో నూనె పోసి అందులో మిరపకాయలు, సెనగ పప్పు, ఆవాలు, కరివేపాకు బాగా వేయించి అన్నంలోకి కలపాలి. అవసరమైనవారు పచ్చిమిరపకాయలు కూడా తాలింపులో వేసుకోవచ్చు.

కథ

వై.కుసుమకుమారి

"కమలమ్మా నాపరిస్థితి మీకు తెలుసు. రెక్కాడితేగాని డొక్కాడదు. మరి డాక్టర్లు గొంతెమ్మ కోరికలు తీర్చలేను.ఆళ్లకు డబ్బు ఇవ్వకపోతే తుప్పుపట్టిన కత్తులతో కోస్తారు. సెప్టిక్ అయిచచ్చిపోవాలని, కావాలని చేస్తారు. అచచ్చిందేదో ఇక్కడ చావనిద్దాం.నాబొందిలో ప్రాణం ఉండగా నేను సర్కార్ ఆసుపత్రికి తీసుకుపోను.మీరు వెళ్లిపోండి.అప్పుడు మీకు ఇస్తానన్న డబ్బు ఐదొందలు తీసుకోండి" అని జేబులోంచి తీసి ఇచ్చాడు.

పండుటాకు

"మంత్రసాని కమలమ్మ అంటే నీకు తెలియకపోవడం విచిత్రమే. ఆమె పురుడుపోయని ఇల్లు లేదు. ఆమె చేయి మంచిది. నెమ్మదైన మనిషి. ఎలాంటి డిమాండులు ఉండవు. మనం ఎంతిస్తే అంత తీసుకుంటుంది. ఒకసారి అఫిషియల్ కాలనీకి వెళ్లి అక్కడ అడుగు ఎవరైనా చెబుతారు" చెప్పాడు ఓకార్మికుడు.

తల పంకించాడు శేషు. "నీలాగునే నాకు చాలామంది చెప్పారు. ఆమెకు వయస్సు అయిపోయింది.ఆమెకు కన్పించదు విన్పించదు అలాంటి వయస్సు కదా ఎందుకోభయంగా ఉంది."

"నామనవరాలికి పురుడుపోసింది. పండంటి బిడ్డ పుట్టింది. ముందు ఆమెను కలువు. అసలు ఇప్పుడు స్కానింగ్ల్లో ఆడపిల్లో మగపిల్లాడో ముందే తెలిసిపోతుంది. అదే కమలమ్మ అనుకో! కడుపు తీరు చూసి కడుపులో ఉన్నది ఆడోమగో చెప్పేస్తుంది. అంత అనుభవశాలి. భయపడకుండా వెళ్లి రిక్షా కట్టించుకుని ఇంటికి తీసుకునివచ్చేయ్"

ఆ మాటలకు శేషు వెంటనే సైకిల్ మీద కాలనీకి వెళ్లాడు. కమలమ్మ పేరు చెప్పిన మరుక్షణం ఆ ఇల్లు ఎగబడి చూపారు అక్కడ జనాలు. ఆమె అక్కడ మదర్ థెరిసాలా పేరుపడింది. ఆమె సాయం పొందని వాళ్లు లేరంటే అతిశయోక్తి అని అక్కడ జనాలు చెప్పిన ఒకటి రెండు మాటల్లో తెలుసుకున్నాడు.

పాతపెంకుటిల్లులో కిటికి వద్ద కూర్చుని ఆ వెలుగులో ఏదో పుస్తకం చదువుకుంటోంది పండుటాకులా ఉన్న కమలమ్మ.

"అమ్మా నమస్తే" అని ఆమె ముందు నిలబడ్డాడు శేషు.

"ఎవరు నువ్వు? ఏపనిపడి వచ్చావు. కాళ్ళు చేతులు విరిగిన కేసులు ఇప్పుడు నేను చూడడంలేదు. నాకు శక్తి ఉడికింది. నేను వెదురు బద్దలు వేసి కట్లు కడతాను. దానికి ఒకరకమైన శక్తి చేతుల్లో ఉండాలి. ఉదయం నుంచి ఇప్పటికి నీలాగున నలుగురైదుగురు వచ్చారు. ఎందుకు తన్నుకు చావడం. ఇలా కాళ్లచేతులు విరుచుకోవడం" నసిగింది.

"నేను అందుకు రాలేదమ్మా. నాభార్యకు నెలలు నిండాయి. సర్కార్ ఆసుపత్రి అంటే భయం. నా తొలి భార్యను చంపేశారు. మీరు ఇలాంటివి బాగా చేస్తారని తెలిసి వచ్చాను. నాకు రోజువారి జీతం తప్పితే ఇతరత్రా ఆదాయం ఉండదు. నాభార్య ప్రసవం కోసం ఐదొందలు రూపాయిలు దాచాను. అది మీకు ఇస్తాను. నాభార్యను నాబిడ్డను నాకు క్షేమంగా అప్పగించాలి" అని కోరాడు.

తెరతెరలుగా నవ్వింది. ఆమె నవ్వు భలేగా ఉందనిపించింది.

"అమ్మా! చాలదంటే నాతో పనిచేసే కార్మికుడు ఒకడు అప్పుగా ఇస్తామన్నాడు మరికొంత కలిపి ఇస్తాను"

ఈసారి మరింతగా నవ్వింది "ఏరా బాబు నీవు వచ్చినపని ఏమిటి నాకు అప్పుడే ఇంతిస్తాను అంతిస్తాను అంటున్నావు. నేను నీభార్యను చూడాలి. నెలలు నిండాయి అని నువ్వు చెబుతున్నావు. నువ్వు కుర్రాడివి ఆపిల్లదేమో నీకంటే చిన్నది.మీరు అనుకుంటే నెలలు నిండవు. ఇంట్లో పెద్దదిక్కు లేదా?" శేషు ముఖంలోకి చూస్తూ అడిగింది.

"నాకు ఎవరూ లేరమ్మా. చిన్నతనంలో నాన్న రోగమొచ్చి ఆసుపత్రిలో చచ్చిపోయాడు. నా తొలి పెళ్లికి ముందే నాతల్లికి పక్షవాతం సోకి ఆసుపత్రిలో చచ్చిపోయింది. తొలి భార్య కూడా బిడ్డను కనడానికి ఆసుపత్రిలో వేశాను. దానికడుపులో బిడ్డ చచ్చిపోయింది. డాక్టర్లు చాలా ప్రమాదం అని చెప్పి ఆపరేషన్ చేసి తీయాలన్నారు.అందుకు వెయ్యిరూపాయిలు కావాలి అని అన్నారు. నేను ఈ ఊరికి కొత్త. నైట్ రిక్షా వేసేవాడిని. నాఆదాయం అంతంతమాత్రమే.తెచ్చి ఇస్తానని చెప్పాను. నువ్వు డబ్బు తీసుకుని ఇచ్చిన మరుక్షణం ఆపరేషన్ అవుద్ది అనిఅన్నారు. రిక్షా ఇచ్చే యజమానికి అడిగాను.అతడు 'ఇలా మరోసారి అప్పు అని వస్తే రాత్రి వేరేవారికి రిక్షా ఇస్తాను' అని పొమ్మన్నాడు. రోజున్నర తిరిగాను. అప్పు పుట్టలేదు. నాభార్య కడుపు ఉబ్బిపోయింది. డాక్టర్లు పట్టించుకోలేదు. ఇక్కడ ఆక్సిజన్లేదు. పెద్దాసుపత్రికి తీసుకుపో అన్నారు. కారు కట్టించి పట్టుకెళ్లడానికి నాదగ్గర డబ్బుల్లేవు. వెంటనే రిక్షా ఓనర్ను బ్రతిమాలి ఆ రిక్షా తెచ్చి అందులో నా భార్యను వేసుకుని పదిహేను కి॥మీ॥దూరం తొక్కుకుని వెళ్లాను. తీరా అక్కడికి చేరాక, నాభార్య కళ్లు తేలేసింది. అక్కడ ఎంతబ్రతిమాలినా వాళ్లు బెడ్లు ఖాళీగా లేవనిచెప్పి వరండాలో పడేశారు. కడుపులో ఉమ్మినీటిలో చచ్చినతుట్ట (బిడ్డ) ఉబ్బింది. కాలయాపనచేసి ప్రాణాలు తీశావుకదరా అని తిట్టి పోశారు. చూస్తుండగా నాభార్య చచ్చిపోయింది" చెప్పి కుళ్లికుళ్లి ఏడ్చాడు.

కమలమ్మకు గుండె కలుక్కుమంది.దగ్గరగా వచ్చి ఓదార్చింది.

కళ్లు తుడుచుకున్నాడు."ఇక పెళ్లి చేసుకోకూడదు అని అనుకున్నాను. రాత్రిళ్లు రిక్షా వేయడం మానుకుని బ్రతకడానికి మరో పని వెతుక్కున్నాను. జూట్మిల్లులో రోజుకు 70రూపాయల పని దొరికింది. అక్కడే పరిచయం అయిన కార్మికులలో ఒకడు నన్నుచూసి జాలిపడ్డాడు.ఒకసారి ఆడింటికి తీసుకుని వెళ్లి అక్కడ ఒకఅమ్మాయిని చూపించి నీలాగునే తల్లితండ్రి లేనిపిల్ల.చేసుకో నీకు వండిపెడుతుంది అని చెప్పాడు. చేసుకున్నాను దానికున్న ఆస్థి ఒక పూరిగుడిశె. అందులో నేనుంటున్నాను"

"సరేలే. మంచి పనిచేశావు. నీకు పెళ్లాం అంటే చాలా ఇష్టంలా ఉంది.నేనున్నానుగా! నీఅడ్రసు ఇచ్చిపో! నేను సాయింత్రం కూరగాయలు కొనడానికి వస్తాను.అప్పుడు నీఇంటికి వస్తాను."

అడ్రసు చెప్పాడు. విన్న కమలమ్మ భృకుటి ముడిచింది.

"ఈరన్న కూతురు నీపెళ్లాం అన్నమాట.అతడు కష్టపడి తెచ్చిన దంతా తాగడానికే సరిపెట్టేవాడు. తాగుడే అతడి ప్రాణాలు తీసింది. ఆ ఇల్లు నాకు తెలుసు నేను వస్తాను. నీఅత్తకు పురుళ్లు నేనే పోసేదాన్ని."

❖ ❖ ❖

కమలమ్మ రిక్షాదిగి పూరిగుడిశెలోకి వెళ్లింది.నిండుచూలాలు వెంకాయమ్మ బియ్యంలో రాళ్లు ఏరుతూ కన్పించింది.కమలమ్మతో బాటు చుట్టుపక్కల అమ్మలక్కలు వచ్చి కమలమ్మకు దండాలు పెడుతున్నారు. "అమ్మా! చాన్నాళ్లకు మావీధి వచ్చావు. నీచేతులమీద పుట్టిన మాపిల్లకాయలు ఇదిగో ఇంతేసి అయిపోయారు" అని వారిని చూపించారు.

వెంకాయమ్మను చూసి వివరాలు అడిగి తెలుసుకుంది. నులక మంచంమీద పడుకోబెట్టి కడుపు తడిమి చూసింది.నీకు ఇరవై రోజులు టైముంది అని చెప్పి ఏవో కొన్ని మందులు రాసిచ్చి నాకు ఇవ్వడానికి దాచిన డబ్బులోంచి నీభర్తకు ఇవి కొనమని చెప్పు. నీవు క్రమం తప్పకుండా మందులు వాడు" చెప్పి రిక్షా ఎక్కి వెళ్లిపోయింది.

చుట్టూ చేరిన అమ్మలక్కలు వెంకాయమ్మకు వారికి తెలిసిన చిట్కాలు చెప్పారు. వెళ్లిపోయే ముందు "నీ మొగుడు మంచి పనిచేశాడు. కమలమ్మ చేయి చాలా మంచిది. నీకు సుఖప్రసవం అవుద్ది. ఆమెకు డబ్బు యావ ఉండదు. ఇప్పుడైతే ఆమె ఒక్కతే. డబ్బు ఏం చేసుకుంటుంది? అందుకే ఎంతిస్తే అంత తీసుకుంటుందనుకోవడానికి లేదు. మాచిన్నతనంలో ఆమె ఏపనిపాటలేని భర్తా నలుగురు పిల్లలుండేవారు.ఈమె సంపాదనతో ఇల్లు నడిచేది.అప్పుడు కూడా ఎవరు ఎంతిస్తే అంతే తీసుకునేది. మనలాంటి పేదారోద ఇవ్వలేమంటే సరేనని వెళ్లిపోయేది. ఆమె విధానంకు ఆమె కన్నబిడ్డలు పెద్దయ్యాక వ్యతిరేకించారు. పురిటి కేసుకు ఇంత అని తీసుకోమని లేకుంటే ఒప్పుకోం" అని ఆమెను బలవంతం చేశారు. ఆమె అందుకు ఒప్పుకోలేదు. దాంతో ఇలాయితే మనం ఏమి సంపాదించుకోలేం అని ఆమెను ఒంటరినిచేసి ఎవరిదారివారు వెతుక్కుని పోయారు. ఆమె విధానాలతో అందరి తలలో నాలుకయ్యింది.

❖ ❖ ❖

నెలరోజులు గడిచాయి. ఒకరాత్రిమీద వెంకాయమ్మకు నొప్పులు వచ్చాయి.పక్కింటి బామ్మ వచ్చి 'నాయనా ఆమధ్య వచ్చిన కమలమ్మను తీసుకుని ఇక్కడున్నట్లే వచ్చేయాలి' అని చెప్పి పంపింది. రిక్షామీద తీసుకుని వచ్చాడు. కమలమ్మ కొంతసేపు వేచి చూశాక పెదవి విరిచింది. "నాయనా నీవు ఏది వద్దనుకున్నావో అదే జరిగింది. ఆసుపత్రికి వెళ్లక తప్పలేదు. బిడ్డ అడ్డం పడింది. ఆపరేషన్ అనివార్యం. ఇప్పటికే ఈపిల్ల నలిగిపోయినట్లు అయిపోయింది. ఇంకా నొప్పులు తీవ్రత ఉంటుంది. ఇక్కడే చూసుకుని ఉంటే కుదరదు. పద! ఆసుపత్రికి తీసుకుపోదాం. నేను డాక్టర్లుకు చెబుతాను."

ఆమాటలకు నేల పట్టుకుని కూర్చుండిపోయాడు. కళ్లలో నీళ్లు తిరిగాయి. నాకు నాకుటుంబానికి ఆసుపత్రి అచ్చిరాదు. దీన్ని సంపేస్తారు. తల బాదుకున్నాడు. కమలమ్మ అతడిని ఓదార్చింది.నువ్వు ఇలా డీలా పడిపోతే కనాల్సింది మరింత భయపడిపోతుంది.లే ముందు పదా నేనుంటాను.ఈమెకేం కాదు"

"కమలమ్మా నాపరిస్థితి మీకు తెలుసు. రెక్కాడితేగాని డొక్కాడదు. మరి డాక్టర్లు గొంతెమ్మ కోరికలు తీర్చలేను.అళ్లకు డబ్బు ఇవ్వకపోతే తుప్పుపట్టిన కత్తులతో కోస్తారు. సెప్టిక్ అయిచచ్చిపోవాలని, కావాలని చేస్తారు. అచచ్చిందేదో ఇక్కడ చావనిద్దాం.నాబొందిలో ప్రాణం ఉండగా నేను సర్కార్ ఆసుపత్రికి తీసుకుపోను.మీరు వెళ్లిపోండి.అప్పుడు మీకు ఇస్తానన్న డబ్బు ఐదొందలు తీసుకోండి" అని జేబులోంచి తీసి ఇచ్చాడు.

అప్పటికే చేరిన అమ్మలక్కలు బుగ్గలు నొక్కుకున్నారు.అందులో ఒకామె "ఎంతపని జరిగిపోయింది.పాపం ఈడి కుటుంబం మొత్తం ఆసుపత్రిల్లోనే చచ్చారు అందుకే బాగా భయపడిపోయాడు. ఎలా ఈగండం గట్టెక్కుతాడు. మనకాడ ఉన్నది ఎంతోకొంత సాయం చేసి ఆసుపత్రికి మనమంతా వెళ్లి కూర్చుంటే ఆసుపత్రిలో డాక్టర్లు జాగ్రత్తగా ఆపరేషన్ చేస్తారు.ఆపైన కమలమ్మ ఉండనే ఉంది"అని ఊసులు వేసుకున్నారు.

"మీసాయంతో నేను నాభార్యను తీసుకురాను" మొండికెత్తాడు. అప్పుడు కమలమ్మ శేషును చూసి నిట్టూర్చింది.

"సరే శేషు! నీవు అనుకున్నట్లే ప్రభుత్వ ఆసుపత్రికి పోవద్దు. పదా నాకు తెలిసిన ప్రయివేట్ ఆసుపత్రికి వెళ్దాం.నేను చెప్పి తక్కువలో అయ్యేట్టు చేస్తాను.ఎలాగూ వీళ్లంతా సాయం చేస్తామంటున్నారు" కొండంత ధైర్యం చెప్పి రిక్షాలో వెంకాయమ్మను ఎక్కించింది.

ప్రయివేట్ హాస్పిటల్లో ఈ ఆపరేషన్‌కు పదిహేను వేలరూపాయల పైమాటే అని అక్కడ తెలుసుకుని హతాశుడయ్యాడు. పదోపాతికో ఇస్తామన్న పదిపదిహేను మంది అమ్మలక్కలు అన్నాం కనుక ఇవ్వక తప్పదన్నట్లు అంతా కలిసి ఓ ఐదొందలు ఇచ్చారు.అందులో ఒకావిడ మాటలు పాదరసంలా పనిచేసాయి. 'ఈకూలి ఎదవకు పెళ్లాం పిచ్చి నషాళానికి అంటుకుంది.అదేదో మారాజు కూతురులా దానికి ఖరీదైన ఆసుపత్రిలో ప్రసవానికి సిద్దపడ్డాడంటే ఈదు గండరాతి గండడే. ఎలాబిల్లు చెల్లిస్తాడో చూద్దుం." అని అక్కడే ఉన్నారు.

ముందు చెల్లిస్తే ఆపరేషన్ అన్నట్లు అక్కడ వాతావరణం ఉంది.శేషు చేతులు ఎత్తేశాడు. ఎదురుగా నాలుగు చక్రాల స్ట్రెచర్‌మీదనే ఉంది వెంకాయమ్మ, నొప్పులతో విలవిలలాడిపోసాగింది.

కమలమ్మకు అక్కడ డాక్టర్లు తెలుసు. వారితో మాట్లాడి ఆపరేషన్ థియేటర్‌కు వెంకాయమ్మను పంపించే ఏర్పాట్లు చేసింది. మగబిడ్డను ఆపరేషన్ చేసి తీశారు. పదిరోజులు ఆసుపత్రిలో ఉండాలి అని ఒకనర్సు చెబుతుంటే శేషు నీళ్లునమిలాడు.అక్కడే పొంచున్న అమ్మలక్కలు మళ్లీ మూతులు కొరుకున్నారు."ఈ ఎదవ ఏబ్యాంకులోనో కన్నంవేస్తేగాని ఇక్కడ బిల్లులు చెల్లించలేడు. బిల్లు కట్టకపోతే పుట్టిన నలుసును అమ్ముకుని బిల్లుకు జమచేసుకుంటారు డాక్టర్లు"

పదిరోజులు మెరకవీధి ఆడాళ్ల రాకపోకలు ఎక్కువయ్యాయి. వచ్చినవారు పండో కాయో తెచ్చి ఇవ్వక తప్పలేదు. "అవునే ఎంకాయమ్మ శేషుగాడి ప్రాణంమీదకు తెచ్చావే. ఆడు ఎక్కడ్నించి తేగలడు పాతికవేలు రూపాయలు.మగపిల్లోడు పుట్టాడని మాటేగాని శేషు ఎలా ఈగండం గట్టెక్కు తాడు అని ప్రేమగా అంటునే ముఖంలోకి గుచ్చిగుచ్చి చూడసాగారు.

"ఆ కమలమ్మ తక్కువలో చేస్తానంది. వెయ్యిరూపాయలు సరిపోతుంది అని చెప్పింది.అధైర్యంతో నాపెనిమిటి డ్యూటీకి వెళ్లిపోయాడు" నీరసంగానే బదులిచ్చింది.

"కమలమ్మ చెప్పితే వందో రెండొందలు తగ్గిస్తారు కానీ ఇలా తలమొయ్య తగ్గించేయరు.ఆముసలిదాని చేతిలో నువ్వు ఛస్తే మరి దానికి ఇలా పురిటికేసులు రావని తెలివిగా మీకు ఇక్కడ పీకమొయ్య ఇరికించేసి చల్లగా జారుకుంది.ఈరోజే నీకు ఇక్కడ్నించి పంపేస్తారు. నిన్ను తీసుకు పోయేముందు మొత్తం బిల్ నీమొగుడు కట్టాలి. నీమొగుడు ఏమీకానట్లు ఫ్యాక్టరీకి పోయాడేంటి? ఏదైనా ఆడు గుండెలు తీసిన బంటు."

వెంకాయమ్మకు వారి మాటలలో నిజం కన్పించింది. కమలమ్మ చెబితే భారీగా తగ్గించరు. కొంపదీసి అలాంటి పరిస్థితి ఎదురయితే ఏం చేయాలి?" అని లోలోపల భయపడిపోసాగింది.

ఒక నర్సు వచ్చింది. "ఏమ్మా నీవు ఇవాళ డిశ్చార్జి అవుతున్నావు. నీకు ఫైనల్‌గా చెకప్‌లు అయ్యాయి.అన్నీ బావున్నాయని రిపోర్ట్సు వచ్చాయి. నిన్ను తీసుకుని వెళ్లడానికి వచ్చినవారు వీళ్లేనా?"

"ఏం ఎందుకని ?కొంపదీసి బిల్లు మొత్తం కట్టమంటావా ఏమిటి? అంతాకలిసి ఐదొందలు ఇచ్చాం.అదేమాబోటి వాళ్లకు ఎక్కువ. మేము ఇలాకాన్పులప్పుడు సర్కార్ దవాఖానాకుపోయి కనేవాళ్లం. చచ్చీచెడీ ఖాళీ ఉంటే బెడ్‌లు లేకుంటే దవాఖానా వరండాల్లో కనేవాళ్లం. మా వెంకాయమ్మ చిత్రాంగి. దానిమొగుడు సురభివాళ్లు వేసే డేరా నటుడు. ఇక్కడ దించిపోయిన ముసల్ది కమలమ్మ కార్యవాది" ఒకామె చకచకా వల్లించింది.

నర్సు ఓపిగ్గా విని "బిల్లుకోసం రాలేదు.పత్యం కోసం చెప్పాలి. మీమాటలు వింటుంటే పేషెంటుకు మేలుకోరినవాళ్లలా లేరు.మీలాంటి వారు పెడసరంగా చెబుతారనే కమలమ్మ స్వయంగా ఇరవైనాలుగు వేలు రూపాయలు కట్టింది.ఆమె కౌంటర్‌లో ఉంది"

ఆమాటలకు అక్కడ ఉన్న అమ్మలక్కలు చేష్టలుడిగిపోయారు.

అందులో ఒకామె "కమలమ్మ చెప్పినందున బాగా తగ్గించి ఒకవెయ్యి రూపాయిలకే ఆపరేషన్ చేసారంట" అడగనే అడిగింది.

"ఒక్క రూపాయి తగ్గించరు.కమలమ్మ చెప్పినందున ముందు బిల్లు కట్టకపోయినా ఆపరేషన్ చేశారు.అదే ఆమె మాటకు ఇచ్చిన విలువ.ఇలా ఇరుగుపొరుగున ఉండి చెడుకోరుకునే కన్నా కాస్తామంచి కోరుకోరాదు" అని ఒకచురక అంటించి వెళ్లిపోయిందా నర్సు.

✻

చిరస్మరణీయం...
చక్రపాణీయం...

తెర

తెలుగు సినిమా, సాహిత్యాల చరిత్రలో చక్రపాణిది ఒక ప్రత్యేకమైన స్థానం. కథకుడుగా అనువాదకుడుగా ప్రచురణకర్తగా పాత్రికేయుడుగా బాలసాహిత్య స్రష్టగా అద్భుత చలన చిత్రాల విజయసారథిగా చక్రపాణి ప్రజ్ఞాపాటవాల గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇది చక్రపాణి శత జయంతి సంవత్సరం.

1908 ఆగష్టు అయిదవ తేదీన గుంటూరు జిల్లా తెనాలిలో వ్యవసాయ కుటుంబంలో పుట్టిన ఆలూరి వెంకట సుబ్బారావు. స్వాతంత్ర్య పోరాటంలోనూ పాల్గొన్నాడు. 1932 ఉప్పు సత్యాగ్రహంలో జైలు జీవితం చవి చూశాడు.అదే ఏడాది మేనమామ కూతురు రంగమ్మతో పెళ్లి జరిగింది. స్కూల్ ఫైనల్‌తో చదువు మానేసినా హిందీ, బెంగాలీ తదితర అనేక భాషల్లో పట్టు సాధించాడు. దొరికిన పుస్తకమల్లా సేకరించి పెద్ద గ్రంథాలయం ఏర్పాటు చేసుకున్నాడు. బహుభాషా పరిజ్ఞానం వల్ల అనువాదాలపై దృష్టి పెట్టారు. వ్రజ నందన్ అనే హిందీ సాహిత్య ప్రముఖుని దగ్గర సహాయకునిగా వున్నప్పుడు ఆయన సూచనపై చక్రపాణిగా పేరు మార్చుకున్నాడు. ఆర్థిక స్తోమత లేకున్నా కేవలం ఆసక్తికొద్దీ 'సంచారి', 'విహారి' అనే పత్రికలు నడిపాడు. తెనాలిలో కొడవటిగంటి కుటుంబరావు 'యువ' పత్రికను ప్రారంభించి నడపలేక అవస్థ పడుతుండేవారు. ఆ పేరుతో ప్రచురణలు కూడా తేవడానికి తంటాలు పడుతుండేవారు. చక్రపాణి వాటిని నిలబెట్టడమే కాక తర్వాతి కాలంలో చిరస్మరణీయంగా తీర్చిదిద్దారు.

1934లో క్షయ వ్యాధి రావడంతో ఒక వూపిరితిత్తి తీసేశారు.అయినా ఆయన సాహిత్యాన్ని శ్వాసించడం మానలేదు. చిత్తూరు జిల్లా మదనపల్లిలోని ఆరోగ్యవరంలోనే అప్పుడు టిబి శానిటోరియం వుండేది.చక్రపాణి అక్కడ చికిత్స పొందుతున్నప్పుడే ఒక బెంగాలీతో పరిచయం కలిగింది. ఆయన ద్వారా బెంగాలీ భాష నేర్చుకున్నారు.తిరిగి తెనాలి రాగానే శరత్‌చంద్ర ఛటర్జీ (శరత్ బాబు) రచనల అనువాదం మొదలెట్టారు. దేవదాసు, బడదీది (బాటసారి) వంటి నవలల అనువాదం ఎంత ప్రభావం చూపిందంటే శరత్ బాబు తెలుగువాడనే అనుకోవడం మొదలెట్టారు. ఆ పేరు కూడా చాలామంది పిల్లలకు పెట్టుకున్నారు.ఆయన అనువాద కౌశలంలో దేవదాసు పాత్ర తెలుగునాట అజ రామరమై పోయింది! అలాగే మరికొన్ని కథలను కూడా చక్రపాణి అనువదించి ప్రచురించినప్పుడు పుచ్చలపల్లి సుందరయ్య వాటిపై సమీక్ష రాస్తూ ఎంతగానో అభినందించారు.ఇలాంటి కథలు తెలుగులోనూ రావాలని ఆకాంక్షించారు! మంచి అనువాదాలను చక్రపాణీయం అని జలసూత్రం రుక్మిణీ నాథ శాస్త్రి సరదగా రాశారు. అనువాదాలు చేయడమే కాక చక్రపాణి ఇతర రచయితల పుస్తకాలను అందంగా అచ్చువేయాలని కోరుకునే వారు.సనాతనులు సహించలేని సంచలన రచయిత చలం పుస్తకాలు 27 ఆయన ద్వారానే వెలువడ్డాయి.తర్వాతి కాలంలో సుప్రసిద్ధులుగా రాణించిన గోపీచంద్,పాల గుమ్మి పద్మరాజు,కొడవటిగంటి కుటుంబరావు వంటి వారి రచనలు కూడా ఆయనే ప్రచురించారు.

బిఎన్‌రామారావు, దర్శకుడు పి.పుల్లయ్య విజయవాడలో కార్యాలయం ప్రారంభించి సినిమా తీయాలనుకున్నారు. చక్రపాణిని రచయితగా చేసుకోవాలని వారి కోరిక. ఆయనతో వ్యక్తిగత పరిచయం లేకపోవడంతో కొడవటిగంటి సహాయం కోరారు. ఆయన 1939లో చక్రపాణిని వెంటపెట్టుకుని తెనాలి నుంచి బెజవాడ తీసుకెళ్లారు. కొల్హాపూర్‌లో ధర్మపత్ని తీశారు. అసాధారణమైన గ్రహణశక్తి గల చక్రపాణి ఆ సినిమా పూర్తయ్యేసరికి చిత్ర నిర్మాణంలోని ఆనుపానులన్నీ పట్టేశాడు.

పుస్తకాలను చక్కగా వేయాలని తపన పడే చక్రపాణి అందుకోసం మద్రాసు చేరాడు. ఆ సందర్భంగానే 1944లో ఆసియా లోనే గొప్పదిగా పేరు పొందిన బిఎన్‌కె ప్రెస్ యజమాని, విజయ వాహినీ అధినేత బి.నాగిరెడ్డితో పరిచయం ఏర్పడింది. మకాం మద్రాసుకు మార్చేశారు. నివాసం కూడా వారింట్లోనే. చక్రపాణి భార్య అనారోగ్యంతో మరణించడం వల్ల వారి పిల్లలను కూడా నాగిరెడ్డి దంపతులే చేరదీసి పెంచారు.బి.నాగిరెడ్డి, బి.ఎన్.రెడ్డిగా సుపరిచితులైన నాగిరెడ్డి సోదరులకు వాహినీ స్టూడియోలో వాటా వుండేది. ఆ పేరుతోనే బిఎన్ దర్శకత్వంలో సినిమాలు తీసేవారు. వారి కోరికపై చక్రపాణి 1944లో 'స్వర్గసీమ' అనే చిత్రానికి స్క్రిప్టు సమకూర్చారు. 'ఓహోహో పావురమా' అనే భానుమతి పాట అప్పట్లో చాలా పాపులర్. 'స్వర్గసీమ' ఘన విజయం సాధించడంతో చక్రపాణికి బాగా పేరొచ్చింది. అదే ఏడాది బిఎన్ సోదరులు బిఎన్ గుప్తా నడుపుతున్న 'ఆంధ్రజ్యోతి' పత్రికను కొనుగోలు చేసి దాని నిర్వహణ బాధ్యత చక్రపాణికి అప్పగించారు.

చందమామ రావే... . జాబిల్లి రావే..

చక్రపాణి జీవిత సాహిత్య ప్రస్థానంలో మరో మైలురాయి-సాటిలేని చందమామ! 1947లో తెలుగు తమిళ భాషల్లో ప్రారంభమైన 'చందమామ' బాలసాహిత్యాన్ని కొత్త మలుపు తిప్పింది. ఆరు వేల కాపీలతో అరణాల వెలతో రంగు రంగుల బొమ్మలతో వచ్చిన చందమామ పిల్లల పత్రిక అయినా యావత్ కుటుంబాలనూ కట్టిపడేసింది. పిల్లలతో పాటు పెద్దగా చదువు రాని పెద్దలను కూడా ఆకట్టుకునే విధంగా దాన్ని నడిపారు. పిల్లల కోసం నిజంగా ఒక చందమామలోకం సృష్టించింది. పిల్లల కోణం నుంచి ప్రతి కథనూ ఆయన తిరిగి రాయించేవారంటారు. అన్ని కథల్లోనూ ఏకరూప శైలి వుండేవిధంగా జాగ్రత్త వహించేవారు. ప్రతి కథ పిల్లలకు ఏదో ఒక జీవిత సత్యం చెప్పాలని లేదా ధైర్య సాహసాలు, చురుకుదనం పెంచాలని ఆశించేవారు. లక్ష్య సాధనలో చందమామ పూర్తిగా జయప్రదమైంది. ఇప్పటికీ పిల్లల పత్రికకు పర్యాయపదంగా నిల్చిపోయింది.

చిత్ర ప్రస్థానం..... 'షావుకారు'తో ప్రారంభం..

బిఎన్ సోదరులు 1947లో వాహినీ స్టూడియోను కొని విజయ స్టూడియోగా మార్చారు. 1950లో 'షావుకారు' తీశారు. ఎల్‌విప్రసాద్ దర్శకత్వంలో వెలువడిన ఈ చిత్రం ఉత్తమ విలువలతో రూపొందింది. ఎన్‌టిఆర్ హీరోగా తొలిసారి కనిపించగా షావుకారు జానకి పరిచయమైంది. ఎస్.వి.రంగారావు, గోవింద రాజుల సుబ్బారావులు ప్రతికూల పాత్రలు ధరించారు. గ్రామస్తులను పీడించుకు తినే వడ్డీ వ్యాపారి షావుకారు , ఒక రౌడీ చుట్టూ అల్లిన ఈ కథ సహజ గ్రామీణ వాతావరణాన్ని ప్రతిబింబించింది. ఎల్‌విప్రసాద్ ఈ చిత్రంతో బాగా పేరు సంపాదించారు. 1950 ఏప్రిల్ 7న విడుదలైన 'షావుకారు' వ్యాపార పరంగా పెద్ద విజయం

అదే ఆయన స్టైల్

ఆ గదిలో ఒక సినిమా ప్రదర్శన జరుగుతున్నది. హీరో పొడవాటి నిక్కరు, అస్తవ్యస్తపు చొక్కా వేసుకుని హడావుడి చేస్తుంటే పిల్లలు విరగబడి నవ్వుతున్నారు. వారి మధ్యలోనే చదువు రాని ఒక ముసలాయన కూడా కూచుని ఆనందిస్తున్నాడు. ఇదంతా వెనక నుంచి గమనిస్తున్నాడో పెద్ద మనిషి!

వీళ్లు ఇంతగా ఆస్వాదిస్తున్నారంటే మన సినిమా తప్పక హిట్టే నన్నాడు. ఆయనే చక్రపాణి అనబడే ఆలూరు సుబ్బారావు. అక్కడ ప్రదర్శిస్తున్నది తర్వాతి కాలంలో ఘన విజయం సాధించనున్న 'గుండమ్మకథ' ప్రివ్యూ.

జన రంజక సినీ జనకుడి వంటి చక్రపాణి పద్ధతే అది. తమ చిత్రాలు మేధావులనూ బుద్ధిజీవులనూ అలరించాలని ఆయన పెద్దగా కోరుకోలేదు. పత్రికా సమీక్షలు ప్రశంసలు కురిపించాలనీ ఆశించలేదు. ఆరోగ్యకరంగా వుండి ఆర్థిక విజయం సాధిస్తే చాలనుకున్నాడు.



చక్రపాణి, బి.ఎన్. రెడ్డి

సాధించలేదు గాని మంచి పేరు తెచ్చుకున్నది. ఆ తర్వాత వారు మళ్లీ అలాంటి చిత్రాలు తల పెట్టలేదు. జన రంజనకే పెద్ద పీట వేస్తూ కనకవర్షం కురిపించుకున్నారు.

జై పాతాళభైరవీ!

నాటికీ నేటికీ విజయాల చరిత్రలో తిరుగులేనిదిగా నిల్చిపోయిన పాతాళభైరవి 1951 మార్చి 15వ తేదీన విడుదలైంది. నేపాల మాంత్రికుడుగా ఎస్వీఆర్, తోట రాముడుగా ఎన్టీఆర్ నటించిన ఈ చిత్రం వసూళ్ల చరిత్రను తిరగరాసింది. 'ప్రేమకోసమై వలలో పడెనే పాపం పసివాడు, ఎంత ఘాటు ప్రేమయో' వంటి పాటలు గాని, జై పాతాళ భైరవీ,నరుడా ఏమి నీ కోరిక, సాహసము చేయరా డింగరి, వంటి మాటలు గాని తెలుగు భాషలో ప్రవేశించాయి. ఈ చిత్రానికి రచన పింగళి, దర్శకుడు కెవిరెడ్డి అయినా రూపశిల్పి మాత్రం చక్రపాణి.

తర్వాత చిత్రం 'పెళ్లి చేసి చూడు'. వినోదం, సంగీతమూ, సందేశమూ మేళవించిన ఈ చిత్రం తెలుగుతో పాటు తమిళంలోనూ నిర్మించారు.

తర్వాత భారీ జానపదం 'చంద్రహారం' తీశారు గాని అది విజయం సాధించలేదు. ఇందుకు కారణం చక్రపాణి భాషలో పైన చూశాం.

అన్నీ ఆణిముత్యాలే!

తర్వాతి కాలంలో విజయా సంస్థ వరుసగా మనోజ్ఞ చిత్రాలందిస్తూ వచ్చింది.అవన్నీ తెలుగులో విలక్షణ కళాత్మక విలువలకు ప్రసిద్ధికెక్కాయి. మిస్సమ్మ,మాయాబజార్, అప్పుచేసి పప్పుకూడు, జగదేక వీరుని కథ, గుండమ్మ కథ వీటిలో ఒకో సినిమా గురించి ఎంతైనా చెప్పుకోవచ్చు. వీటిలోని తారాబలమూ, సంగీత శ్రావ్యత, సాంకేతిక ప్రజ్ఞ వగైరాలన్ని ప్రామాణికతకు మారు పేరుగా నిల్చిపోయాయి. మిస్సమ్మ, మాయాబజార్, గుండమ్మ కథ మూడింటిలోనూ అప్పటి అగ్రకథానాయకులిద్దరితో పాటు సావిత్రి, ఎస్వీఆర్ తదితరులు నటించారు. ఈ చిత్రాలన్ని హాస్యానికి పట్టం కట్టడంతో పాటు పాత్రల చిత్రణలోనూ, సంభాషణలలోనూ కొత్త వరవడి పెట్టాయి. ఇందులో పింగళితో పాటు చక్రపాణి పాత్ర కూడా చాలా వుంది. గుండమ్మ కథకు తమిళంలో దర్శకత్వం వహించింది చక్రపాణి. మిస్సమ్మలో నిరుద్యోగంతో పాటు మత సామరస్యం, పెళ్లిచేసిచూడులో వరకట్నం, అప్పుచేసి పప్పుకూడులో పేరుకుతగినట్టే లేనిపోని పటాటోపాల బండారం వంటివి సున్నితంగా చిత్రించారు. ఇక గుండమ్మ కథలో రామారావు, మాయాబజార్‌లో ఘటోత్కచుడు, మిస్సమ్మలో రేలంగి నాగేశ్వరరావు, పెళ్లిచేసి చూడులో ఎస్వీఆర్ ధరించిన వియ్యన్న పాత్ర వంటివి ఎప్పటికీ మర్చిపోలేనివే. చక్రపాణిలో మేధస్సూ, హాస్యమూ, కథనచాతుర్యమూ వున్నా అనారోగ్యం వల్ల ఎక్కువ చిత్రాలు స్వయంగా తీయలేకపోయారని కొడవటిగంటి రాశారు.

1962లో వచ్చిన 'గుండమ్మ కథ' తర్వాత విజయా వారు తీసిన చిత్రాలు ఆ స్థాయిని చేరలేదు గాని విజయాలు సాధించాయి. 'సిఐడి' అప్పటికి కాస్త వెరైటీగా అనిపించి పాటలతో ఆకట్టుకుంది. కెవిరెడ్డి పై అతి భరోసాతో తీసిన సత్య హరిశ్చంద్ర, ఉమా చండీ గౌరీ శంకరుల కథ పరాజయాల తర్వాత ఆయననూ, పింగళిని, తక్కిన సాంకేతిక నిపుణులనూ పంపించేశారు. హిందీలో ఎక్కువగా తీయడం మొదలెట్టారు. 'రాముడు భీముడు' ను 'రామ్ ఔర్ శ్యామ్' పేరిట హిందీలో తీసి విజయం సాధించారు. దాన్ని కాపీ కొట్టి తీసిన 'సీతా ఔర్ గీతా' హక్కులు కొని 'గంగ మంగ'గా పునర్నిర్మించారు. విజయావారి పరంపరలో ఆఖరి చిత్రం 1975లో వచ్చిన శ్రీరాజేశ్వరీ విలాస్ కాఫీ క్లబ్. దీని బాధ్యత పూర్తిగా చక్రపాణిదే. కొన్ని విషయాల్లో మిస్సమ్మను పోలి వుండే ఈ చిత్రం కొంత తీసిన తర్వాత ఆయన తీవ్రమైన అనారోగ్యానికి గురైనారు. చక్రపాణి పేరు అలాగే వుంచి బాపు దాన్ని పూర్తి చేశారు. 'రాకోయి అనుకోని అతిథి' అని పాడుతూ జయప్రద బాపూ బొమ్మగా ముస్తాబైనప్పటికీ ఇతర సన్నివేశాలు మాత్రం చక్రపాణీయాలే. ఎప్పుడు చూసినా హాయిగా అనిపించే ఆ చిత్రం తెలుగువారికి ఆయన ఆఖరి కానుక. చిన్నవయస్సులోనే క్షయవ్యాధికి గురై ఒక్క వూపిరి తిత్తుతోనే బతికినా కళా సాహిత్యాలే శ్వాసగా జీవించిన చక్రపాణి అందరితో చక్కన్న అనిపించుకుని చక్కెర పాకం లాంటి తియ్యని చిత్రాలను అందించి 1975 సెప్టెంబరు 24 మద్రాసులో విజయావారి ఆస్పత్రిలోనే ఆఖరి శ్వాస విడిచారు.

చమత్కారాలూ...ఛలోక్తులూ...

'మెసేజ్ ఇవ్వాలంటే టెలిగ్రాం పంపించు. సినిమా తీయడమెందుకు?' అన్న ఆయన మాటను తరచూ ఉటంకిస్తుంటారు. అయితే ఆయన తీసిన సినిమాలన్నిటిలోనూ పూసల్లో దారంలా ఏదో ఒక మానవీయ భావన తళుక్కుమంటుంది. ఆయన చేతుల్లో తెలుగు సినిమా సర్వాంగ సౌందర్యం సంతరించుకుంది. చక్రపాణి ఒక తేనె పట్టు. ఒక పిల్లగాలి వీవన. ఒక మృదు మధుర భావన.

చక్రపాణితో ముడిపడిన చమత్కారాలూ, ఛలోక్తులు లెక్కలేనన్ని. గుండమ్మ కథ కన్నడ చిత్రంలో ఆమెకు భర్త వుంటాడు. మళ్లీ ఆయనెందుకూ దండగ అని తీసి పారేశారు. "ఇంతకూ గుండమ్మ గయ్యాళి అని చెప్పే సన్నివేశం ఒక్కటైనా లేదే?" అని ఎవరో సందేహం వెలిబుచ్చితే 'సూర్యకాంతం వేషం కట్టాక వేరే చెప్పడమెందుకు?' అని తేల్చిపారేశారు. అదో చిత్రమైన సినిమాసెన్స్.

బిఎస్సుబ్బారావు 'భీష్మ' చిత్రంలో ఎన్టీఆర్ మొదటిసారి ఆ పితామహుడి పాత్రలో కనిపించారు. ఎవరో వచ్చి చక్రపాణితో 'ఎన్టీఆర్ మేకప్ భలే కుదిరింది. ఎవరూ గుర్తు పట్టలేరు' అని చెప్పారట. 'అంత గుర్తు పట్టలేకపోతే ఇక రామారావెందుకు నేనే వేషం వేస్తా పదమన్నాడట'!

జై పాతాళ భైరవి ఘన విజయం తర్వాత భారీ వ్యయంతో విజయా వారు భారీ వ్యయంతో తీసిన "చంద్రహారం" ఘోర పరాజయం పాలైంది. ఆ సంగతి ఎవరో ఆయనతో చెబితే- కాకేమవుతుంది? పాతాళభైరవిలో సాహసాలు చేసిన హీరో ఈ సినిమాలో సగం సేపు మంచంపట్టి వుంటాడాయె అని విశ్లేషణ చేశారు.

అయితే చక్రపాణి అంటే కేవలం హాస్యమే కాదు. చాలా గట్టి మనిషి కూడా. నాటికీ నేటికీ నవ్వులు కురిపించే మిస్సమ్మలో భానుమతిని హీరోయిన్‌గా, సావిత్రిని రెండవ హీరోయిన్‌గా తీసుకున్నారు. అయితే అప్పటికే భానుమతి సతాయిస్తుండటంతో ఆమెను నిస్సంకోచంగా మార్చేసి సావిత్రిని నాయికను చేశారు. రెండవ స్థానం జమునకిచ్చారు. ఇలాంటి ఘటనలు చాలా వున్నాయి.

Entered

దిగులు చూపుల శివార్లలో.... అచ్చ తెలుగు కవిత్వం"

ఈ కవితా సంపుటికి ప్రఖ్యాత కవి, విమర్శకులు, డా॥ అద్దేపల్లి రామమోహన్ రావు, ముందుమాట రాశారు. కవిత్వాభిమానిగా చెమన్... చివరన చాలా విలువైన విశ్లేషణ చేశారు. కొండేపూడి నిర్మల, ఓల్గా, విమల, జయప్రభ, పాటిబండ్ల రజని లాంటి వారి కవిత్వం ఒకానొకప్పుడు ఆకర్షించడమే కాదు. ఆలోచింపచేసింది. సామాజికాంశాల్లో.... స్త్రీ యొక్క కోణాల్ని సమగ్రంగా విశ్లేషింప చేసింది. వనితల్లో వివేకం పెంచింది. సామాజికాంశాల్లో ... స్త్రీ యొక్క కోణాల్ని సమగ్రంగా విశ్లేషింపజేసింది. వనితల్లో వివేకం పెంచింది. శోకం నుండి శ్లోకం ఆవిర్భవించింది. సాహిత్యంలో అనేక మార్పులొచ్చాయి. వాగ్దేవి స్తుతి నుండి వాడుక భాష దాకా, పద్యం నుండి గద్యం దాక... వచనం నుండి నేటి నానీల దాకా... ఎన్నో మార్పులు చేర్పులు... కూర్పులు వచ్చాయి. సాహిత్యంలో సర్రియలిజం/ ఇమేజియం/ ఇంప్రెషనిజమ్‌కు / మోడర్నిజం/ పోస్టు మోడర్నిజం/...లాంటి వివిధ ధోరణులు వచ్చాయి... అనేక వాదాలు వచ్చాయి... (దళిత, స్త్రీ వాద, ముస్లిం వాద, మైనార్టీ వాద /ప్రపంచీకరణ వ్యతిరేకత...) ఏ మూసలోను ఇమడకుండా తనకు తానుగా... ప్రత్యేక ముద్ర ప్రత్యేకతను సి. హెచ్ ఉషారాణి కలిగి వుంది. ఆమె ఏ ఇజాన్ని చెప్పదు... ఆలోచింప చేస్తుంది. అవగాహన పెంచుతుంది. **"A poem Is What Happens When it Read"** అంటాడు కాడ్వెల్. ఉషారాణి కవితల్లో భావ వ్యక్తీకరణలో నవ్యత, తెలంగాణ పదాల పలుకుబడులు (పల్లీయిత్తులు /పతంగులు/ హల్కా) అణచివేయబడిన స్త్రీ ఆవేదనలు, ప్రగాఢంగానే ఉంటై, వాటిని స్పష్టంగా వెలువరించడం ద్వారా అవే కవితల్లో జీవనాడి నింపుకొంది. అద్దేపల్లి వారు అన్నట్లుగా కవితల్లో చక్కటి శిల్పాన్ని అనుసరించడంలో నవ్యమైన ధోరణి ఈమె అనుసరించింది. అలాగే కవితలో అంతస్రవంతిగా వచ్చిన భావాల పరాకాష్టగా ముగింపు ఉండటం... అతి సహజంగా ఉండటం... అణచివేత నుండి స్వేచ్ఛ కావాలనే తపన ప్రతి కవితకీ సారం కావడం గమనార్హం... విస్తృత వస్తు శిల్పాలతో సాగిన ఈమె కవిత్వంలోని కొన్నింటిని చూద్దాం......

'నా బాల్యం' (పేజీ 1) అనే కవిలో ' నా వోణి రెప రెపలాడగానే ఉలిక్కి పడ్డాను"

'నిజంగానే! నా బాల్యం నాకు చెప్పకుండానే



'నా ఒడిలో నుండి జారుకుంది...!

'అనుక్షణం' (పేజీ3) 'చూరు దాటి పొగ కురిసే! చినుకులకి/చెదిరి పోతున్నట్లుగా! నేను కూడబలుక్కొన్న మనస్సు! కంటి వంతెనని దాటె నీరు...."

దిగులు చూపుల శివార్లలో" (పేజీ 5) ఈ కవితలో ప్రతి లైను మనల్ని కదిలిస్తుంది.

'కాంతి వలయాలను కప్పుకొన్నది నల్ల గులాబీనే! అన్నంత నిజంగా...."

ఒంటరిగా విరక్తి గూడుల్ని నిర్మించుకోవడం మొదలెట్టాను....

...'నీ ప్రయత్నాలన్నీ ఆ ప్యాయతల రేణుల్ని చీలుస్తున్నట్లే తోస్తాయి..."

(చివరిలైను) "మౌనాన్ని ఇంకా మధ్యవర్తిగా మరి ఏ మాత్రం వుంచలేను".

"మనోవర్తిగా మిగిలి" (పేజీ 13) కవితలో రచయిత్రి చివరలో చక్కటి ముగింపు ఇచ్చారు. ఒగ్గు కథలో రెండు పాత్రల్నీ నేనే ధైర్యంగా అభినయిస్తున్నాను!

అయిన వారి పంచన చేరడాలు లేవు! ఇక మీ మాటలతో నా మనస్సుకి పంచనామాలు జరిపించడాలు లేవు! తడిసిన పిచ్చుక రెక్కలు దులపరించుకొంటుంది".

"సరికొత్త జీవిక"(పేజీ 15) "నువ్విక్కడే ముగిస్తావు కథని/ నేను ఇప్పుడే మొదలెడతాను జీవితాన్ని"-

'జోగిని" (పేజీ 20) కవిత ఈ వ్యవస్థలో దురాచార సంస్కృతి ఉన్నత కాలం నిలిచే కవిత.

"నీకాల్ మొక్కతా దొర! అని మా నాల్కతో నీ చెప్పుల్ని తుడిపిస్తాం!

సాగనంపడాలు లేని! నిత్యపు పెళ్ళి కూతుళ్ళం! గుట్టల్లో గొచ్చి పువ్వులం" (పేజీలు)

"రెక్క విరిచిన సీతాకోక" కవితలో (పేజీ23) "రాజీ పడడాన్ని కాచి వడబోసిన అనుభవం లా వుంటావు! చెప్పాలనుకున్న వూహలకి!

గుంభనంగా బురఖాలేస్తావు!"

పోచంపల్లి (పేజీ 37) కవిత, ఆమె (పేజీ 43) చూపుడు వేలి నీడలో...(పేజీ49) బిళ్ళంగోడు (పేజీ 53) కవితల్లో కవిత్వాన్ని జీవితానుభవాల్తో అధ్యయనం చేయదగిన మంచి కవితలు...

అన్ని కవితల గురించి (ముఖ్యమైన వాటి) ముదిగంటి సుజాతారెడ్డి గారు రాసిన నిశ్శబ్ద గేయాలు వ్యాసంతో కూడిన అభిప్రాయం చాలా సమగ్రత నిచ్చింది. ఈ పుస్తకానికి... కవిత్వమొక తీరని దాహం... నిజమైన కవిత్వాభిమానుల దాహార్తిని తీర్చే ఆలోచనా వంతమైన కవిత్వం ఈ గ్రంథంలో వుంది. ఆంగ్ల పదాలు చాలా చోట్ల పీఠం వేశాయి. భావం చెడకుండా వాటికి స్థాన భ్రంశం కవయిత్రి మలిముద్రణల్లో కల్పించాలి. విమర్శకాదు... సూచన మాత్రమే.....

ఉదా॥ చీప్‌గా (పేజీ5), కాన్వెంట్ (పేజీ11), కరెంటు (పేజీ 11), టైపు (పేజీ 13), క్యారెక్టర్ (పేజీ 15), బెల్లు (పేజీ-16), ఫొటో (పేజీ-17), ఫ్రేము (పేజీ 23), ప్లేట్లు, ఫోటోలు (పేజీ 25), మర్డర్: ఘాట్ రోడ్డు (పేజీ 27), నైలాన్ (పేజీ 26), డిజైన్ (పేజీ 33), ఫ్యాషన్ పరేడ్ (పేజీ 34), హైజాక్ , ఫైలు (పేజీ 44), ఛైనులా /బరఫ్‌లా (పేజీ 47), ట్రైనింగ్ (పేజీ 47), బ్లాక్ మెయిల్ ట్రెండు (పేజీ 49), స్కానింగ్ (పేజీ 50) ట్రాన్స్.... హిప్నాటిస్ట్ లాంటి పదాలు గ్రామీణ పాఠకులకు తెలియవు. ఆలోచించగలరు.

గ్రంథం దిగులు చూపుల శివార్లలో
(కవితా సంపుటి)
రచన: సి. హెచ్ ఉషారాణి
పేజీలు:68, వెల:25/-
ప్రతులకు: సి-242, హుడా కాలనీ, చందానగర్, హైదరాబాద్.

- తంగిరాల చక్రవర్తి



హాస్య రచనలు

డా॥ ద్వా.నా. శాస్త్రి
వెల:25/-,
పేజీలు:54
ప్రతులకు:
విశాలాంధ్ర బుక్ హౌస్
అబిడ్స్, సుల్తాన్ బజార్, హైదరాబాద్.



రాగింగ్ మనకొద్దు

రచన: డి. నటరాజ్
వెల:20/-, పేజీలు:56
ప్రతులకు:
డి. నటరాజ్
9-3-6/2, షణ్ముఖప్లాట్స్
కూరగాయల మార్కెట్టు ఎదురుగా
పిఠాపురంకాలనీ, విశాఖపట్నం.

ఆమె నీడలో...

క్రైమ్ స్టోరీ

యర్నాగుల సుధాకరరావు

కోర్టులో మాటలు గుర్తుకురాగా పద్మ సన్నగా రోదించింది.

ఒకేడాది గడిచిపోయింది.పద్మను కలవడానికి జడ్జిగారు రానే వచ్చారు. వారికి ఒకగదిలో మాట్లాడేందుకు వీలుకల్పించారు జైలు సిబ్బంది.

"ఇప్పుడు చెప్పమ్మా! నన్ను నమ్ము.నేను నీతరుపున మళ్లీ కోర్టులో నీకు న్యాయం చేయలేను.అక్కడ నువ్వు కాదంటే నాది ప్రయాసే అవుతుంది.కనుక నేను నీలో దాగిన నిజం తెలుసుకోవాలని అనుకుంటున్నాను. ఎవరికోసం నీవు ఇంతగా త్యాగం చేశావన్నది నాకు తెలియాలి.

భర్తను చంపినకేసులో ఆరేళ్ల జైలుశిక్ష పడింది. తొలిరోజు సెంట్రల్ జెయిల్‌లో బ్యారక్‌లో ఒక మూలకూర్చుంది పద్మ(30). కొత్తకనుక ఒక్కదానికి ఒక బ్యారక్‌లో పెట్టారు. అందుకు కారణం ఉంది. ఆమెకు ఏదో మానసికరోగం పట్టిపీడిస్తుంది అని జైలుకు వచ్చిన రోజే సిబ్బందికి తెలిసింది. అందుకే ఒంటరిగా పెట్టారు. పద్ధతి ప్రకారం కొత్తఖైదీని పాతవారితో కలిపి పెడతారు. వరండాలో వెలుగుతున్న బల్బు కాంతిలో తనను తాను సముదాయించుకుంది. ఆమెకు జడ్జిగారు అడిగిన ప్రశ్నలు పదేపదే గుర్తుకు రాసాగాయి.

"పద్మా ఏప్రశ్నకు నీవు సరైన సమాధానం ఇవ్వకున్నావు. కారణం ఏమిటి? సరే, నీవు ఎందుకు నీభర్తను చంపావు?"

"అతడు నన్ను హింసించాడు. భరించాను నాతండ్రిని నాకళ్లెదుటే అవమానం చేసి చేయిచేసుకున్నాడు. పిల్లనిచ్చినవాడు కనుక భరించాడు. కానీ, నాఅత్తమామలను కూడా చావగొడ్తుండేవాడు. వాళ్లు భరిస్తునే ఉండేవారు. ఒకరోజు నాచెల్లెలు నాకోసం నాఇంటికి వస్తే నానాఅల్లరి చేశాడు. ఆరాత్రే నాబంధువు తోడుతో పారిపోయింది"

తొలిసారి పెదాలు విప్పి చెబుతుంటే కోర్టులో అంతా ఆసక్తిగా విన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మధ్యలో ఆమెకు అడ్డు తగలబోతే జడ్జి సైగలు చేశాడు. అతడు కూర్చుండిపోయాడు.

"నువ్వు చెప్పు. నీచెల్లెలను అవమానించబోతే నువ్వు నీభర్తను చంపేస్తావా?"

"నేను చెప్పుకోలేని ఒక నీచాన్ని నాభర్త చేశాడు. అందుకే చంపక తప్పలేదు. నేను బయటపెడితే మరో కాపురం బుగ్గిపాలవుతుంది. అందుకే చెప్పలేకపోతున్నాను. నాకు ఉరివేసినా చెప్పను"

"నువ్వు ఎవరికోసమో త్యాగం చేస్తే చాలా ఏళ్లు పాటు జైల్లలో మగ్గిపోవాల్సివస్తుంది."

మౌనంగా తల దించుకుంది.

"సరే నువ్వు దాచుకోవాలంటే అది నీఇష్టం.నువ్వు నీభర్తను చంపావా?లేదా?"

"ఇష్టపడి మరీ చంపాను. నాభర్త చావాలి.లేకుంటే చుట్టూ ఉన్న సమాజం పాడైపోతుంది.చంపడం అనేది సరైనశిక్ష."

"నీకు ఏదో మానసిక జబ్బున్నట్టుంది.ఏదేదో చెబుతున్నావు. ఏది నీకు పనికివచ్చేలా కోర్టుకు పనికివచ్చేలా, ఇక్కడ తీర్పు ఇవ్వడానికి పనికి వచ్చేలా లేనేలేవు."

మళ్లీ మౌనం వహించింది.

"సరే ఎలా హత్యచేశావు?"

"కత్తితో కసిగా పొడిచి చంపాను"

"ఇదేనా ఆకత్తి" అని ఒక గుడ్డలో చుట్టబడిన కత్తి చూపించాడు జడ్జి. కనీసం కత్తివైపు ఆమె చూడలేదు.

"నాకు వాడిని చంపడం ముఖ్యం. నాచేతిలో కత్తి చిన్నదా పెద్దదా అనేది కాదు. మాఇంట్లో కూరగాయలు తరుక్కునే కత్తితో నేను వాడు తాగిన మైకంలో ఉండగా పొడిచి చంపాను"

"అతడు నీకంటే బలమైనవాడు కనుక నిన్ను నెట్టుకుని పోలేదా? ఈహత్యలో ఎవరైనా సాయపడి ఉంటారు నువ్వు ఇక్కడ మళ్లీ ఎవరినో దాస్తున్నావు. నీవు ఇలా అయితే శిక్షకు గురికాక తప్పదు"

"అయ్యా! మీరు మీన్యాయం ప్రకారం వేయాల్సిన శిక్ష నాకు విధించండి. నేను చంపాను అని పదేపదే చెబుతున్నాను. "

ఆరేళ్లు జైలు శిక్ష వేసాక కోర్టులో అంతా ఆమెను జాలిగా చూసారు.

జడ్జి ఆమెను తనదగ్గరకు రప్పించుకుని "నీకు శిక్షపడింది. ఇప్పుడైనా నాకు నిజం చెబుతావా?"

"జైలులో ఎప్పుడైనా తమరు రాగలిగితే మీముందు ఏదీ దాచను. అదీ మనద్దిరిమధ్య ఉండాల్సిందే. నాకు మీపై చెప్పవచ్చు అని నమ్మకం కల్గినప్పుడు మాత్రమే చెబుతాను"

కోర్టులో మాటలు గుర్తుకురాగా పద్మ సన్నగా రోదించింది.

ఒకేడాది గడిచిపోయింది.పద్మను కలవడానికి జడ్జిగారు రానే వచ్చారు. వారికి ఒకగదిలో మాట్లాడేందుకు వీలుకల్పించారు జైలు సిబ్బంది.

"ఇప్పుడు చెప్పమ్మా! నన్ను నమ్ము.నేను నీతరుపున మళ్లీ కోర్టులో నీకు న్యాయం చేయలేను.అక్కడ నువ్వు కాదంటే నాది ప్రయాసే అవుతుంది.కనుక నేను నీలో దాగిన నిజం తెలుసుకోవాలని అనుకుంటున్నాను. ఎవరికోసం నీవు ఇంతగా త్యాగం చేశావన్నది నాకు తెలియాలి.

పద్మ నవ్వి "సార్ నమ్ముతున్నాను. నేను నాభర్తను అసలు నేను చంపలేదు. ఆనేరం నామీద వేసుకున్నాను.చంపింది నా అత్త మావయ్య కలిసి కత్తులతో పొడిచి చంపారు. ఎందుకంటే నాభర్త మాపొరుగింటి ఆవిడ మాఇంటికి వస్తే ఆమెకు పాయసంలో మత్తుకలిపి ఇచ్చి స్పృహ తప్పించాడు. ఆతరువాత ఆమెను వివస్త్రనుచేసి చిన్న డిజిటల్ కెమెరాతో ఫోటోలు తీశాడు. ఆమెను అతడు చెరుస్తుండగా నన్ను కెమెరాతో తీయమన్నాడు. నేను కాదన్నాను. 'ఆమెను వదిలేయ్. పాడుచేయొద్దు' అని మొత్తుకున్నాను. ఎంతకీ వినలేదు. నన్ను తీవ్రంగా కొట్టాడు. నా అత్తవచ్చి అడ్డుకుంది.అతడు వినలేదు. ఆపశువు పక్కింటావిడమీద పడ్డాడు. వెనుక నుంచి మాఅత్తయ్య వచ్చి రెండు కత్తివేటులు వేసింది.వాడు అరవలేని విధంగా ఒకవ్రేటుపడింది. మరో వ్రేటుతో తాగి ఉన్నందున కుప్పకూలాడు. పక్కింటావిడకు చీరచుట్టేసి పక్కింటిలోకి తీసుకుని వెళ్లి మంచం మీద వేసి వచ్చాం. ఆమెగురించి వేరెవ్వరికి తెలియదు.

తిరిగి ఇంటికి వచ్చేసరికి మావయ్య నాభర్తను కత్తితో చచ్చేవరకు పొడిచి పొడిచి చంపాడు.

"అప్పుడు ఆకేసు నేను నానెత్తిన వేసుకుంటానని చెప్పాను. అత్త మావలు ఇద్దరు అనారోగ్యంతో ఉన్నవారే. వారికోసం పక్కింటావిడ కోసం కోర్టులో నోరు విప్పలేదు".

జడ్జి నిర్ఘాంతపోయాడు.

★

భక్తి రసం డేంజర్

- సత్య

"నువ్వెన్నన్నా చెప్పు తాతయ్యా. మన ప్రయత్నం మనం చేయటంతో పాటు దేవుడి కటాక్షం కూడా ఉంటేనే ఫలితం ఉంటుంది. నాతోపాటు నువ్వు కూడా ఒక్కసారి చిలుకూరు బాలాజీ గుడికి రా, నీ ఆరోగ్యం ఎలా మెరుగుపడుతుందో చూద్దువుగానీ"

"చిలుకూరి బాలాజీ వీసాలిప్పించటంతో పాటు ఆరోగ్య పరిరక్షణ కూడా చేస్తున్నాడా, అయితే ఇంకేం ఎలాగూ తనది దేవుడి పాలనే అంటున్నాడుగా రాజశేఖరరెడ్డికి సలహా ఇద్దాం రాజీవ్ ఆరోగ్యశ్రీ పేరుతో కోట్లకు కోట్లు తగలేయటమెందుకు. రాష్ట్రంలోని రోగులందరినీ చిలుకూరుకు ఉచిత దర్శనం చేయించమని.."

"తాతయ్యా! నీకు ఎలా చెప్పాలో తెలియటం లేదు. అందరూ మారుతున్నా నీవు మాత్రం మారనంటావు. వెళ్లే వాళ్లందరికీ నీ మాత్రం తెలియదంటావా? మనకు తెలియని శక్తి ఏదో ఉంది లేకుంటే జనం కుప్పలు తెప్పలుగా గుళ్లు, గోపురాలకు ఎందుకు వెళుతున్నారంటావ్?"

"మనవడా! దేవుడంటూ ఉంటే ఇన్ని ఘోరాలు, నేరాలు ఎలా జరుగుతున్నాయి. ఈ దారిద్ర్యం, ఆకలి ఎందుకున్నాయి?"

"ఇది కూడా తెలియదా తాతయ్యా? పూర్వజన్మలో మనం చేసుకున్న కర్మను బట్టే ఏదైనా ఉంటుంది"

"అదే అయితే మరి దేవుడి గుళ్లు, బాబాలు, స్వాములు చుట్టూ తిరగాల్సిన అవసరం ఏముంది నాయనా. పూర్వజన్మ సుకృతం ఎలా ఉంటే అలా జరుగుతుందని, ఏది జరిగినా మన మంచికే అనుకోవచ్చుగా"

"తెలుగునాట భక్తి రసం పారుతోంది. డేంజరుగా మారుతోంది అన్న గజ్జల మల్లారెడ్డి ఎప్పుడో చేసిన హెచ్చరిక ఇప్పుడు నిజం అవుతోంది"

★★★

ఇది ఒక ఇంట్లో తాతా మనవళ్ల సంవాదం కాదు. ఆ తాతగారు ప్రతి ఒక్కరికీ తనమీద తనకు నమ్మకం ఉండాలంటారు. ఈ మనవడు మన మీద మనకు నమ్మకంతో పాటు దేవుడి కటాక్షం కూడా పొందితే తప్పేముందంటాడు.

ఆర్థిక వ్యవస్థ దిగజారుతున్న కొద్దీ సమాజంలో మూఢనమ్మకాలు పెరుగుతాయి. పరిమిత అవకాశాలను తామే దక్కించుకోనేందుకు పోటీ పడతారు. సమాజం ఏమైతే నాకేం అనుకుంటారు. కష్టపడటంతో పాటు మొక్కితే మనకు పోయేదేముందిలే అని కనిపించిన ప్రతి చెట్టూ పుట్టను ఆశ్రయిస్తారు. ఇటువంటి స్థితిలో జ్యోతిషం చెప్పేవారికి, మానవ బలహీనతలను సొమ్ము చేసుకొనే బాబాలు, స్వాముల సంగతి చెప్పేదేముంది.

ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ ఒక స్వచ్ఛంద సంస్థగా నమోదైంది. దాని నిర్వాహకుడు గురు రవిశంకర్. బెంగుళూరు శివార్లలోని 30 ఎకరాల విస్తీర్ణంలోని ఆశ్రమం, ఇతర ఆస్తుల విలువ, టర్నోవర్ దాదాపు 400 కోట్లని ప్రభుత్వశాఖలు అంచనా వేశాయి. అనుమానాస్పద పరిస్థితుల్లో ఇద్దరు విద్యార్థులు మరణించిన ఉదంతంతో అహమ్మదాబాద్‌లోని ఆశ్రమబాపు ఆశ్రమం వార్తలకెక్కింది.

ఒకసారి మార్టిన్ లూథర్ కింగ్ 'మానవాళిపై కొందరి దుర్మార్గాలు కాదు విషాదం, అత్యధికుల మౌనమే' అన్నాడు. 'పోనీయండి మనకెందుకు ఎవడి పాపాన వాడు పోతాడు' అన్న ధోరణి సమాజాన్ని పిరికివారిగా మారుస్తోంది. తెలిసీ తెలియక ఎవరైనా బాబాల బారిన పడ్డారో దానికి ఎలాంటి చికిత్స ఉండదు.

తామర తంపరగా పుట్టుకొస్తారు.

వారు హైటెక్ హంగులు, కార్పొరేట్ పొంగులు సమకూర్చుకొంటే నా సామిరంగా వారికి ఇంక తిరుగేముంది! ఏ వ్యాపారంలోనూ రానన్ని లాభాలు వస్తాయి. అవి కూడా ఎక్కువ భాగం పేదలనుంచే సుమా. ఈ సొమ్మంతటినీ ప్రత్యక్షంగానో పరోక్షంగానో పేదలకు వ్యతిరేకంగానే వినియోగించబడుతున్నది.

ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ ఒక స్వచ్ఛంద సంస్థగా నమోదైంది. దాని నిర్వాహకుడు గురు రవిశంకర్. బెంగుళూరు శివార్లలోని 30 ఎకరాల విస్తీర్ణంలోని ఆశ్రమం, ఇతర ఆస్తుల విలువ, టర్నోవర్ దాదాపు 400 కోట్లని ప్రభుత్వశాఖలు అంచనా వేశాయి. అనుమానాస్పద పరిస్థితుల్లో ఇద్దరు విద్యార్థులు మరణించిన ఉదంతంతో అహమ్మదాబాద్‌లోని ఆశ్రమబాపు ఆశ్రమం వార్తలకెక్కింది. బాపు అనుచరులు మీడియా జనాన్ని చితకబాది తామేంటో చూపెట్టారు. ఈ బాపు గారి ఆస్తుల విలువ 350 కోట్లయితే, కేరళ మాతా ఆనందమయి 'అమ్మ'గారి సంపద 400 కోట్లు. సుధాంశు మహరాజ్‌కు 300 కోట్లు, మురారి బాపుకు 150 కోట్లు ఉన్నాయి. ఇక క్యాన్సర్‌ను కూడా యోగాతో నయం చేస్తానన్న బాబా రామ్‌దేవ్‌కు 400 కోట్లు. ఈయనగారి దగ్గర యోగాకు సాధారణ సభ్యత్వ రుసుము పదకొండువేలు, గౌరవ సభ్యత్వానికి 21 వేలు, స్పెషల్‌కు 51 వేలు, జీవిత సభ్యత్వానికి లక్ష, ప్రత్యేక సభ్యత్వం రెండు లక్షల 51వేలు, ఫౌండర్ మెంబర్ ఐదులక్షలు చెల్లించాలట.

ఓషో ఇంటర్నేషనల్ మెడిటేషన్ సెంటర్ల గురించి, ఇస్కాన్ కనీస సభ్యత్వ రుసుం పదివేలతో ప్రారంభం అవుతుంది. వీరితో పోల్చుకుంటే చిన్న, సన్నకారు, బలహీన బాబాలు, స్వాములు చాలా మంది ఉన్నారు. వారి లావాదేవీలు కూడా పదుల కోట్లలోనే ఉంటాయి. వీటికి ఎలాంటి పన్నులు ఉండవు. పన్నులు వసూలు చేసే వారే వీరికి పరమభక్తులుగా ఉంటున్నారు. ఈ సొమ్మంతా ఏమౌతోందో ఎవరికీ తెలియదు. ఇవన్నీ వ్యాపారం గాక భక్తి అందామా?

ఒకసారి మార్టిన్ లూథర్ కింగ్ 'మానవాళిపై కొందరి దుర్మార్గాలు కాదు విషాదం, అత్యధికుల మౌనమే' అన్నాడు. 'పోనీయండి మనకెందుకు ఎవడి పాపాన వాడు పోతాడు' అన్న ధోరణి సమాజాన్ని పిరికివారిగా మారుస్తోంది. తెలిసీ తెలియక ఎవరైనా బాబాల బారిన పడ్డారో దానికి ఎలాంటి చికిత్స ఉండదు. ఎయిడ్స్ కంటే ప్రమాదకరం. దాన్నే నిరోధించేందుకు ప్రయత్నిస్తున్న మానవాళి అంతకంటే ప్రమాదాన్ని చూస్తూ మౌనం వహించాలా?

★

శిల్పాల వనం

అదో అడవి. అందులో ఎన్నో శిల్పాలు.. అన్నిట్లోను జీవం పుట్టిపడుతుంది. విస్తృతమైన పరిశీలనకు ఎల్లలు లేని సృజనను జోడిస్తేనే అది సాధ్యమవుతుంది. ఇక్కడ అగుపిస్తూ అలరిస్తున్న బొమ్మలను చూస్తే ఆ విషయం అర్థమౌతుంది. వీటి సృష్టికర్త బ్రూనోటోర్ఫ్స్. ఈయన పుట్టింది దక్షిణ అమెరికాలో. పదిహేనేళ్ల వరకు అక్కడే పెరిగాడు. తర్వాత కుటుంబం యూరపు వలస వెళ్లింది. అలా ఎన్నో ప్రాంతాలను ఎన్నెన్నో జీవితాలను అధ్యయనం చేసే సువర్ణావకాశం ఆయనకు కలిగింది. ఆ అవకాశాన్ని వృథా చేసుకోకుండా కుంచెను రంగుల్లో ముంచి చిత్రాలు వేశాడు. శిల్పాలు చెక్కాడు. ప్రస్తుతం మన ముందున్న శిల్పాలన్నీ ఆస్ట్రేలియాలోని మెలిస్‌విల్లే అన్న కుగ్రామంలోనివే. ఇలాంటి శిల్పాలను చూడాలంటే మాత్రం అక్కడకు వెళ్లాల్సిందే....

కలం స్నేహం

హాయ్ చిన్నారి నేస్తాలూ!

మీకూడా వీళ్లలాగా కలంస్నేహం చెయ్యాలని ఉందా? మరి ఆలస్యం ఎందుకు? ఒక పోస్ట్‌కార్డు తీసుకొని మీ పేరు, వయసు, తరగతి, స్కూలు, హాబీలు, చిరునామా రాయండి. ఆ తర్వాత మీ **కలర్‌ఫోటో**ను అతికించి పోస్ట్ చెయ్యండి. అంతే ఎంచక్కా ప్రచురిస్తాం. అన్నట్టు, ఈ పుస్తకాన్ని మీ స్నేహితులకూ చూపించి అన్ని విషయాలు చెప్పండి. వాళ్లకు కూడా కలం స్నేహం చెయ్యాలని వుంటే కార్డు మీద రాసి మాకు పంపమనండే.

మరి మా అడ్రస్ **కలంస్నేహం**, బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్.

పేరు: మొసలి రమేష్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: జి.హెచ్.ఎస్. హై స్కూల్, బుర్గంపహడ్
లక్ష్యం: మంచి పేరు తెచ్చుకోవడం
హాబీలు: క్రికెట్ ఆడడం, చెస్ ఆడడం
చిరునామా: ఎం. రమేష్, చర్ల, ఖమ్మం.

పేరు: కె. సాహిల్
చదువు: 6వ తరగతి
వయస్సు: 10 సం॥
స్కూలు: గౌతమ్ మోడల్ స్కూల్
లక్ష్యం: ఆస్ట్రోనాట్ కావడం
హాబీలు: బొమ్మలేయటం, టీవీ చూడడం, ఆటలు ఆడడం, చదవడం
చిరునామా: కె. సాహిల్, సన్నాఫ్: లక్ష్మయ్య, ప్రజాశక్తి బుక్‌హౌస్, వివేక్‌నగర్, హైదరాబాద్.

పేరు: ఎం. మల్లికార్జున్ రావు
చదువు: 9వ తరగతి
వయస్సు: 14సం॥
స్కూలు: సెయింట్ ఇగ్నేషియస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్
లక్ష్యం: డ్యాన్సర్ లేదా మిలట్రీ ఆఫీసర్ కావడం
హాబీలు: డ్రాయింగ్, డ్యాన్సింగ్, చదవడం, ఆటలు ఆడడం
చిరునామా: ఎం. మల్లికార్జున రావు, శ్రీరామనగర్ కాలనీ, పత్తిపాడు, గుంటూరు.

పేరు: తూముల నాగమల్లాచారి
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: లేసియం స్కూల్
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవడం, టీవీ చూడడం, ఆటలు ఆడడం
చిరునామా: టి. భవ్యశ్రీ, సన్నాఫ్: పవన్‌కుమార్, బాలాపూర్, మిధాని, హైదరాబాద్.

పేరు: బి.హెచ్. కృష్ణ అఖిల్
చదువు: 6వ తరగతి
వయస్సు: 10 సం॥
స్కూలు: జడ్.పి.హెచ్.ఎస్.
లక్ష్యం: టీచర్ కావడం
హాబీలు: క్రికెట్ ఆడడం, పుస్తకాలు చదవడం
చిరునామా: బి.హెచ్. కృష్ణ అఖిల్, సన్నాఫ్: బి.హెచ్. సత్యనారాయణ, గురువుగారి వీధి పాలకొండ, శ్రీకాకుళం.

పేరు: డి. మల్లికార్జున్
చదువు: 10వ తరగతి
వయస్సు: 15 సం॥
స్కూలు: జడ్.పి.హెచ్.ఎస్
లక్ష్యం: డాక్టర్ కావడం
హాబీలు: పుస్తకాలు చదవడం, టీవీ చూడడం, ఆటలు ఆడడం
చిరునామా: డి. మల్లికార్జున్, రాయచూర్, మహబూబ్‌నగర్.